


digavalli1943@gmail.com

కీ.శే. దిగవల్లి వేంకట శివరావు (1898–1992) గారి అముద్రిత వ్యాసములు

మొదటి భాగము

సంపాదకుడు
దిగవల్లి రామచంద్ర

digavalli1943@gmail.com

Keerthi Seshulu Digavalli Venkata Siva Rao (1898-1992) Gari Amudritha Vyasamulu, Part 1


Price: 0

Editor:
Dr. D. Ramachandra
(M) 9441190133 / 8106216512

ISBN: 978-93-344-6865-6

e-book: Pothi.com

అంకితము



ఈ సంపుటి సంకలనాన్ని అభినందించి ఆనందించిన మా బావగారు(వియ్యంకుడు)

కీ.శే. చయనం సుబ్రమణ్యశర్మ (1942-2026) గారి

దివ్య స్మృతికి

సంపాదకుడు
దిగవల్లి రామచంద్ర

విషయసూచిక

సంపాదకుని విజ్ఞాపన

మా తండ్రిగారు కీ.శే. దిగవల్లి వేంకట శివరావుగారు తమ దీర్ఘ జీవితకాలంలో (1898-1992) న్యాయవాది వృత్తి చేస్తూ (1922-1964) సుదీర్ఘమైన చరిత్ర పరిశోధన కూడా సాగించి కొన్ని పుస్తకములు, అనేక వ్యాసములు రచించినారు. ధన సంపాదనే లక్ష్యముగా కాక స్వాతంత్ర్యోద్యమ కాలములో సాహిత్య పరంగానూ, వృత్తిపరంగానూ కూడా

తమవంతు దోహదము చేసిన అలనాటి రచయితలలో అగ్రగణ్యులుగా ప్రసిద్ధి నొందారు. వారు రచించిన గ్రంథములలో ప్రముఖముగా ఏనుగుల వీరస్వామయ్య గారి కాశీయాత్ర చరిత్ర 3వ కూర్పు (1941) మరియు 1941-1948సం॥ల మధ్య రచించిన కథలు-గాథలు 4 భాగములు ఈనాటికీ జనప్రియమై చారిత్రక విశేషాలతో కూడినవి. వారి వ్యాసములు 1918 సం॥నుండీ అనేక పత్రికలలో అనేక విశేషాలతో ప్రచురించబడినవి. 1940 సం॥ నుండీ ఒక దశాబ్దము పాటు వరుసగా ప్రతివారమూ వారి వ్యాసాలు ఆంధ్ర పత్రికలో చెళ్ళపిళ్ళ వారి వ్యాసాలతో సమానంగా ప్రచురించబడుతూ ఉండేవి.

నాన్నగారు రచించిన అనేక చేతివ్రాత ప్రతులలో పోగా మిగిలినవి ఇప్పుడు ఉపలబ్ధమైనవాటిలో ముద్రింపబడని వ్యాసాలు కొన్నిటిని (19) ఈ సంపుటిద్వారా ప్రచురించుట సాహసమే. ఎందుచేతనంటే కొంత శిథిలమైన కాగితాలలో వారి చేతి వ్రాతప్రతులు అవగాహనం చేసుకొనుట చాలా కష్టమైన పని. అందులోను చారిత్రక నామవాచకములు ఆ నాటి పరిభాషతో నిండి యుండిన మాటలు, స్థితిగతులు విశదమగుటు మరీ కష్టం. ఈ సంపుటిలో '18-19 శతాబ్దపు ఆంధ్ర ప్రముఖులు' అన్న శీర్షికలోనుండిన వ్యాసములు పూర్తి వ్యాసముల స్థాయిలో లేకపోయిననూ కొంత అరుదుగా దొరికే సమాచారముకూడా వున్నందు వలన వాటిని Short Notes గా అనుబంధములో ప్రకటించాను.

మా నాన్న గారు రచించిన పుస్తకాలు, వ్యాసాలు సంకలన కార్యక్రమం ఒక దశాబ్దమునకు పూర్వము నేను చేపట్టుటకు కారకులు నా లండను మిత్రులు శ్రీ పరుచూరి శ్రీనివాస్ గారు. మొదటిసారిగా కృత్రిమ మేధస్సు (A.I)ని ఉపయోగించి ఈ సంపుటిలోని అక్షర దోషాలను సవరణ చేయగలుగు ట కూడా వారి ప్రోత్సాహ ఫలితమే. వీరికి నా కృతజ్ఞతాభినందనలు.

ఈ సంపుటిలోని వ్యాసముల చారిత్రక విలువ నెరిగిన ముంబై వాస్తవ్యులు, సంస్కృతాంధ్ర సాహిత్యములతో పరిచయమున్న మిత్రులు శ్రీ చీర్ల చంద్రశేఖర్ గారు చేతివ్రాత ప్రతిలో క్లిష్టమైన వాక్యములను, పదములను వీలైనంతవరకు స్పష్టపరచటమే కాక ముద్రాదోషములను సవరించటములో కూడా సహకరించి నారు. వారి సహాయములేక ఈ సంపుటి ప్రచురణయోగ్యమైయ్యేది కాదని చెప్పడం అతిశయోక్తి కాదు. వారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. వారికి నేను ఋణగ్రస్తుడను.

నా పుస్తక సంకలన ప్రయత్నానికి సంతోషించి ప్రోత్సహించిన మా బావగారు (వియ్యంకుడు) శ్రీ చయనం సుబ్రమణ్యశర్మ గారు కూడా వాడుకలో లేని కొన్ని పదాలను, సంప్రదాయలను విడమర్చి చెప్పారు. ఈ సంపుటి సంకలనం పూర్తి కాకుండగనే 18-04-2026 తేదీన వారు పరమదించిరి. వారికి నేను ఋణగ్రస్తుడను.

ఇంకా అవగాహనం కాని మాటలకు ఖాళీలు వదలిపెట్టక తప్పలేదు. సంపాదకునిగా సూచించిన మాటలు వాలు అక్షరములతో ఇవ్వబడినవి. Foot Notesగా ప్రకటించిన వివరణలన్నీ సంపదాకునివే. రచయితగారి వివరణలు స్పష్టంగా ప్రకటించబడినవి. ఈ సంపుటి ఇ-పుస్తకముగా కూడా వెలువడినది. పోతి డాట్ కామ్(pothi.com) లో ఉచితముగా డౌన్ లోడ్ చేసుకొన వచ్చు.

ఈ సంపుటిని డి.టి.పి. రూపంలో అందించిన నా చిరకాల మిత్రుడు శ్రీ జి.ఆర్.కె మూర్తిగారికి, వారి సహాయకులు శ్రీమతి నుదురుపాటి దుర్గ గారికి నా కృతజ్ఞతాభి వందనములు.

మా నాన్నగారి గ్రంథములకు కాపీరైటు కలిగిన మా అన్నగారి కుమారుడు, అమెరికా వాస్తవ్యుడు డా. శివరావు సాహిత్యాభిమాని. ఈ సంపుటి ప్రచురించుటలో అతని ప్రోత్సాహము అభినందనీయం.

26-08-2026 దిగవల్లి రామచంద్ర

హైదరబాదు సంపాదకుడు

———— ✦ ❖ ✦ ———

"ఆర్ష పుస్తకాలయము" - పరవస్తు వారి గ్రంథాలయము

ఆర్ష పుస్తకాలయమను పేర శ్రీ మాన్ పరవస్తు వేంకట రంగాచార్యులు వారు ప్రతిష్ఠించిన పుస్తక భాండగారము నేటికిని వారి పౌత్రులచే పోషించ బడుచున్నది. "నేను సంస్కృత వాఙ్మయ చరిత్ర రచించు సమయమున అందలి గ్రంథములెన్నో నాకు సహాయపడినవి. ముద్రితాముద్రిత బహు విధ గ్రంథ సంతతి తో నిండిన యా భాండాగార మా విద్వత్కవి కీర్తికి గొప్ప గుర్తు అదియే ఆయన అమోఘ వైదుష్యమునకు జ్ఞాపకము" అని శ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రి గారు సంస్కృత కవి జీవిత మనే గ్రంథంలో వ్రాశారు

పరవస్తు వేంకట రంగాచార్యులు గారు (1822- 1900)

వీరు విశాఖపట్టణమున 1822 సం॥లో జన్మించిరి. వీరి తండ్రిగారు శ్రీనివాసచార్యుల అయ్యవార్లంగారు. వీరు విశాఖ పట్టణములోనే పెరిగి పెద్దవారైరి. శ్రీనివాసాచార్యులు గారు గొప్ప పండితులు. వీరికి గోడే జగ్గారావు గారు విశాఖపట్నంలోనే ఇల్లు కట్టించి ఇచ్చి కోదండ రామస్వామి ఆలయానికి స్థానాచార్య లుగా నియమించి నెలకు ₹ 30 రూపాయలు జీతమిచ్చేవారు. శ్రీనివాసచార్యులు గారు సంస్కృతం, తెలుగు నిఘంటువును[1] రచించారు. అందులో 4 అక్షరములు పూర్తైనవి. తరువాత గోడే సూర్య

[1] సర్వ శబ్ద సంబోధిని

ప్రకాశ రావు గారి భార్య జానకమ్మ గారు వీరి కుమారుల చేత పూర్తి చేయించి ముద్రించారు.

వేంకట రంగాచార్యులుగారు తమ తండ్రి గారి వద్దచదివి, కోలాచలం రామానుజా చార్యులు వారివద్ద వ్యాకరణం, [మరిగంటి] వెంకట రాఘవాచార్యుల వారి వద్దను, కొండపల్లి వెంకట శాస్త్రి గారి వద్దను, సుబోధనా మిశ్రుల వద్దను తర్కశాస్త్రము అధ్యయనం చేసి పిమ్మట షట్చాస్త్రములలోను, వేద వాఙ్మయములోను స్వయంకృషితో గొప్ప పాండిత్యమును సంపాదించిరి. వీరి పాండిత్యముతో బాటు మంచి వక్తృత్వ మును చూసి వీరిని అనేక సంస్థానాధిపతులు గౌరవించి సత్కరించిరి. వీరి సంస్కృత భాషావక్తృత్వము మైసూరు రాయలవారు మెచ్చి .... (?) విద్యాత ....[2] గావించిరి.

వీరు తర్క, వ్యాకరణ, వేదాంతములందు ప్రఖ్యాతి గణించి చిన్నప్పటినుండి సంస్కృతాంధ్రములలో కవిత్వము చెప్పు చుండిరి. వీరు అనేక శతావధానములు చేసిరి. లఘు వ్యాకరణమను పేర సంస్కృత వ్యాకరణము వల్లె వేయుట రానివారికొరకు, సంస్కృత భాషలోని లఘు శబ్దార్థ సర్వస్వమను[3], విజ్ఞాన సర్వస్వమును రచించిరి. అందులో మొదటి సంపుటము 1877 సం.లోను రెండవ సంపుటము 1898 సం. లోను ముద్రించబడినది. ఇవి అపూర్వమైనవి. ఆనాటికి భారతదేశములో ఇటు వంటి గ్రంథములు లేవు. శబ్దార్థ సర్వస్వములో అకారాది పదకోశము తెలుగు లిపిలో ముద్రించ బడినది. వారి స్వంత ముద్రాక్షరశాల అయిన ఆర్ష ముద్రాక్షర శాలలోనే ముద్రించిరి.

1858సం॥ లో వీరు సంస్కృతములో ఆంగ్లాధి రాజ్య స్వాగతమను కావ్యమును, నల చరిత్ర కథావస్తువుగా తీసుకుని మంజుల నైషధమను పేర నొక సంస్కృత నాటకమును రచించిరి. కాళిదాసు మహా కవి శాకుంతల నాటకమును వీరే మొట్టమొదట

---

2 *మైసూరు మహారాజాగారు వీరికి అఖండ గౌరవముతో రాజ్య సభలో చిత్రాసనము మీద కూర్చునే అనుమతినిచ్చారు. ఏనుగుపై ఊరేగించి కనకాభిషేకము చేసినారు.*

3 *లఘు శబ్దార్థ సర్వస్వము గ్రంథము పై మల్లంపల్లి సోమశేఖర శర్మగారి వ్యాసం భారతి పత్రిక 1940సం. సెప్టెంబరులో వున్నది.*

ఆంధ్రీకరణం చేశారు. అందులో కొన్ని అంకములు పత్రికలలో ముద్రించబడినవి. కొంత భాగమిప్పటికినీ [మిగిలున్నది]. రాజ చూడామణి దీక్షిత కృతమగు కమిలినీ కలహంసమును, ఉపనిషద్వాఙ్మయమును గూడా వీరు కొంత గద్యముగా కొంత గీతముగా అనువదించిరి. వీరు ఆర్ష మతమును ప్రకాశింపజేయు గ్రంథములను, వ్యాసములను అనేకములు రచించిరి. వీరి ఆర్షమత సంగ్రహము, ధర్మ సంగ్రహము అను వ్యాసములు 1872 సం.లో పురుషార్థ ప్రదాయినిలో ప్రకటింపబడినవి.

రంగాచార్యులు గారు ప్రకృతి శాస్త్రములను గూర్చి వ్యాసములు వ్రాశారు. స్త్రీ పునర్వివాహము శాస్త్ర సమ్మతమని ఒక గ్రంథమును ప్రకటించిరి. అది పురుషార్థప్రదాయినిలో ప్రకటించబడినది. వీరు రచించిన వేద రహస్యమను గ్రంథములో వేదము లోని అర్థ వాదములకు నూతనార్థములు వివరించిరి.

1887 సం॥లో విక్టోరియా జూబ్లీలో బ్రిటిష్ ప్రభుత్వము వారు మహా మహోపాధ్యాయ బిరుదులు ఇచ్చిన నలుగురిలో వీరొకరు.

మంజుల నైషధము వీరి మనవని పాలివారైన ఆకొండ వెంకట శాస్త్రిగారు ఆంధ్రీకరించగా 1941 సం.లో అచ్చుపడినది.

రంగాచార్యులుగారి వద్ద వీరి పుత్ర పౌత్రులే గాక ఇతరులు చాలా మంది వ్యాకరణ అలంకార శాస్త్రము లభ్యసించారు.

రంగాచార్యులుగారి కాలములో విశాఖపట్టములో క్రైస్తవ మిష నరీల ప్రచారమువల్ల కొందరు మతాంతరులగు చుండగా రంగా చార్యులువారు ఆర్య మత ప్రచారము చేస్తూ అనేక ఉపన్యాసాలిచ్చారు.

రంగాచార్యులగారు ఒక పుస్తక భాండాగారమును నెలకొల్పి అందులో ముద్రితా ముద్రితములను భద్ర పరచారు. అది ఇప్పటికీ పరవస్తు వారి లైబ్రరీ అని ప్రసిద్ధి చెందినది.

రంగాచార్యులుగారు పద కవిత్వము కూడ చెప్పేవారని చెళ్ళపిళ్ల వారు వారి పదము నొక దానిని వివరించారు, 'చంచరీకమా[4]' అనే మకుటంగలది.

విజయనగర సంస్థానాధీశుడైన ఆనంద గజపతి పరవస్తు రంగాచార్యులు గారిని ఆహ్వానించగా వారు మూడు షరతులు పెట్టినారట (1) కోట వరకు సవారీలో రావడం అక్కడ దిగి (2) సభవరకూ పాదుకలతో రావడం (3) సభలో చిత్రాసనం మీద కూర్చొనటం. అందుకు రాజాగారు మొదటి రెండు షరతులకు అభ్యంతరం వుండదని మూడవ షరత్తు ప్రకారం చిత్రాసనం పైన కూర్చోవడానికి తమకభ్యంతరం లేదుగానీ తమ ఆస్థాన పండితుల కది అగౌరవంగా ఉంటుందని అన్నారట. అంతట రంగాచార్యులు గారు అయితే నేను సభకు రానే రానన్నారట. ఈ సంగతి చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రి గారి పరమ గురువు[5] గారు చెప్పారని కథలు గాథలులో వ్రాశారు.

చీవటి[6] జమీందారు గారిచ్చిన అగ్రహారమును రంగాచార్యుల వారు స్వీకరింపలేదట!

రంగాచార్యులు గారు ఇలాగ వారు తమ ఆత్మగౌరవం నిలుపుకునేవారట. వారి చరమ దశలో 1890-1900 సం.ల మధ్య తుని రాజా[7] గారు వారిని తమ ఆస్థానంలో నుంచుకుని నెలకు ₹1000 లిస్తూ సకలవిధమైన సౌకర్యాలు కలిగించినారు.

శ్రీ రంగాచార్యులు గారిని గూర్చి ఆంధ్ర సాహిత్య అకాడమీ వారు ప్రకటించిన <u>వైతాళికులు</u> అనే గ్రంథములో శ్రీ పురిపండా అప్పలస్వామి గారు వీరి చరిత్ర వ్రాశారు.

---

4 స్వాంత చంచరీకము అనే గేయం. బహుశః వారు ప్రకటించిన పత్రిక(సకల విద్యాభివర్ధిని) లో అయి వుండాలి.

5 చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారి పరమగురువు(గురువులకు గురువు) చర్ల బ్రహ్మయ్య శాస్త్రి

6 చీవటి జమీందారు= శీర్వాది జమీందారు. చీవటి సంస్థానము= శీర్వాది సంస్థానమును శ్రీకాకుళమును చికాకోలు అన్నట్లుగానే తత్సమ-తత్భవ రూపాంతరాలుగా శీ= చీ

7 తుని రాజా= వత్సవాయి వెంకట సూర్యనారాయణ జగపతి రాజ బహదూర్

—— ✦ ❖ ✦ ——

కొచ్చర్లకోట వెంకటరాయనిం గారు
(1770-1832 మధ్యకాలం)

వీరు ఆరువేల నియోగి బ్రాహ్మణులు. కాశ్యప గోత్రులు. ఆపస్తంభ సూత్రులు. రాజమహేంద్రవరములో నుండిన జమీందారులు. కొచ్చర్లకోట వారు పూర్వం నవాబుల క్రింద దేశపాండ్యాలుగా నుండిన సంపన్న కుటుంబం వారు. వెంకటరాయనిం గారు ఎప్పుడు జన్మించారో సరిగా తెలియదు గానీ 1832 సంవత్సరంలో వెంకటేశ్వర వాడపల్లి గ్రామంలో చనిపోయారని శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు చిత్రకథా గుచ్ఛములో వ్రాసినారు. చనిపోయిన నాటికి 60 సంవత్సరములు దాటినవని అనడానికి సందేహం లేదు. 1770 సం॥ ఆ ప్రాంతాల్లో జన్మించి ఉంటారు. గోదావరి జిల్లా మాన్యువల్ లో 1802 సం॥లో ఆచంట, బొండాడ ముఠాలను కొన్న వారి పేరు కొచ్చర్లకోట వెంకటరాజు అని వ్రాశారు

దేశ పాండ్యం అనేది జిల్లాలో శిస్తు వసూలు లెక్కలు అజమాయిషి ఉద్యోగం. పూర్వం దేశపాండ్యాలు చేసిన వారు చాలామంది పరగణా గ్రామాల కవుళ్ళు పొంది జమీందారులైనారు. కంపెనీ వారి కాలంలో ఈ దేశ పాండ్య, దేశముఖ్ జమీందారు ఉద్యోగాలు 1802సం॥ లో రద్దు చేసినప్పుడు వారికి నష్టపరిహారం క్రింద భూములు ఇచ్చారు. ఇదిగాక కంపెనీ వారు 1802 సం.లో హవేలీ భూములు తమకు స్వాధీన (మైన)గ్రామాలు ముఠాలుగా వేలం వేసినప్పుడు కొందరు వాటిని కొని ప్రోప్రైటరు లైనారు. తరువాత పేష్కషు బాకాయికి పెద్దాపురం వగైరా సంస్థానాల గ్రామాలు వేలం వేసినప్పుడు కూడా కొందరు వాటిని కొని ప్రోప్రైటరు లైనారు.

కొచ్చర్లకోట వినుకొండ తాలూకాలో నొక గ్రామం. దాని అసలు పేరు కొచ్చర్ల. అయితే చింతలపాటి సంస్థానంవారు అక్కడ కోట కట్టినందు వల్ల అది కొచ్చర్లకోట యైనది. పులిపాక వారు, అద్దంకి వారు కామరాజు వారు ఈ కుదురు వారేనని పెద్దలంటారు .

వీరు 1802 సం.లో కంపెనీ వారి వేలంలో ఆచంట, బొందాడ ముఠాలు వేలం పాడినట్లు ఆ జాబితాలో వ్రాశారు. వెంకటరావుగారు అని వెంకటరాజు గారని కూడా వీరిని పిలిచేవారు. వీరు పోలవరం రాజా గారని ప్రసిద్ధి చెందిన కొచ్చర్లకోట రామచంద్ర వెంకట కృష్ణారావు గారి దత్తత తండ్రి జగన్నాధ రాయణిం గారికి జ్ఞాతులు. 1819-1835సం॥ మధ్య మద్రాసు సుప్రీంకోర్టులో ఇంటర్ ప్రిటర్ గా పని చేసిన ఏనుగుల వీరస్వామయ్య[8] గారికిని సదరు కోర్టులో 1811సం॥ నుండి ఇంటర్ ప్రిటర్ గా నుండిన వెన్నెల కంటి సుబ్బారావు గారికి బంధువులు. సుబ్బారావు గారు కాశి యాత్ర కు వెళ్లుతూ 1823సం॥ లోనే వీరింట బస చేశారు. మళ్ళా 1828సం.లో కూడా వారింటికి వచ్చారని వారి జీవిత చరిత్ర వల్ల తెలుస్తున్నది.

ఏనుగుల వీరస్వామయ్య గారు తమ కాశీ యాత్రలో 21-07-1831వ తేదీ రాజమండ్రి వచ్చి వీరింట బసచేశారు. కాశీయాత్ర చరిత్రలో వీరిని గూర్చి కొన్ని వివరాలు వ్రాశారు. వెంకటరాయనింగారిని గూర్చి రెండు కథలు చిలకమర్తి వారు చిత్రకథా గుచ్ఛంలో వ్రాశారు (జగన్నాధరాయణం గారు చాలా ధనవంతులు. రాజమహేంద్రవరంలో ఇన్నీస్ పేటలో ప్రస్తుతం నాళం వారి యిండ్లు వెంకటరాయనిం గారి వేననీ, నాళం వారి వీధిలో ఉన్న రావి చెట్లకు ఈయన మూడుసార్లు బంగారంతో తులాభారం తూగి బ్రాహ్మణులకు, బీదలకు దానం చేసినట్లు రాజమండ్రి లోని పెద్దలు చెప్పుకుంటారు. చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు వ్రాసిన చిత్రకథా గుచ్ఛంలో ఆయనను గూర్చి కొన్ని కథలు వివరించారు). శ్రీ గురజాడ శ్రీరామమూర్తి గారు తమ కవి జీవితములలో పిండిప్రోలు లక్ష్మణకవి జీవితములో వీరిని గురించి వ్రాశారు. వెంకటరాయనిం గారిని గూర్చిన కథ నొకదానిని వ్రాశారు. (పిండిప్రోలు లక్ష్మణ కవి వెంకటరాయనిం గారి ఇంటికి వచ్చుట,

---

[8] "ఏనుగుల వీరస్వామి విరచితము" అని అసలు గ్రంథం వ్రాత ప్రతిలో వున్నదనియూ ముద్రక్షర శాలవారి అనుచిత ఆఖరి క్షణం సవరణవల్ల వీరాస్వామయ్య అని తప్పుగా 1941 సం 3వ సంకలనంలో శీర్షికతో అచ్చుపడినదని రచయిత శివరావుగారు ఆ సంపుటి అనుబంధముగా- సవరణలు (పుట 33) లోప్రకటించారు.

వారిద్ధరికి జరిగిన వాగ్వాదం శ్రీ గురజాడ శ్రీరామ మూర్తి గారు తమ కవి జీవితంలో ఉదాహరించి ఉన్నారు చూడు పుటలు…).

వెంకటరాయనిం గారు కంపెనీ వారు వేలం వేసిన పెద్దాపురం వారి..... ... ముఠాలు కూడా కొన్నారు. వీరు కొత్త జమీందారులైనా పూర్వం జమిందార్ల కన్నా పరువుపాయ కలిగి తమ జమీలను[9] జాగ్రత్తగా నిర్వహించుచున్నారని, పూర్వం జమీందారులకు సహాయం చేసే స్థితి కలిగినవారై యుండిరననీ వీరస్వామయ్య గారు వ్రాశారు. వీరు కంపెనీ వారికి సాలుకు మూడు లక్షల రూపాయలు పేష్కస్సు చెల్లించినారని, రాజానగరం కొచ్చర్లకోట వెంకటరాయనిం గారి జమీందారీ లో చేరినదని లోగడ పెద్దాపురం రాజా బహదూర్ గారి అన్నసత్రం నిలిచిపోయినంతలో ఈ జమీందారుడు ఆ సత్రాన్ని వృద్ధిపరిచి నడుపుతున్నాడని వీరస్వామయ్య గారు వ్రాశారు.

వీరాస్వామయ్య గారు వెంకటరాయనిం గారి ఇంట్లో ఆరు దినములు ఉన్నారు. వారు చాలా బాగా ఆదరించారు. ఇప్పుడు నాళం వారి సత్రవులున్న చోటనే వెంకటరాయనిం గారి భవనం ఉండేదని రాజమహేంద్రవరంలో పెద్దలు చెబుతారని చిలకమర్తి వారు వ్రాశారు.

వీరస్వామయ్య గారు 1831సం॥ జూలై 28 మధ్యాహ్నం భోజనం చేసుకుని వెంకటరాయనిం గారి జమీందారీ గ్రామాల మీదుగా ప్రయాణం చేశారు. సాయంత్రం 8 గంటలకు వాడపల్లి చేరినారు. అక్కడ వెంకటేశ్వర స్వామి గుడి. 20 ఇండ్ల వైష్ణవ అగ్రహారం వున్నవి. వెంకటరాయనిం గారి తమ్ముడు వాడపల్లిలో విశాలమైన నగరము కట్టినాడు. 30వ తేదీ ఆచంట చేరినారు. అక్కడ వెంకటరాయనిం గారు తమ కోసం ఒక పెద్ద నగరు కట్టి దాని చుట్టూ సుందరమైన వనము నిర్మించారు . వాడపల్లి లోపలవున్నట్లే ఒక పోలీసు అమీను వున్నాడు. 30 బ్రాహ్మణుల ఇండ్లున్నవని వీరస్వామయ్య గారు వ్రాశారు

— ✦ ❖ ✦ ——

[9] జమీలు - జమీందార్ల భూములు.

చెన్నపట్నం కోట కాలేజి

The Board for the College of Saint George constituted by notification dated 1–5–1812 Francis W. Ellis, head of the board of superintendents for the college wrote the introduction to the Telugu Grammar of A.D. Campbell published in 1816 reprinted in 1819 and 1849. Udayagiri Venkata Narayanayya assisted Campbell in writing it. He rose to the position of Head English Master of the college and interpreter Supreme Court.

ఇంగ్లీషు దొరలకు దేశభాషలు నేర్పడానికి, తర్పీదునివ్వటానికి చెన్నపట్నం కోటలో 1-05-1812 తేదీన స్థాపించబడిన కాలేజీలో తెలుగు అరవము, దేశభాషల పండితులు, ఇంగ్లీషు ఉపాధ్యాయులు ఉండేవారు. దేశభాషలైన తెలుగు తమిళము, భారతీయ భాషయైన సంస్కృతమునందు శిక్షణ ఇచ్చేవారు. 1800 సం॥లో స్థాపించబడిన చెన్నపట్టణంలో సుప్రీంకోర్టులోను, 1802సం॥లో స్థాపించబడిన సదర్ అదాలత్ కోర్టు లోను హిందూ ధర్మ శాస్త్రాల యందు న్యాయాధిపతులకు తోడ్పడడానికి ఈ పండితులే నియమింపబడేవారు (See Mackenzie Manual p.55).

ఈ కళాశాలలో మొదట 1812సం॥.లో నియమింపబడిన తెలుగు పండితులు వేదం పట్టాభిరామశాస్త్రి గారు. వీరికి సహాయ పండితులుగా రావిపాటి గురుమూర్తి శాస్త్రి గారిని నియమించారు. గురుమూర్తి శాస్త్రి గారు ఆరువేల నియోగి. అయితే కాలేజీ నిబంధనల

ప్రకారం శాస్త్రి బిరుదు వహించారు. ఆ కాలములో ప్రధాన పండితుని జీతం నెలకి రూ175. పట్టాభిరామశాస్త్రి గారు 1816సం॥లో తెలుగు నవ్యాంధ్ర వ్యాకరణమును, పట్టాభిరామ పండితీయమను పేర గ్రంథములు రచించారు. ఆయన 13-9-1820 తేదీన చనిపోయయారు. గురుమూర్తి శాస్త్రి గారే ప్రధాన పండితులైనారు. వీరి విక్రమార్కుని కథలు 1819 సం॥.లోను, పంచతంత్రం కథలు 1834సం॥లో తెలుగు వ్యాకరణం 1836 సం॥ ప్రచురించబడ్డాయి. వ్యాకరణమును క్యాంబెల్ దొర గారికి అంకితమిచ్చారు....[10] గురుమూర్తి శాస్త్రి గారి మీద క్యాంబెల్ దొరగారికిని సి.పి బ్రౌన్ దొర గారికిని చాలా గౌరవం. వారి అభిప్రాయమునకు చాలా విలువ నిచ్చేవారు. ఈ పండితుల ద్వారా పరీక్షించ బడిన దొరలు ఆయా జిల్లాల్లో నియమింపబడేవారు.

గురుమూర్తి శాస్త్రి గారు 1837సం॥ లో చనిపోయారు. వారి తరువాత పుదూరి సీతారామశాస్త్రి గారు నియమింప బడ్డారు. ఈ కాలేజీ 1840సం॥.లో ఎత్తివేసి మద్రాసు రాజధాని ఉన్నత పాఠశాలను స్థాపించారు. అదే తరువాత ప్రెసిడెన్సీ కళాశాలగా అయినది.

కాలేజి నిర్వహణ సంఘమునకు అధ్యక్షులు ఎలీసు దొరగారు (Francis Ellis)[11] ఇతడు బహు భాషావేత్త. పట్టాభిరామశాస్త్రి గారి చేత ధాతుమాల[12] సిద్ధం చేయించి దేశ భాషలు సంస్కృతంలో నుండి రాలేదని వ్రాశారు. ఎ.డి.క్యాంబెల్ సివిల్ సర్వీస్ ఉద్యోగి ఇతడు తెలుగు భాషను అభ్యసించారు. ఈయన రచించిన తెలుగు వ్యాకరణము“A grammar of Telugu language commonly termed, the Gentoo by A.D. Campbell” ప్రకటించడానికి కాలేజీ బోర్డు వారు 1813 సం॥లో నిర్ణయించారు. అది 1816సం॥లో ప్రకటించబడినది రెండవ ముద్రణ 1819సం॥ మూడో ముద్రణ 1849.సం॥ ఈ వ్యాకరణ రచనలో క్యాంబెల్ గారికి F. W. Ellis గారు, ఉదయగిరి

---

10 చేతివ్రాత ప్రతి శిథిలావస్థ లోనుండుటవలన క్రింద చివరి వాక్యములు చదువుట అసాధ్య మైనది.

11 Head of the Board of Superintends for the College of Fort Saint George.

12 వేదం పట్టాభిరామ శాస్త్రిగారు రచించిన ధాతుమాలను ఆధారంగా చేసుకుని 1816సం. ఎల్లిస్ దొరగారు ప్రచురించిన Desertation on Telugu Language.

వెంకటనారాయణ గారు, వేదం పట్టాభిరామశాస్త్రి గార్లు తోడ్పడ్డారు. విలియం బ్రౌన్[13] 1817సం॥లో ప్రకటించిన వ్యాకరణమునకు గురుమూర్తి శాస్త్రి గారు సహాయము చేశారు. గురుమూర్తి శాస్త్రిగారి విక్రమార్క కథలు 1819సం. పంచతంత్రము 1834సంలో ప్రకటింపబడినవి.

— ✦ ❖ ✦ ––

వెన్నెలకంటి సుబ్బారావు (1784-1839)

వెన్నెలకంటి సుబ్బారావు గారు నెల్లూరు జిల్లా కాపురస్తులు. తండ్రి జోగారావు గారు. తండ్రి తొమ్మిదవ ఏటనే మరణించారు. 1784సం॥లో జన్మించారు ఆకాలంలో ఉత్తర సర్కారుల ముఖ్య పట్నం మచిలీ బందరు. సుబ్బారావు గారు తన మేనత్త కుమారుడైన ఒంగోలు గోపాలకృష్ణయ్య గారితో (1795 సం.) బందరు వెళ్లారు. మచిలీపట్నం జిల్లా కలెక్టర్ కచేరీలో ఏర్పడిన శిరస్తగారములో గుమాస్తాగా ఉన్న ఇంకొక మేనత్త కుమారుడు మంచెళ్ళ పాపయ్య గారి కుమార్తెను 1797సం॥లో పెళ్ళాడి ఇంగ్లీషు నేర్చుకుని 1799సం॥లో తన పిన తండ్రి వెన్నెలకంటి కృష్ణయ్య గారు వినుకొండ లో నుండగా అక్కడికి వెళ్లి అక్కడ ఇంగ్లీషు వర్తకంపెనీ వారి మిలటరీ సేమాపూర్ పే మాస్టర్ ఆఫీస్ లో అకౌంటెంట్ గా యున్న పెరియతంబి పిళ్ళై గారిని ఆశ్రయించి ఇంగ్లీషు వృద్ధి చేసుకున్నారు. శ్రీరంగపట్నం కంపెనీ వారి వశము కాగా అక్కడ ఉద్యోగం దొరుకుతుందేమో అని ఆశతో వెళ్లారు. కానీ దొరకలేదు. తిరిగి వినుకొండకు వచ్చి పెరియతంబి పిళ్ళైగారి వెంటనే పే ఆఫీసుకు వెళ్తూ ఆయన పని అంతా తానే చేసేవారు. అప్పుడు హెన్రీ విల్సన్ అనే దొర వీరి పైన దయ తలచి నెలకు ఒక వరహా భత్యం ఇచ్చేవారు.

---

[13] విలియం బ్రౌను దొర (జన్మ1760సం॥). వీరు సి.పి. బ్రౌను దొర (జన్మ 1798 సం॥) కన్నా ముందుగనే తెలుగు నేర్చుకున్నారు. అప్పట్లో ఆధ్యాపకులుగానుండిన రావిపాటి శాస్త్రిగారి సహాయంతో తెలుగు వ్యాకరణము, నిఘంటువు కూడా ప్రకటించిరి.

18-10-1810 తేదీన ఒంగోలులో పెద్ద గాలివాన వచ్చింది. దత్త మండలాలలోని కడప జిల్లాలో పే మాస్టరు. శావేజి [శావేజ్]దొర[14] క్రింద పని నౌకరుగానుండిన సుంకా రామకృష్ణ నాయుడు గారికి ఇంగ్లీషు తెలిసిన గుమస్తా నియమించమని శావేజి గారు చెప్పగా సుబ్బారావు గారిని చేర్చుకుని కంభం మార్గాన సేనాని నివేశానికి వెళ్లారు. అప్పుడు నెలకి 10 వరహాలు జీతం. సుబ్బారావు గారు అక్కడ కన్నడ నేర్చుకున్నారు. 1806సం॥ ప్రారంభం వరకు దక్షిణ కెనరాలో మంగళూరు కలెక్టర్ కచేరిలో గుమాస్తాగా పనిచేశారు. ఆ కాలంలో పూర్వం కలెక్టర్లకుండే న్యాయవిచారణ అధికారాన్ని తీసివేశారు. కొత్తగా జిల్లా జడ్జీల ను నియమించి వారికి ఈ ఆధికారమిచ్చారు. వారికి మెజిస్ట్రేట్ అధికారాలుకూడా యిచ్చారు. ఆ కొత్తకోర్టులో సుబ్బారావు గారిని ద్విభాషీగా ను ఇంగ్లీషు రైటర్ గాను నియమించారు నెలకి 25 రూపాయల జీతము. అయితే 1808సం॥ సుబ్బారావు గారికి అనారోగ్యం కలిగినందువల్ల ఆ పనికి రాజీనామా ఇచ్చారు. మంగళూరు జిల్లా కోర్టులో రిజిస్టరు గానుండిన మెక్కెరెల్ దొరగారు (John Mckerell) ఈయనకు నెలకి 12 వారహాల నిచ్చి తెలుగు నేర్చుకున్నారు. మెక్కెరెల్ దొరగారికి తెలుగు పరీక్ష లో వెయ్యి వరహాలు బహుమానం వచ్చింది. సుబ్బారావు గారిని సన్మానించారు. మెక్కెరెల్ దొరగారు కన్నడ వ్యాకరణం రచించడంలో సుబ్బారావు గారు సహాయం చేశారు. శ్రీరంగపట్నం జిల్లా కోర్టు హెడ్ ఇంగ్లీష్ రైటరి పనికి దరఖాస్తు చేశారు దాన్లో జీతం నెలకి 20 వరహాలు.

1811 సం॥ చివర వారి కుటుంబ వారందరికీ జ్వరము రాగా ఆ పని మానుకున్నారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ ఫ్రేజర్(William Fraser) గారి కచేరీలో ఇంటర్ ప్రిటర్ గా నియమింపబడినారు. 1816 సం॥ దాకా సుబ్బారావు గారు ఆపులు మద్రాసు సదర్ కోర్టు ఇంటర్ప్రిటర్ నాగరాజ శేషగిరయ్య గారికి సుప్రీం కోర్టులో ఇంటర్ ప్రిటర్ పని అయినదని సదరకోర్టు పదవికి దరఖాస్తు పెట్టమని వ్రాసిరి. కానీ సుబ్బారావు గారికి సన్నిపాత జ్వరము వచ్చినది. నెల్లూరు జిల్లా కలెక్టరు గారు ఇంటర్ ప్రిటర్ పని తో పాటు సైదాపూరు తాహసిల్దార్ వంటి పని కూడా ఇచ్చి 25 వరహాలు జీతం ఏర్పరిచిరి.

---

14 మేజర్ జాన్ షావియర్ (John Shavier / Xavier) దొరగారే శావేజ్ దొర అని ప్రసిద్ధి చెందినారు.

సుబ్బారావు గారు శ్రీరంగపట్నంలో పేమాస్టర్ కచేరి లో అకౌంటెంట్ భీమరాజు సీతారామయ్య గారి కుమార్తెను రెండవ వివాహం చేసుకున్నారు ఈ పరిస్థితిలో మెక్కెరిల్ గారు ఇండియా వచ్చారు 1815సం॥ లో సదర్ కోర్టులో ఇంగ్లీషు తెలుగు భాషలో తర్జుమా చేయు ఇంటర్ ప్రిటరుగా ప్రవేశించి 1829సం॥ వరకు పని చేశారు. నెలకి 140 రూపాయల జీతం పైన పింఛను పుచ్చుకున్నారు.

దొరలకు దేశభాషలు నేర్పడానికి 1812సం॥లో కాలేజీ స్థాపించి వారికి స్కూల్ పుస్తకములు వ్రాయించి ప్రకటించడానికి మద్రాసు స్కూల్ బుక్స్ సొసైటీ స్థాపించినారు. అందులో సుబ్బారావు గారిని సభ్యులుగా వేశారు. ఆయన ఆ సభ సెక్రటరీకి దేశంలో చదువుల పరిస్థిలను గురించి 22 -11-1820 తేదీన ఒక పెద్ద లేఖ వ్రాశారు. అందులో దేశంలో ఇంగ్లీషు నేర్పే పాఠశాలలు స్థాపించవలసినదని కోరారు.

సుబ్బారావు గారు 1822-23సం॥ మధ్య ఉత్తర హిందూ దేశంలో తీర్థయాత్ర చేశారు. 8-8-1822 తేదీన గుంటూరు చేరారు. అక్కడ తూము పాపాయ్య గారి భార్య సహగమనం జరగడం చూశారు. ఆయన ఏలూరు నుంచి రాజమండ్రి వెళ్లి తన బంధువు ఆచంట జమీందారు కొచ్చర్లకోట వెంకటరాయనిం గారి దగ్గర బస చేశారు. పెద్దాపురం, పిఠాపురం, విజయనగరం మార్గాన అల్హాదాబాద్ (ప్రయాగ్ రాజ్) గయా వెళ్ళినారు. 11-09-1823 తేదీన మద్రాసు కు తిరిగి వచ్చారు. ఈ యాత్ర 13 నెలల మూడు రోజులు పట్టింది. కలకత్తా కు 3-3-1823 తేదీ తన స్నేహితుడు, బంధువైన కావలి వెంకట లక్ష్మయ్య గారి దగ్గర మార్చి25 వరకు ఉన్నారు. 25 ఏప్రిల్ శ్రీకాకుళంలోకి వచ్చి తన స్నేహితుడు జిల్లా కోర్టు ప్లీడరు బలిజేపల్లి సీతారామశాస్త్రి గారి ఇంట బస చేశారు. 22-5-1823 రాత్రి వారు అనకాపల్లి నరసింగ కోట, పిఠాపురం, పెద్దాపురం ద్వారా రాజమండ్రి కి వచ్చారు. వెంకట రాయనింగారితో ఆచంట వెళ్లి మే నెల 24వ తేదీ నుండి 31 తేదీ దాకా అక్కడ ఉన్నారు. కృష్ణాజిల్లాలో గ్రామాలను బాపట్ల ఒంగోలు ద్వారా మద్రాసుకు వచ్చారు.

ఆయన 1826సం॥లో రామేశ్వర యాత్ర చేశారు. చిన్న జీతం పైన పల్లకీలు, బండ్లు అద్దెకు తీసుకొని వెళ్ళారు. కుంభకోణం 20-02-1826 వరకు చేరారు. కడలూరు, చిదంబరం వెళ్లి తన పాత స్నేహితుడు దునెగుంటి కృష్ణ పంతులు దగ్గర బస చేశారు.

కంభకోణంలో మలయాళ రెడ్డి లేక వెంకటరావు గారి దగ్గర బస చేశారు. 24వ తేదీన మహిధర నరసింహ శాస్త్రి గారి ఇంట విందు. మార్చి 1827 సం॥లో శివరాత్రికి అమరావతి నుండి మచిలీపట్నం వెళ్లారు. అక్కడ నుండి రాజమండ్రి కి వెళ్లి జమీందారు గారి వాడపల్లికి, ఆచంటకు వెళ్లి విశాఖపట్నం వెళ్లి అక్కడ బలిజేపల్లి పార్వతీశ్వర శాస్త్రి గారి ఇంట బస చేసి తిరిగి పుష్కరానికి రాజమండ్రి వచ్చి నెల్లూరుకి 15-8-1827వ తేదీన తిరిగి వచ్చారు. రెండో భార్య కనకమ్మ గారు 1831 సం॥లో పోయినారు. మళ్ళీ వివాహం చేసుకున్నారు. సుబ్బారావు గారు 01-10-1839 తేదీ స్వర్గస్తులైనారు .

— ✦ ❖ ✦ ––

భారత జాతీయ కాంగ్రెస్ స్థాపకులలో ఒకరైన కీ.శే. సింగరాజు వెంకటసుబ్బారాయుడు గారు

1885వ సం॥ డిసెంబర్ 28వ తేదీన బొంబాయి నగరంలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ ప్రథమ సమావేశంలో పాల్గొన్న మచిలీపట్నం కాపురస్థు లైన కీ.శే. సింగరాజు వెంకట సుబ్బారాయుడు గారు అక్కడ ముఖ్యమైన తీర్మానం పైన గొప్ప ఉపన్యాసం ఇచ్చారు. ఆయన మళ్లీ 1886 సం॥ డిసెంబర్ నెలలో దాదాభాయ్ నౌరోజీ గారి అధ్యక్షత క్రింద కలకత్తాలో జరిగిన రెండవ కాంగ్రెస్ మహాసభ కు హాజరై ఆ సభలో జాతి పద్ధతిని గూర్చిన తీర్మానం పైన ఉపన్యసించారు. ఆయన మచిలీపట్నానికి తిరిగి వచ్చిన తరువాత జబ్బు పడి 1887 సం॥లో దివంగతులైనారు. 1887 సం॥లో బద్రుద్దీన్ త్యాబ్జీ గారి అధ్యక్షత క్రింద చెన్నపట్టణంలో జరిగిన మూడవ కాంగ్రెస్ సభలో శ్రీ సుబ్బారాయుడు గారు తమ 43వ ఏటనే అకాల మరణం పొందినందులకు అధ్యక్షుల వారు తమ సంతాపం తెలిపినారు.

ఈ సంగతి మచిలీపట్నం కాపురస్థులలో కృష్ణాజిల్లా వారిలో వయోవృద్ధులందరికీ తెలుసును. 1935 సం॥ డిసెంబరు 28వ తేదీన జరిగిన కాంగ్రెస్ స్వర్ణోత్సవ సందర్భంగా

శ్రీ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు ప్రచురించిన ఆంధ్ర పత్రిక కాంగ్రెస్ స్వర్ణోత్సవ సంచికలో కృష్ణాజిల్లా పెద్ద కళ్ళేపల్లి గ్రామ కాపురస్థులు ఆంధ్ర పత్రికలో చిరకాలము సహాయ సంపాదకుడుగా పనిచేసినవారైన శ్రీ కొడాలి శివరామకృష్ణ గారు కృష్ణాజిల్లా జాతీయ ఉద్యమం అనే వ్యాసములో కీర్తిశేషులు సింగరాజు సుబ్బారాయుడు గారిని గూర్చి వ్రాసియున్నారు.

దీనిని పురస్కరించుకొని నేను 1938సం॥ అక్టోబర్ రెండవ తేదీన ప్రచురించిన బ్రిటిష్ ఇండియా చరిత్రలో వందేమాతరం ఉద్యమం ప్రకరణములో జాతీయ చైతన్యమును గూర్చి వ్రాస్తూ శ్రీ సుబ్బారాయుడు గారు ప్రథమ కాంగ్రెస్ సమావేశానికి హాజరైన సంగతి వ్రాశాను. సింగరాజు వెంకట సుబ్బారాయుడు గారు సామాన్య వ్యక్తి గాడు. ఆయన ఆ కాలంనాటి ఆంధ్ర మహా పురుషులలో ఒకరు. ఆయన 1844 సం॥లో బందరు దగ్గర పెడన అనే గ్రామంలో ఒక సంపన్న శైవ నియోగి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. వారికి చాలా భూములు ఉండేవి. ఆయన పూర్వకాలపు వీధి బడి చదువు పూర్తి చేసి ఇంగ్లీష్ పాఠశాలలో చదివి బందరు లో నోబెల్ కళాశాలలో ఎఫ్.ఏ పరీక్షలో ఉత్తీర్ణులైనారు. ఆ కాలంలో ఎఫ్. ఏ పాస్ అయిన వారు న్యాయ శాస్త్రం చదివి బి ఎల్ పట్టా పొందవచ్చును కనుక సుబ్బారాయుడు గారు చెన్నపట్టణంలో బి. ఎల్ పట్టం పొందినారు. చెన్నపట్నంలో సుప్రసిద్ధ న్యాయవాది గానుండి రాజకీయలలో పాల్గొంటూ 1891 సం॥ బ్రిటిష్ ప్రభుత్వం వారి శాసనసభలో సభ్యుడై పేరుపొందిన శ్రీ పనప్పాకం అనంతాచారి గారు కూడా అలాగ పైకి వచ్చిన వారే. ఆయన చిత్తూరులో కడమంచి గ్రామంలో పుట్టి పెరిగిన తెలుగు వైష్ణవుడు. ఆయన 1843 సం॥లో జన్మించారు. సుబ్బారాయుడు గారు ఆయనకు స్నేహితులైనారు . వీరిని అరవ వారు ఆనందాచార్యులు గారని వ్యవహరించడం వల్ల ఆ పేరుతోనే సుప్రసిద్ధులైనారు. సుబ్బారాయుడు గారు మచిలీపట్నం గుంటూరు జిల్లా కోర్టులలోనే గాక గోదావరి జిల్లాలోని కోర్టులలో కూడా పెద్ద పెద్ద జమీందారీ కేసులలో పనిచేసేవారు. వారు త్వరగానే సుప్రసిద్ధ న్యాయవాదిగా పేరుపొంది లక్షలు ఆర్జించారు. ఆయన దగ్గర శ్రీ పాటిబండ వెంకటరమణయ్య పంతులు గారనే వారు ప్లీడర్ గుమస్తాగా నుండేవారు. ఈ

వెంకటరమణయ్య గారు సుబ్బారాయుడు గారు 1887 సం॥లో చనిపోయిన తర్వాత సెకండ్ గ్రేడ్ ప్లీడర్ పరీక్ష ప్యాసై బెజవాడలో ప్లీడర్ గా పనిచేసి లక్షలు ఆర్జించారు. వెంకటరమణయ్య పంతులు గారు సుబ్బారాయుడు గారి ప్రతిభను గూర్చివిశేషాలు చెప్పేవారు

1863 సం॥ నుండి పిఠాపురం మహారాజా గంగాధర రామారావు గారి దగ్గర చాలాకాలం దివాన్ గా ఉండిన మా పెద తండ్రి గారైన దిగవల్లి వెంకట శివరావు పంతులుగారు 1884 సం॥లో పిఠాపురం రాజా గారి బంధువులైన శనివారపేట జమీందారు[15] గారి దగ్గర దివానుగా పనిచేసే కాలంలో ఆ ఎస్టేటు వ్యవహారాల సందర్భంలో శివరావు గారితో సంప్రదించడానికి సుబ్బారాయుడు గారితో తాము కూడా వెళ్లినామని నాతో స్వయముగా చెప్పినారు.

కీ.శే. సింగరాజు సుబ్బారాయుడు ఊపిరి తిరగనంతగా న్యాయవాది వృత్తిలో మునిగి తేలుతూ వున్నప్పటికీ కృష్ణా జిల్లాకు, మచిలీపట్నానికి కూడా ఎంతో సేవ చేశారు. ఆకాలంలో రోడ్లు వగైరా ప్రజోపయోగ సౌకర్యాలు చేయుడానికేర్పడిన స్థానిక సంస్థ యైన లోకల్ బోర్డులో సభ్యుడుగా నియమింప బడి ప్రజా సేవ చేసి ఆ బోర్డు అధ్యక్షుడైనాక కలెక్టర్ల వలన ప్రశంసింపబడినారు. 1881సం.లో బందరు మునిసిపాలిటీలో సభ్యుడుగా నియమింపబడి పట్టణముయొక్క పారిశుధ్య కార్యకలాపాలలో పాల్గొని కలెక్టర్ల గౌరవానికి పాత్రులైనారు. కొన్నాళ్ళు పాటు ఆయన బందరు మునిసిపల్ ఛైర్మన్ గా కూడా పనిచేశారు.

మద్రాస్ రాజధాని గవర్నమెంట్ వారు సుబ్బారాయుడు గారి ప్రజాసేవ గమనించి ఆయనకు రావు సాహెబ్ అనే బిరుదు నిచ్చారు.

---

[15] శనివారపేట జమీందారు= వెంకట్రామయ్యప్పారావు.

digavalli1943@gmail.com

సుబ్బారాయుడు గారు న్యాయవాద వృత్తి రీత్యా చెన్నపట్నంకు తరచుగా వెళుతూ ఉండడం వలన అక్కడ అనంతాచార్యులు గారే గాక ఇంకా చాలామంది ప్రముఖులు కూడా స్నేహితులైనారు.

అనంతాచార్యులుగారు చెన్నపట్టంలో ట్రిప్లికేన్ లిటరరీ సొసైటీ అనే యువజనుల సమాజానికి అధ్యక్షులుగానుండేవారు. అది 1875 సం॥లో స్థాపించబడినది. ఆ యువజనులలో 1862 సం॥లో స్థాపించబడిన మద్రాస్ హైకోర్టులో కొత్తగా వకీలైన యువకులును, బి.ఏ పట్టపరీక్ష చదివే యువకులును కూడా సభ్యులుగానుండేవారు. ఈ సభ్యులలో కాకినాడ కాపురస్తులైన తల్లాప్రగడ సుబ్బారావు పంతులుగారు, నెల్లూరు కాపురస్తులైన న్యాపతి సుబ్బారావుగారు, మద్రాసు కాపురస్తులైన జి.సుబ్రహ్మణ్య అయ్యర్ గారును ప్రముఖులుగానుండేవారు. వీరందరి ప్రోత్సాహము వలననే 1878 సం॥లో హిందూ పత్రికనే ఇంగ్లీషు వారపత్రిక స్థాపించబడినది. దానికి సుబ్రహ్మణ్యంగారు ఎడిటరు. తక్కినవారందులో వ్యాసాలు వ్రాసేవారు. సుబ్బారాయుడుగారు కూడా అందులో వ్యాసాలు వ్రాసేవారు.. ఈ మిత్రమండలి చెన్నపట్నం రాజకీయాలలో ప్రాముఖ్యత వహించి 1883సం॥లో మద్రాస్ మహాజనసభ అనే ప్రజా సంఘాన్ని స్థాపించుటకు కృషి చేశారు. దాని ఫలితముగానే 1884 సం॥లో మద్రాసు మహాజనసభ స్థాపించబడినది. ఇది తరువాత 1885సం॥ లో స్థాపించబడిన అఖిలభారత జాతీయ మహాసభకు నాంది అని చెప్పవచ్చును. ఈ మద్రాసు మహాజన సభకు అధ్యక్షులు శ్రీ పి రంగయ్య నాయుడు గారు. కార్యదర్శి పనప్పాకం అనంతా చార్యులు గారు. వీరు సింగరాజు సుబ్బారాయుడు గారికి స్నేహితులైనందువల్ల సుబ్బారాయుడు గారా మహాజన సభ శాఖ మచిలీపట్నంలో స్థాపించి దానికి అధ్యక్షులై ప్రజలకు రాజకీయ పరిజ్ఞానం కలిగించుటకు సభలు ఏర్పాటు చేస్తూ ఉపన్యాసాలిచ్చేవారు .

సుబ్బారాయుడు గారు కలకత్తా కాంగ్రెస్ నుంచి తిరిగి వచ్చిన తరువాత కొన్ని నెలల్లో జబ్బు పడినారు. ఆయన న్యాయవాద వృత్తిలోను ప్రజాసేవలోని నిమగ్నులై తమ ఆరోగ్యం గూర్చి అశ్రద్ధ చేసినందు వల్ల అతిమూత్ర వ్యాధి అంకురించినది. ఆకాలం నాటి ఆయుర్వేద వైద్యులు మంచి మందులు ఇచ్చినా వ్యాధి మళ్లలేదు. తమకు


ఆసన్నకాలం సమీపించినట్లు గ్రహించి ఆయన తన తమ్ముడైన సింగరాజు లింగయ్య గారి పుత్రుడైన రాజేశ్వరరావు అనే వానిని దత్తు చేసుకున్నారు. తమ ఆస్తి వినియోగమును గూర్చిన ఏర్పాటు చేస్తూ మరణ శాసనము వ్రాశారు. సుబ్బారాయుడు పంతులుగారు తమ ధనములో నుండి తమ కుటుంబములో చాలామందికి పెద్ద మొత్తము లిచ్చుటయే గాక మచిలీపట్నం టౌన్ హాలు నిర్మించడానికి 5000 రూపాయలు, 15 వేల రూపాయలు బందరులో ధర్మ సత్రము నిర్మించడానికి దానం చేసి బ్రాహ్మణులకు పేదవారికి అన్నదానం చేయడానికి ఏర్పాటు చేశారు. దాని నిమిత్తము మూడు వేల రూపాయలు విలువ గల ఇంటిని దానం చేశారు. ఇదిగాక పెడన గ్రామము, పెదగొల్లపాలెము లలో సత్రములు స్థాపించారు. వెయ్యి రూపాయలు దేవస్థానము నకిచ్చారు. మొత్తం 20 వేల రూపాయలను దానధర్మం కింద వినియోగించారు. ఆయన కాంగ్రెస్ కార్యక్రమాలలో నిమ్మగ్నుడైనందువల్ల అవసాన కాలంలో కాంగ్రెస్సును గూర్చి పలవరించేవారట. మరణించక పూర్వము సంధిలో కూడా కాంగ్రెస్సును స్మరించేవారట. ఆయన చనిపోయిన తరువాత వారి జీవిత సంగ్రహము East Coast Worthies అనే గ్రంథంలో ఉన్నది. సుబ్బారాయుడు గారిని గూర్చి హిందూ పత్రిక ఒక వ్యాసం ప్రకటించింది. ఆయన కాంగ్రెస్ మహాసభలలో ఉపన్యసించిన విషయాలు చాలా ముఖ్యమైనవి. ఆయన ఉపన్యాసాలలో అనర్గళ వాగ్ధాటికి సభాసదులు చాలాసార్లు కరతాళ ధ్వనులు చేశారు

బ్రిటిష్ ప్రభుత్వం వారు దేశరక్షణ మను పేరుతో సైనిక ఖర్చులకోసం విపరీతంగా ధనము దుర్వినియోగం చేయుటమును గూర్చి, సిమ్లా కొండలకు వేసవి కాలములో ప్రభుత్వ కార్యాలయములను తరలించి సొమ్ము దుర్వినియోగం చేయటం, కఱవులతో బాధ పడే ప్రజలకు సహాయడానికి ధనము లేదనటం, ఇండియాలో దొరికే వస్తువులను కూడా సీమలో కొంటూ ఉంవుటున్నారనీ, దేశీయులకు తగినన్ని ఉద్యోగాలిచ్చుట లేదని, ఆఫ్ఘనిస్థాన్ వారు దాడి చేయకుండా వారికి లంచాలు కింద పెద్ద సొమ్ములు ఇచ్చేవారని, దర్బార్లు చేయడానికి విపరీత ఖర్చులు చేయడం ఈ ఖర్చులకోసం ప్రజలపైన సిస్తులు విధించి సొమ్మును పిండడము గూర్చి తీవ్రంగా విమర్శించారు.

సుబ్బారాయుడు గారు న్యాయవాదుల్లో ప్రముఖుడిగానుండి చెన్నపట్నంలోని గొప్ప న్యాయవాదులతో సమానంగా న్యాయ శాస్త్రములో ప్రవీణుడై నిరంతర న్యాయ శాస్త్ర గ్రంథ పఠనం వల్ల అనేక ధర్మ సూత్రాలను ప్రతివాది ఎంత గొప్ప ప్రత్యర్థైనా చిత్తు చేయగలిగే వారు. ఆ కాలంలో చెన్నపట్టంలోనున్న గొప్ప న్యాయవాదులు సేకరించిన న్యాయ శాస్త్ర గ్రంథాలు సుబ్బారాయుడు గారి గ్రంథ సంచయంలో ఉండేవి. ఆ కాలంలో ప్రకటించే Indian Jurist, Madras Jurist, Madras Revenew Register అనే లా రిపోర్ట్లు, కొత్తగా ప్రకటించబడుతూవున్న Indian Law Reports భారత దేశ ప్రభుత్వం వారు చేసిన శాసనాలే కాక ఇంగ్లండులో న్యాయ శాస్త్రవేత్తలు రచించిన ఉద్గ్రంథాలు సుబ్బా రాయుడు గారి గ్రంథ సంచయంలో ఉండేవి.

న్యాయ శాస్త్రమునే గాక భారతదేశ చరిత్ర పైన ఆయనకు అభిరుచి వున్నందున ఇంగ్లీషు చరిత్ర కారులు భారత దేశమును గూర్చి రచించిన అనేక అపూర్వ చరిత్రలను కొన్నారు. 1857 సం॥. ప్రథమ స్వాతంత్ర యుద్ధమును గూర్చిన గ్రంథాలు, రాజ్యాంగ విషయమైన గ్రంథాలు, రాజకీయ శాస్త్ర గ్రంథాలు, ఆర్థిక విషయమును గూర్చిన ఉద్గ్రంథాలు కూడా కొన్నారు. ఇంత పెద్ద గ్రంథ భాండాగారం ఆ కాలంలో ఇంకెవర దగ్గరా లేదు. సుబ్బారాయుడు గారి తమ్ముడైన లింగయ్య గారింట వారి గ్రంథ సంచయముండగా లింగయ్య గారి కుమారుడైన సింగరాజు సుబ్బారావు పంతులు గారు కొన్ని నా కిచ్చారు. అందులో Cases Illustrative of Oriental Life decided in Supreme Court, Bombay by Erskine Perry , Chief Justice అనే ఉద్గ్రంథం 1853 సం॥ లండనులో ప్రకటింపబడినది. British Rule in India by Harriet Martineau అనే గ్రంథము 1857సం॥ లండనులో ప్రకటింపబడినది. The Madras Revenue Register అపూర్వ న్యాయ శాస్త్ర రికార్డుల సంపుటాలు నా దగ్గర ఇప్పటికీ వున్నవి. Indian Jurists, Madras Jurist లా సంపుటాలు వారు తీసుకున్నారు. సింగరాజు సుబ్బారాయుడు గారు దత్తు చేసుకున్న శ్రీ రాజేశ్వరరావు గారు ఈ సుబ్బారావు గారి జనక సోదరుడే. రాజేశ్వరరావు గారు కూడా ఇంగ్లీషు విద్యనభ్యసించారు కానీ యే పట్టాలు పొందలేదు. అయితే ఆయనకు తన దత్త తండ్రి గారి వలెనే భారతదేశ చరిత్ర పైన,

రాజకీయాల పైన, ఆర్థిక స్థితి గతులపై చాలా అభిరుచి. అందువల్ల ఆయన అనేక ఉద్గ్రంథాలు కొన్నారు. అందులో కొన్ని బెజవాడ రామ్మోహన్ ధర్మ గ్రంథాలయంలో ఇప్పటికి వున్నవి. వాటి పేర్లు, విషయాలు చూస్తే రాజేశ్వర రావు గారికి ఎంతటి దేశాభిమానం, భాషాభిమానం సాహిత్య అభిమానం వుండేదో తెలుస్తుంది. కాంగ్రెస్ కార్యకలాపాలను గురించిన అనేక గ్రంథాలతో పాటు కాంగ్రెస్సును గురించి పాశ్చాత్య దేశీయులు రచించిన అనేక గ్రంథాలు సేకరించారు. కాంగ్రెస్సుకు అధ్యక్షత వహించిన సర్ హెన్రీ కాటన్[16] గారు రచించిన Indian & Home Memories అనే గ్రంథము లండనులో ముద్రింపబడినది. New India అనే గ్రంథము కూడా ఆయన రచించినదే రాజేశ్వరరావు గారి గ్రంథ సంచయంలో నున్నవి. గోదావరి ఆనకట్ట నిర్మించిన ఆర్థర్ కాటన్ గారి జీవితం లేఖలు అనే గ్రంథము ఆయన కుమార్తె రచించి ఇంగ్లాండ్లులో ప్రకటించిన గ్రంథం కూడా రాజేశ్వరరావు గారు హెన్రీ కాటన్ ఛాయ చిత్రము సేకరించారు. మద్రాస్ నేటివ్ కంపెనీ వారి ప్రచురణలు, ఇటువంటి గ్రంథాలెన్నో ఉన్నాయి. ఆయన గ్రంథాల అనేకములు 1922-28 నాటికి రామ్మోహన్ గ్రంథాలయంలో ఉండగా చదివి నోట్స్ వ్రాసుకున్నాను. ఆ గ్రంథాలు నా చరిత్ర పరిశోధనకు చాలా ఉపకరించినవి. నా గ్రంథాల Bibliography లోచేర్చి యున్నాను. ఇంతటి గొప్ప ఆంధ్ర మహా పురుషుడైన సింగరాజు వెంకట సుబ్బారాయుడు పంతులు గారిని గూర్చి మచిలీపట్నం కాపురస్తులు, ఆంధ్ర కాంగ్రెస్ నాయకుడు, కుశాగ్ర బుద్ధి యైన డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్య గారు రచించిన కాంగ్రెస్ చరిత్రలో సుబ్బారాయుడు గారు మొదటి రెండు సభలలో పాల్గొని ఉపన్యసించారనేనా వ్రాయకపోవడం అలా వుండగా ఆయన పేరైనా ఉదహరించక



From a painting by Hugh G. Riviere, presented by the people of Bengal, 1903.

[16] సర్ హెన్రీ కాటన్ (1845-1915). వీరు 1904సం॥ లో జాతీయ కాంగ్రెస్సు సభ అధ్యక్షుడు. 1885సం లో న్యూ ఇండియా అను గ్రంథములను, 1908 సం॥ ఇండియా హోమ్ మెమొరీస్ అను గ్రంథమును రచించారు.

digavalli1943@gmail.com

పోవడం ఎంత అన్యాయమైన విషయము?దీనికి కారణం ఏమిటి?

మొదటి కాంగ్రెస్ సభలో జరిగిన కార్యకలాపాలను గురించి ఆ కాంగ్రెస్ రికార్డులు చూడకుండా 1915 సం॥లో అనీ బిసెంట్ గారు రచించిన How India Wought to Freedom అనే గ్రంథంలో ప్రథమ కాంగ్రెస్ లో పాల్గొన్న వారిని గూర్చి వ్రాసిన సంగతులను తన పుస్తకంలో గుడ్డిగా ముద్రించడం వల్లనే ఈ పొరపాటు జరిగింది. ఆంధ్రపత్రికలో శివరామకృష్ణ రావు [కొడాలి] గారి వ్యాసం ప్రకటించబడిన తరువాత నైనా ఈ తప్పును సవరించక కప్పిపుచ్చి కాంగ్రెస్ చరిత్రలను పునర్ముద్రించడానికి కారణం ఏమిటి? ఈ తప్పు బయటపడితే ఇంకా ఇలాంటి తప్పులు ఎన్ని వున్నవోనని తోటి కాంగ్రెస్ నాయకులు నవ్వుతారని భయపడి యుంటారు.

డాక్టర్ పట్టాభి గారు చాలా లౌక్యుడు. ఆయన సంగతి ఎరిగియున్న వారికి ఈ విషయంలో ఆయన చేసిన ఘోరమైన అపచారము ఆశ్చర్యం కలిగించదు. ఆయన రాజకీయ జీవితంలో ఇటువంటి అక్రమ చర్యలు చాలా జరిగించారు. పట్టాభిరామయ్య గారు చేసిన తప్పు ఫలితముగా ఆంధ్ర స్వాతంత్ర్యోద్యమ చరిత్రలోను, తెలుగు భాష సమితి వారు ప్రచురించిన విజ్ఞాన సర్వస్వము తెలుగు సంపుటాలలోనూ కూడా కీ.శే. సింగరాజు సుబ్బారాయుడు గారి పేరు లేకుండా పోయినది. ఎంత అన్యాయం!

అసత్యము దాగదు. ఎప్పటికైనా పైకి వస్తుంది కృష్ణాజిల్లా స్వాతంత్ర యోధుల సంఘోద్యోగుడైన నా మిత్రులు శ్రీ కాట్రగడ్డ మదుసూధన రావు గారు కృష్ణాజిల్లా జాతీయోద్యమ చరిత్ర వ్రాస్తున్నాము దాని విషయంలో నాకు తెలిసిన సంగతులు చెప్పమని నా దగ్గర ఉన్న కొన్ని చరిత్రాంశాలిచ్చి తోడ్పడవలసినదని కోరగా నేను కొన్ని ఆధార పత్రాలను ఇచ్చాను. వాటికి జిరాక్సు తీసుకున్నారు. శ్రీ సింగరాజు సుబ్బారాయుడు గారిని గురించి నా దగ్గర ఉన్న పాత టైపు కాగితాలను కూడా ఇచ్చాను. దీనిని గురించి ఒక చిన్న వ్యాసం వ్రాసి పెట్టటం యుక్తమని తోచి వార్ధక్యం వల్ల ఓపిక తగ్గినా ఈ వ్యాసం వ్రాసినాను

— ✦ ❖ ✦ ——

digavalli1943@gmail.com

బందరు నవాబు కథ

హసన్ అలీ ఖాన్ లేక హుస్సేన్ అలీ ఖాన్

ఈ హసనలీఖాన్ పూర్వం జహంగీరు చక్రవర్తి దర్బారులో బఖీల్ ఖాన్ నజ్మాయి సానీ అనే ప్రఖ్యాత వంశీయుడని చెప్పేవారు. హసనలీఖాన్ దక్కన్ సుబేదార్ నిజాముల్ ముల్క్ వంశీయుల కొలువులో చేరి ఔరంగాబాద్ రాష్ట్రంలో పనిచేసి పేరుపొంది ఉత్తర సర్కారులకు సుబేదారుడిగా నియమింపబడినవాడు.

నిజామలీ ఖాన్[17] గారిని అడిగి కొండపల్లి, ఏలూరు సర్కారులను పుచ్చుకోవలసిందని మద్రాసులోని ఇంగ్లీషు వర్తక కంపెనీ వారికి మొదట సలహా ఇచ్చిన వాడు ఇతడే. తరువాత ఇతడు ఇంగ్లీష్ కంపెనీ వారికి స్నేహితుడుగా నుండి రాజమహేంద్రం దగ్గరను, ఇతర చోట్లను వారి సైన్యానికి చిన్న చిన్న యుద్ధాలలో సహాయం చేశాడు కూడా. ఉత్తర సర్కారులను నిజామలీఖాన్ వల్ల సంపాదించడానికి, వాటిని స్వాధీనం చేసుకోవడానికి ఇంగ్లీష్ వారికి తోడ్పడినాడు. 1759 సం॥లో దక్కన్ సుబేదార్ సలాబతు జంగు హసనలీ ఖాన్ గారిని రాజమహేంద్రవరం, ఏలూరు, కొండపల్లి సర్కారులకు 'నాయబు' గా నియమించినాడు. ఇతడు కొండపల్లి ఏలూరు రాజమండ్రి సర్కారులను మూడు సంవత్సరాలు రాజు ప్రతినిధి దర్జాలో పరిపాలించాడు. మద్రాస్ కంపెనీ ప్రభుత్వం వారు నిజాం అలీ ఖాన్ తో రాయబారాలు జరిపి కృతకృత్యులు కానంత కాలము వారు హసన్ అలీ ఖాన్ నాశ్రయించి అతని సహాయం పొందేవారు. అతను నిజామాలి ఖాన్ ఉద్యోగి యైనా ఇంగ్లీషు వారితో స్నేహంగా ఉండి ప్రతి విషయంలోనూ తోడ్పడేవాడు. ఒకమారు నిజాం పేరుతో సర్కారులను ఇంగ్లీష్ వారికి సన్నదు కూడా వ్రాసి ఇచ్చినాడు. అయితే సుబేదార్ గారి సైనిక సహాయం కోరినప్పుడు ఇంగ్లీష్ వారు సైనికుల నివ్వలేదని నిజామాలీఖాను గారీ సన్నదు నంగీకరించలేదు. ఇంగ్లీష్ వారు మొగల్ పాదుషా వల్ల సర్కారులను 1760 సం॥లో సన్నదు పొందినా బయట పెట్టడానికి ధైర్య పడలేదు. ఇంగ్లీషు వారు సదరు నిజామలీ

[17] నిజామలీఖాన్ =మీర్ నిజామ్ అలీ ఖాన్(అసఫ్ ఝు).

ఖాన్ గారి షరతుల కంగీకరించగా ఆయన వారికి 12-11-1766 తేదీన సన్నదు నిచ్చాడు. సర్కారులను స్వాధీనం చేసుకోడానికి హసనలీఖాన్ కింకా మూడు సంవత్సరములు కొలున్నందు వల్ల కంపెనీవారు 1769సం॥ వరకూ ఆయన క్రిందనుండనిచ్చారు. హసనలీ ఖాన్ గారితో కంపెనీ వారికి అక్కర తీరిపోయినది. అంతట ఈ సర్కారులు తాము సంపాదించుట వల్ల కాక తమ ప్రయోజకత్వం వల్లనే నని చక్రవర్తి సన్నదు ను ప్రకటించారు. అసనలీ ఖానును త్రోసిరాజన్నారు. అతని సైన్యమును బర్తరఫ్ చేయవలసిందనీ, నవాబు హొదాను వదులుకోవాల్సిందని అతనికి సాలుకు లక్ష రూపాయలు చొప్పున పింఛన్ ఇస్తామని బేరం పెట్టారు. అతను జాగీర్ కావాలని పేచీ పెట్టాడు. అంతట 13 గ్రామాలు జాగీరుగా ఇచ్చి రెండు జమీందారీలలో శిస్తు వసూలు ఇజారా కూడా ఇచ్చారు. బందరు నవాబు అనే బిరుదును మాత్రము అతడు చలాయించేవాడు. హసన్ గారు 1771 సం॥లో చనిపోగా కంపెనీ వారు ఆ జాగిరు రద్దుచేసి ఆయన కుటుంబానికి ఒక లక్ష రూపాయలు పింఛను మంజూరు చేశారు. అతని పెద్ధ కుమారుడు సుభాన్ గారు లేక రుస్తుం జా. అతనికి ఇద్దరు కుమారులు వారిలో రెండవ కుమారుడు నిజాముద్దౌలాకు 30-5-1854 తేదీన బందరు నవాబు అనే బిరుదును రద్దు పరచి నెలకు 1183 పింఛను మాత్రం మంజూరు చేశారు. సర్కారు కరెస్పాండెన్సులో మాజీ బందరు నవాబు అని వ్యవహరించే వారు Krishna Dt. Manual pp 293–295.

— ✦ ❖ ✦ ——

THE VIJNANA CHANDRIKA MANDALI

(The Telugu Athenaeum)

Established 1906

And

Incorporated as under act XXI of 1860 on 15th March 1913

MEMORANDUM AND ARTICLES OF ASSOCIATION

Office:

90, SWAMI NAIK STREET, CHINTADRIPET,

MADRAS.

1914

MEMORANDUM OF ASSOCIATION

I. The name of the the Association shall be called "The Vijnana Chandrika Mandali" (The Telugu Athenaeum), Madras.

II. Its objects are:-

1. To create a healthy literature in Telugu, chiefly consisting of prose books on History, Biography, Science, Historical Romance and translations of important and useful works from other languages that will tend to the mental and moral improvement of the people and to supply search books at the cheapest possible rates.
2. To encourage the study of Western sciences and literature through vernaculars by instituting examinations granting of prizes and medal

3. To encourage authors by paying them honorariums, by contributing to the cost of printing of their books and by other means.
4. To form and maintain a Telugu Library consisting of printed books and of rare manuscripts.
5. To do such other things as may tend to the improvement and diffusion of Telugu literature

III. Subject to the rules and regulations of the Association copy of which is filed herewith, the management of the affairs of the Association shall be conducted by a committee of Management consisting of a President and Editor, and a Manager and two other members and the following gentlemen shall constitute the first Committee of Management :-

1. The Hon. Rao Bahadur B.N. Sarma[18] B.A., B.L High Court Vakil Luz Road, Mylapore, Madras -----------President
2. Mr. K.V. Laxman Rao[19] M.A., Dewan, Munagala Estate Nadigudem Krishna District-----------------Editor
3. Dr. A Lakshmipathi[20], B.A.,M.B & C.M Medical Practitioner, Chintadripet, Madras----Manager
4. Mr. A.Kaleshwar Rao[21] B.A., B.L Vakil Bezwada Krishna District College, Saidapet, Madras

We, the several persons whose name and addresses are here-unto subscribed, have formed ourselves into an Association in pursuance of this Memorandum

Dated 14th March 1913

---

18 బయ్యా నరసింహ శర్మ
19 కొమర్రాజు లక్ష్మణరావు
20 ఆచంట లక్ష్మీపతి
21 అయ్యదేవర కాళేశ్వర రావు

S.No. Signature Address Signature of Witness

1 B. Narasimha Sarma (sd)
B. Narasimha Sarma B.A., B.L
High Court Vakil, Luz Road, Mylapore, Madras
K.Subba Rao (sd)

2 V. Lakshman Rao (sd)
V. Lakshman Rao M.A.,
Deewan , Munagala Estate,
Nadigudem, Krishna District -Ditto-

3 A. Lakshmipathi (sd)
Dr. A. Lakshmipathi
B.A., M.B &CM., Medical Practitioner,
Chintadripeth, Madras -Ditto-

4 G.Ramachandra Rao[22] (sd)
G.Ramachandra Rao -Ditto-

Land Lord, Buckingham Lodge, Triplicane, Madras

5 V.V. Sarma[23] (sd)
V.V. Sarma, Pupil-Teacher

---

22 గూడూరి రామచంద్ర రావు
23 వేమూరి విశ్వనాథ శర్మ

digavalli1943@gmail.com

	Teachers' College, Saidapet, Madras	-Ditto-
6	T.Venkatramaiah (sd)[24] T.Venkatramaiah, Pupil-Teacher Teachers' College Saidapet, Madras	-Ditto-
7	A. Kaleswara Rao (sd) A. Kaleswara Rao B.A., B.L Vakil, Bezawada, Krishna District	-do-

THE VIJNANA CHANDRIKA MANDALI

(The Telugu Atheneum)

Chintadripet, Madras

(Registered on 15-03-1913)

Rules and Regulations

I. This Association shall be called "The Vignan Chandrika Mandali" the Telugu Athenaeum; Madras

II. Its objects are:-

---

24 తుర్లపాటి వెంకట్రామయ్య

1. To create healthy literature in Telugu, chiefly consisting of prose books on History, Biography, Science and Historical Romance and translations of important and useful works from other languages that will tend to the mental and moral improvement of the people and the supply search books and the cheapest possible rates
2. To encourage the study of Western science and literature through vernaculars by instituting examinations granting of prices and medals
3. To encourage authors by paying them honorariums by contributing to the cost printing of the books and by other means
4. To form and maintain a Telugu Library consisting of printed books and of rare manuscripts
5. To do such other things as stand to the improvement and diffusion of Telugu literature

III, This association shall consists of:- (1) Patrons, (2)Members

(1) Patrons shall be those who give donation of rupees 1000 or more to the Association

(2) Members shall be those who have fixed their signatures to the Memorandum of Association and those who shall be elected by not less than 75% of the members of the Association for the time being.

The following 7 persons shall be the first members:-

1. The Honorable Rao Bahadur B.N Sarma B.A., B.L.
2. K.V. Laxman Rao M.A

digavalli1943@gmail.com

3. A. Kaleswara rao
4. A. Lakshmipathi B.A., M.B&C.M
5. V. Vishwanatham Sarma M.A
6. T Venkat Ramaiah B.A
7. G Ramachandra Rao

IV. The affairs of the association shall be managed by a committee of Management consisting of a President, an Editor, a Manager and two other members of the Association. The first President of the Committee, The Honorable Rao Bahadur B.M. Sarma B.A., B.L. The first Editor shall be Mr. KV Laxman Rao M.A who shall hold this office during his life, the first Manager shall be Dr A Lakshmipati, B.A., M.B&C.M and the first two other members shall be Mr. A. Kaleshwar Rao B.A., B.L and Mr Viswanatha Sarma, M.A.

V. The Editor shall be in charge of the whole policy of publications and all literary business the Association may undertake, and shall fix the honorariums to be awarded to authors subject to the rules and bye-laws passed by the committee of Management.

VI. The managers shall manage the institution subject to the supervision of the committee of management in accordance with the rules and bye-laws passed by the committee of management. He shall take possession of and be in charge of all the property of the institution, receive donations, sale proceeds etc., give receipts and discharges and appoint servants. He shall be competent to suspend, fine and dismiss servants of the Mandali, pay salary defray all charges, grant leave to the members of the staff , keep regular account of receipts and disbursements and maintain vouchers. His orders of suspension and dismissal shall be opened to appeal to the

committee. The Association shall sui and be sued in the name of the Manager.

VII. The business of the committee shall be conducted either at a meeting or by correspondence. The managers shall keep a record of the proceedings of meetings and preserve the opinions of members obtained by correspondence.

VIII. The quorum for meeting of committee shall be two

IX. The committee of management shall be elected once in 3 years by the members and shall have power to make bye–laws from time to time not inconsistent with the rules of the Association.

X. The accounts of the Association shall be audited by a competent auditor and his report with the Balance Sheet shall be placed before the Association before the annual meeting.

XI. The surplus funds of the Association shall be invested in the names of the President, the Editor and the Manager in such securities as the members of the Association may decide from time to time and shall be drawn in such manners the Association may decide from time to time. The property of the Association shall be registered in the names of the President, Editor and Manager.

XII. There shall be annual meetings of the members of the Association:–

i. To consider and passed the balance sheet

ii. To fill up vacancies among the committee of Management

iii. To fill up vacancy is among the members of the association.

iv. To consider such other matters as may be placed before them by the committee of management.

digavalli1943@gmail.com

The quorum for the annual meeting shall be 40% of members on the role of the number of members of the Association call for an extraordinary meeting of the association for the consideration of any important subject. The quorum for such meetings shall be ¾ of the above members on the role. Any fraction in the quorum shall be counted as one.

XIII. The Association shall have power to add to, to alter, cancel or modify the rules hereof provided such changes is approved of by not less than 75% of the members of the association.

XIV. The year for Association Shall be the English calendar year.

(sd) B.N. Sarma

(sd) KV Laxman Rao

(sd) A. Lakshmipati

(sd) Venkat Ramaiya

(sd) Guduru Ramachandra rao

(sd) V.V. Sarma

(sd) T. Venkatramiah

(sd) A. Kaleswararao

8th March 1913 S.V.& Co, Madras

09-04-1914

పితృపూజ- సంస్మరణ

దైవారాధనము లాగానే పితరులను ఆరాధించటం కూడా ప్రపంచంలోని అన్ని జాతులలో ఏదో రూపంగా ఉన్నది. మన దేశంలోనే గాక చైనా, జపాన్ దేశాలలో ప్రాచీన కాలంనుండీ పితృ పూజ మత ధర్మంగా ఉన్నది.

చనిపోయిన పితరులకు ఉత్తర క్రియలు చేసే పద్ధతులు, వారిని పూజించే పద్ధతులు, స్మరించే పద్ధతులు దేశకాల ప్రాంతములను బట్టి అనేక విధాలుగా ఉన్నది.

రేషనలిస్టులుమనే వారు దీనిని మూఢ విశ్వాసాల క్రింద జమ కట్టినా అత్యాధునిక నాగరికులైన పాశ్చాత్య దేశాల వారు కూడా దీనిని ఇప్పటికీ కూడా అనుసరిస్తున్నారు. ఇటీవల ప్రకటింపబడిన Encyclopedia Britanica లో అమెరికా ఇంగ్లాండ్ మొదలైన దేశాల విద్వాంసులు మత ధర్మాలను గురించి వ్రాసిన వ్యాసాలు చదివితే మతమనేది సాంకేతికములతో నిండి యున్నదని (symbolism)తెలుస్తుంది. ఒకరి మత ధర్మాలింకొకరికి మూఢ విశ్వాసాలుగా కనబడవచ్చునని కూడా తెలుస్తుంది.

అసేతు హిమాచల పర్యంతము గల భారతదేశంలోని బ్రాహ్మణులే గాక బ్రాహ్మణేతరులలోని వివిధ కులాల వారు తమ నిత్య జీవితాలలో శుభాశుభాలలో, పండుగ పబ్బాలలో పితృ పూజ చేస్తారు

బ్రాహ్మణులు వైదిక పద్ధతిలో జరిగించే కార్యకలాపాలను క్షత్రియులు, వైశ్యులు కొంచెము భేదముతో అనుసరిస్తారు. బ్రాహ్మణేతరులలలోని ఇతర కులాల వారు వారి వారి కుల వృత్తులకు అనుగుణమైన జీవిత విధానము అనుసరించి పితృ పూజలు జరుపుతారు. అన్ని కులాలవారికిని ధర్మార్థ కామ మోక్ష ములనే చతుర్విధ పురుషార్థముల నాచరించడమే పరమ ధర్మముగా నున్నది.

బ్రాహ్మణ పురోహితులు జరిపించే ప్రతి సాంవత్సరిక శ్రాద్ధములోని పిండ ప్రదాన పద్ధతి గాక ఆనుశ్రాద్ధమనీ, హిరణ్య శ్రాద్ధమనే పద్ధతులు కూడా ఉన్నవి.

బ్రాహ్మణులు మహాలయ పక్షంలో అనగా నవరాత్రికి ముందుగా పదిహేను రోజులలోనూ, సంక్రాంతిలోను, తీర్థయాత్రలలోను, పుష్కరాలలోనూ పితృపూజ చేస్తారు. వివాహకాలమందు పితరులను పూజించుట ముఖ్యమైన కార్యముగా యెంచుతారు. బ్రాహ్మణేతరులు కూడా వారి వారి కులాచారముల ననుసరించి పిత్రు పూజ చేస్తారు. సంక్రాంతిలో పెద్దలకు పెట్టడమున్నది, శివరాత్రి నాడు తిల[25] తెప్పలను వదలడం మొదలైనవి పితృ పూజలే. తీర్థయాత్రలలో బ్రాహ్మణులు లాగానే క్షుర కర్మ చేయించుకుని తర్పణాలు వదలి పిండ ప్రదానం చేస్తారు . పుష్కరాలలో కూడా అలాగే చేస్తారు. బ్రాహ్మణులు చేసే సంధ్యా వందనములలో నిత్య కర్మానుష్ఠానంలోను పితృ పూజ యున్నది. పితరులను పూజించడమే గాక వంశములలోని వారినే గాక బంధుమిత్రులను, మత ధర్మాలకు మూల పురుషులైన ఋషులకు తర్పణాలు వదలి స్మరించవలసియున్నది. ఇటీవల నాగరికతా ప్రభావం వల్ల ఈ కార్యకలాపాలు సన్నగిల్లిపోయినవి. బ్రాహ్మణేతరులలోని పూర్వాచార పరాయణులు కూడా తెల్లవారక ముందే లేచి చేసే దేవతా స్తోత్రములతో పాటూ ఋషులను, మహాపురుషులను స్మరించడం, స్తోత్రాలు, దండకాలు, పద్యాలు చదవడం యుండేది. నిన్నమొన్నటివరకూ కృష్ణా జిల్లాలోని కొన్ని కమ్మ, రెడ్డి కుటుంబంలోని పెద్దలు అనుసరించే పద్ధతులు నా మిత్రులు సుప్రసిద్ధ గ్రంథకర్త జయంతిపురం రాజా గారు, శ్రీ వాసిరెడ్డి దుర్గా సదాశివేశ్వర ప్రసాద్ గారు నాకు చెప్పారు.

మహా కవియైన పింగళి సూరన ప్రభావతీ ప్రద్యుమ్నములో తన తండ్రిగారికి కృతియిచ్చుట మూలంగా పితృపూజ చేస్తున్నానని ఈ క్రింది పద్యాలు వ్రాశాడు.

---

[25] అరటి ఆకులను తెప్పలు లేక దొన్నెలు గా చేసి నువ్వులు వేసి నీటిలో వదలటం.

మ || గయలో గాశి బ్రయాగ శ్రీగిరిని గంగా ద్వార నీలాచలో
జ్జయినీ ద్వారక లందయోధ్య మధురన్ సంస్తుత్య పుణ్యస్థలా
గ్రియతన్ వెండియు మించు నైమిశ కురు క్షేత్రాదులం దర్పణ
క్రియచే నా పిన తమ్ముడెఱ్ఱిన యొనర్చెన్ తండ్రి కాహ్లాదమున్

కం|| ఏనుం బితృపూజన నా,చే నైన ఖ్లెద్ధియైన జేయగ వలయున్
గాన గృతియిచ్చి మేదిని పై నిలుపుదు నతని కీర్తి బరమేశు కృపన్

.....8-9

—— ✦ ❖ ✦ ——

కూచిమంచి తిమ్మకవి(1684-1757)

వక్కలంక వీరభద్ర కవి(వాసవదత్త పరిణయం గ్రంథ కర్త), ఈదరపల్లి భవానీ శంకర కవి(ధర్మకాండము నిర్మాత) సమకాలీకులు. ఏనుగు లక్ష్మణకవి ఈయనకు బంధువులు. కూచిమంచి జగ్గ కవి తిమ్మకవి కనిష్ఠ సహోదరుడు. గోదావరి మండలములోని పిఠాపురం సంస్థానమునకు చెందిన కందరాడ గ్రామ కరణము- ఆరువేల నియోగి బ్రాహ్మణుడు, కౌండిన్యస గోత్రుడు. తిమ్మయా మాత్యుని పౌత్రుడు. తండ్రి గాంగేయామాత్యుడు. తల్లి అచ్చమాంబ, భార్య బుచ్చమ్మ. దెందులూరి లింగనా రాధ్యుని యొద్ధ మహేశ్వర వృత్తి నుపదేశము పొంది ఆజన్మాంతము శివ దీక్షా పరాయణుడై తన కవిత్వమును శివునికే అంకితముచేసినాడు. పిఠాపురం మహారాజు వల్ల కవి సార్వభౌమ బిరుదు పొందినాడు. అయితే తన గ్రంథాలను రాజులకు అంకితం ఇవ్వకుండా ఆ గ్రామంలోని దైవమగు కుక్కుటేశ్వరునికే అంకితం ఇచ్చిన ధైర్యశాలి. స్వతంత్రుడు. ఈయన ఉత్తర సర్కారులలో ఫ్రెంచ్ వారితో చేసిన యుద్ధకాలమున ఉన్నాడు. ఈయన కవిత్వమును వీరేశలింగం గారు మెచ్చుకున్నారు. తిమ్మకవి ఆంధ్ర భాష లక్షణ గ్రంథము వ్రాశారు. ఈయన శివభక్తుడే గాని అద్వైతి. పూర్వాచార పరాయణుడై వర్ణాశ్రమ ధర్మము పట్ల, వేద శాస్త్రముల పట్ల అమిత గౌరవము కలవాడు. తన కాలమునాటి కులమర్యాదలలో దేశ భాషలలో కలిగిన మార్పులు చూసి బాధపడినాడు. కొన్నిటిని తీవ్రంగా ఖండించాడు. కుక్కుటేశ్వర శతకంలో భర్గ శతకంలో ఈయన విమర్శలున్నవి. ఇవి కవి కలికాల మహత్యంవల్ల కలిగినవని వ్రాశాడు. ఈ కవి కాలం నాటికి వేమన గారు, వీరబ్రహ్మంగారు, ఇతర వేదాంతులు బోధించిన అచలమతము దేశంలో వ్యాపించియున్నట్లు నిదర్శనాలు కుక్కుటేశ్వర శతకము వలన తెలుస్తుంది.

“కాపు కవీశ్వరుల్, కంచలి యోగులు, జైన బాపలు ఆడ తీర్పరులు సాతాని వైష్ణవులు, సాలె జంగములు .....” అని కుక్కుటేశ్వర శతకంలో వ్రాసిన పద్యము వేమన గారిని, వీరబ్రహ్మంగారిని, తరిగొండ విదుషీమణులను మనస్సులో నుంచుకొని వ్రాసినట్లు నా నమ్మకము.

ఆనాటి రాజులు,జమీందారులు, ధనవంతులు మదాంధులై భోగలాలసులై జీవించే విధానాలను కుక్కుటేశ్వర శతకంలో వర్ణించాడు. వేమన వలెనే బ్రాహ్మణులను, కవులను, పండితులను విమర్శించాడు.

ఆయనవి అనేక కృతులుగా పేర్కొన్నవానిలో తత్వములు , దండకములు గాక

(1) రాజశేఖర విలాసము

(2) రుక్మిణీ పరిణయము(1715)

(3) సింహశైల మహత్యము

(4) నీలాసుందరి పరిణయము

(5) అచ్చ తెలుగు రామాయణము

(6) సారంగధర చరిత్రము

(7) సాగర సంగమ మాహాత్మ్యము

(8) సర్వలక్షణసార సంగ్రహము(1740)

(9) రసికజన మనోభిరామము (1750)

(10) సర్పపురీ మహాత్మ్యము (1754)

(11) శివలీలా విలాసము(1756)

(12) సుజన మనః కుముద చంద్రిక

(13) కుక్కుటేశ్వర శతకము

సర్వలక్షణసార సంగ్రహ చరిత్రలో ప్రాచీన కవిప్రయోగ విశేషములను క్రోడీకరించి నాడు. లక్ష్య లక్షణములను పద్యరూపమున వెలయించినాడు. రసికజన మనోభి రామమును పిల్లవసుచరిత్ర యందురు.

భర్గ శతకము 1729సం॥లో రచించినాడని ఆరుద్ర గారు వ్రాశారు.

పో! పో! బాపడ! దోసె డూరల దినం బోలేక పేరాస న్వాపో జాగితివేమి,
నీ సదువు తిర్నామంబులో సుద్దులో!
భూపాళంబులొ లంక సత్తెలో బొల్లావు పోట్లాటలో
కా పాటింపనటంౘ్రు బాలిశులు
భర్గా! పార్వతీ వల్లభా! నెం. 94

పండితుల చదువులు గొల్ల సుద్దుల లాగ కాటమ రాజు కథలోని బొల్లావు పోట్లాట లాగ పామరులకు ఆనంద మివ్వదు కదా. దోసెడూదలు చాలవని యాచకుని ఊహ. గిద్దడే ఎక్కువని ఇచ్చేవాని యూహ

అదుగో బాపన యలుభొల్లుయను ముందప్పయ్య తీర్థంబులో
నదనం 'గిద్దెడు కొఱ్ఱ నూకలిడితిన్ అబ్బబ్బ! తిర్నామములే
సదువం జాగిన మాలదాసర యలన్ సంతోస నాల్ సేసితిం
గద' యంచుం బలు మోటులాడుదురు భర్గా పార్వతీవల్లభా నెం95
(సమగ్రాంధ్ర సాహిత్యం భాగం 12, పుట 220)

తిమ్మకవి చరమ దశలో పరాంతం సమీపంలో చంద్రమపాలెంలో నివసించినట్లు వంగూరి వారు వ్రాశారు.

పిఠాపురం కుక్కుటేశ్వర స్వామి

పూర్వం జైనారామంలోని[26] కుక్కుట సర్ప పరివృతుడైన తీర్థాంకరుని విగ్రహముండెను. దానిని శివ క్షేత్రముగా మార్చి నారని పురాతత్వవేత్తల అభిప్రాయమని శతకపీఠిక లో శివశంకర స్వామి గారు[27] వ్రాశారు

కుక్కుటేశ్వర శతకము

సీ|| చల్లగా మాల దాసర సటారయగారి
తిర్నామములు సాన తేప వింటి
గొల్లమారన బోయ దెల్లగా సతికితే
బొల్లావు పొట్లాటలెల్ల యింతె
జయన యెంకట భొట్లు సబ్బండు సారాలు
పూరాండములు సెప్పగోరి యింటి
సరవయ్య బయ నీడు జమలిక తో బాడు
నంకమ్మపాట లెన్నైన యింటి

గీ|| గాని సీ యెద్దు మాన్యుల కయితకబు
లందమదనిపించు కాయల యంద మండ్రు
భూమనుత విలాస పీఠికాపుర నివాస!
కుముద హిత కోటి సంకాశ, కుక్కుటేశ ||

కాటమరాజు కథలో పశువులను తోలుకుని పోయినందువల్లన పోట్లాటను గూర్చిన కథ. గొల్లవారిలో ఈ కథ ప్రసిద్ధి చెందినది.

— ✦ ❖ ✦ ——

26 పిఠాపురమే జైనారామం
27 తల్లావజ్ఝుల శివశంకర స్వామి (శివ శంకర శాస్త్రి)

క్రీ.శ.14-15 శతాబ్దులనాటి భారతదేశము[28]

ఢిల్లీలో స్థాపింపబడిన తురుష్క సుల్తానుల ప్రభుత్వం క్రమ క్రమముగా బలహీనమై మొగలాయి వీరుడైన తైమూర్ దండయాత్రతో అంతరించినది. హిందూ దేశంలో నాలుగు ప్రక్కలను పెద్ద పెద్ద స్వతంత్ర రాజ్యములు వెలసినవి. ఇవి చాలా మటుకు మహమ్మదీయరాజ్యములే. దక్షిణ హిందూదేశములోని విజయనగర సామ్రాజ్యం మొక్కటి మాత్రము బలవంతమైన హిందూ రాజ్యముగా నుండినది. ఇస్లాము మత మీదేశములో ప్రాతకాపు అయి పాదుకొన్నది. తురుష్కులు, ఆఫ్ఘనులు వారి భృత్యులునైన ముసల్మానులు మొదట దండయాత్ర చేసినప్పుడు చూపిన క్రౌర్యము, అసహనము క్రమ క్రమముగా తగ్గిపోయినది. భారతదేశమును పరిపాలించిన మహమ్మదీయ రాజులు విదేశ రాజులులాగ కాక తోడి హిందూ రాజులు లాగానే, భారతీయ ప్రభువులుగానే పరిపాలింపసాగినారు. వివిధ రాజ్యములొండొంటితో పోరాడుకొనుచు యుద్ధములు చేయుచుండిన మాట వాస్తవమేగాని అవి మత సంబంధములైన యుద్ధములు మాత్రము కావు. ఒక్కొక్కప్పుడు ముసల్మాను రాజ్యము హిందూ సైనికులను, హిందూ రాజ్యము మహామ్మదీయ సైనికులను పోషించి నడుపుచుండెను. మహమ్మదీయ రాజులు తరుచుగా హిందూ రాజకుమారితలను పెండ్లాడు చుండిరి. హిందువులను మంత్రులుగాను పెద్ద ఉద్యోగులుగాను నియమించుచుండిరి. దేశములో విజేత, పరాజితుడు, పాలకుడు, పాలకులు అనే భేద భావము ప్రబల లేదు. హిందూదేశంలోని మహమ్మదీయులు చాలామంది ముసల్మాను రాజులలో కొంతమంది కూడా హిందువులలో నుండి ముసల్మానులైన వారే. వారిలో చాలామంది రాజ్యసభలో గౌరవం సంపాదింపవలెననియో లేదా ఆర్థికంగా లాభమును పొందవచ్చు ననియో అలాగున మహమ్మదీయ మతంలో కలిసి యుండిరి. అందువలన వారు తమ మతమును మార్చుకొనిరేగాని తమ కుటుంబములో తర తరముల నుండిన ఆచారముల నెంతమాత్రము మార్చుకొనలేదు. కొందరు మహమ్మదీయ రాజులు

---

[28] (Glimpses of World History - Pandit Jawaharlal Nehru pp252 253) ……………..
…………………………………………………రచయిత వివరణ

హిందువులను బలవంతంగా తమ మతంలోనే కలుపుకొనుటకు ప్రయత్నించిరి. దీనికి కారణము ఈలాగున తమ మతమున కలిసిన వారు తమ పట్ల రాజభక్తిని కలిగి యుందురని అభిప్రాయ పడియుండుటయే. తమ మతమును వ్యాప్తిచేయ వలెనని మతావేశమున గాక తమ రాజ్యాధిపత్యములు గట్టి చేసుకొన వలయునను రాజకీయోద్ధేశ్యము ప్రబలముగా నుండెను. అందువలన క్రొత్తగా మతములో కలసినవారు మహమ్మదీయాచారములనే అవలంబించిరో పూర్వాచారములనే పాటించరోయెను ఆలోచన వారికి పట్టలేదు. అయినప్పటికీనీ బలవంతముగా మతములో కలుపుకొనుటకు రాజులు చేసిన ప్రయత్నములంత ఎక్కువగా ఫలింప లేదు. అంతకన్నా వారు మహమ్మదీయ మతములో కలుయునట్లు చేయుటకు కొన్ని ఆర్థిక పరిస్థితులే ఎక్కువగా తోడ్పడినవి. మహమ్మదీయులు కాని వారందరూ జి జి యా యను తల పన్నిచ్చు కొనవలసి యుండెను. ఈ నిబంధనములు జరిగినందువలన అది తప్పించుకొనుటకు చాలామంది బీదవారు ముసల్మానులగుచుండిరి.

ఈ పరిస్థితులన్నియు రాజధాని నగరంలోను, పెద్ద పెద్ద పట్టణములలోనూ ఉండెనేగాని అసంఖ్యాకములైన గ్రామములలో నున్న లక్షలకొలది జనసామాన్యము ఎట్టి ఒడుదుడుకులు లేకుండా పూర్వం వలనే జీవించుచుంటిరి. సాధారణముగా రాజ్యోద్యోగులు గ్రామస్తుల పట్ల నిరంకుశులై ప్రవర్తింతురను మాట నిజమే గానీ ఆ కాలంలో ఇప్పటి వలెగాక గ్రామాలకు స్వపరిపాలనాధికారము స్వాతంత్రము ఉండెను. ఆ కాలములో ప్రతి గ్రామము లోను గ్రామము యొక్క క్షేమలాభములను చక్కబెట్టుకొనుట కధికారము గల గ్రామ పంచాయతీలుండెను. ఆకాలములో సాంఘిక విషయములలోను మత విషయములలోనూ గ్రామ జీవనము నందెట్టి మార్పులును కలుగలేదు. మహమ్మదీయ ప్రభుత్వం వల్లనీ గ్రామ జీవనమెంతమాత్రము మారలేదు.

హిందూ దేశము యొక్క సనాతన ధర్మము మహమ్మదీయుల రాక వలన రెండు విధములుగా కదలిక చెందినది. ఒక వంక నీ క్రొత్త మతము యొక్క ఆచార వ్యవహారములు వచ్చి సనాతన ధర్మమును కలుషితము చేయ కుండ కాపాడుకో వలయునని, స్వధర్మ రక్షణము చేసుకొనవలెనను ప్రయత్నమున మ్లేచ్ఛ

సంపర్కమును నిషేధించి సనాతన ధర్మము దూరముగా తొలగి చరింపసాగినది. వర్ణాశ్రమ ధర్మము యొక్క విధులను గట్టిచేసుకొనిరి. ఆచారమున కెక్కుడు ప్రాముఖ్యమునిచ్చి, జీవిత విధానమును సంకుచిత పరచుకొన్నది.. స్త్రీలు పరపురుషుల కంట బడరాదను 'ఘోషా' పద్ధతి, అంతఃపుర వాసము ప్రబలినవది. అతిబాల్య వివాహములు వృద్ధి యైనవి. ఈ వర్ణాశ్రమ ధర్మము యొక్క కఠిన నియమములు, ఈ ఛాందస్వాచారములు, పూజా పురస్కారములు, మితిమీరినందువలన ఇంకొక వంక వీనిపైన రోత కలిగి ధిక్కారము బయలుదేరినది. ఈ నియమముల నుండి బయట పడుటకు మత సంఘ సంస్కరణలను చేయవలెను వాంఛ బయలుదేరినది. ఈ విజాతీయ నాగరికతలోనూ, కొత్త మతములోనూ గల మంచి సంప్రదాయములను మనమేల గ్రహింపరాదను భావము కూడా కొందరకు కలిగినది. తమ పరిశుద్ధ వర్తనము వల్లను భగవత్భక్తివలననూ ప్రజాలనాకర్షించిన మహమ్మదీయ ఫకీర్లపై, శంకరులు మొదలైన వారి మీద భక్తి కలిగి అన్ని మతములు ఒకే పరమేశ్వరుని సాన్నిధ్యమునకు దారి చూపుచున్న వను భావము వర్ధిల్లినది.

భారతదేశ చరిత్రలో మొదటి నుండియు సంఘములో వ్యాపించిన దురాచారములను మార్చి సత్యమును స్థాపించుటకు ప్రయత్నించిన మతాచార్యులు, సంఘసంస్కర్తలు బయలుదేరిన ఉదాహరణలు చాలా కలవు. వీరిలో బుద్ధ భగవానుడు ప్రముఖుడు. శంకరాచార్యుల వారు కూడా ఇటువంటి వారే. ఆయన తరువాత రామానుజుల వారుద్భవించిరి. విభిన్నములైన మత సిద్ధాంతములను సమన్వయం చేసి భారతదేశంలోని జన సామాన్యమునకు ముక్తి మార్గంలో చూపిన మహానుభావులలో వీరు రాజకీయముగా దేశము అనేక రాజుల పరిపాలనములో నున్నప్పటికీని మత విషయమును మాత్రమే వివిధ రాజ్యములలోని ప్రజల మధ్య దాటశక్యము కాని అగడ్తలు లేకుండెను. దేశములో నేమూల నేమత సంస్కర్తలు బయలుదేరినప్పటికిని ఆయన బోధనములు దేశమంతా వ్యాపించుచుండెను. తీర్థయాత్ర వలన అసేతు హిమాచల పర్యంతము గల భారత భూమిలోని ప్రజలందరూ అతి తరచుగా కలిసిమెలసి జీవింపగలుగుచుండిరి. వివిధ ప్రాంతములలోని పుణ్యక్షేత్రములు అందరి దేవుళ్ళు, వివిధ ప్రాంతములలోని స్థల జల మహత్యములు దేశములో

నలుప్రక్కలనుగల విద్యాపీఠములు ఏ రాజకీయ ఉద్యమమును కలిగింపలేని జాతీయ భావమును భారతీయులలో కలిగించుచుండెను.

ఈ దేశములో నిస్లాము మతము స్థిరపడినది మొదలు హిందువుల్లోనూ మహమ్మదీయులలోనూ కూడా ఒక కొత్త విధమైన మతసంస్కర్తలు బయలుదేర సాగిరి. ఈ రెండు మతముల అసలు సిద్ధాంతములలోను కనపడు సాదృశ్యములను జూచి ఈ రెండు మతముల ఆచారవ్యవహారము వలన నిర్మింపబడిన గోడలను పడగొట్టి ఈ రెండు మతములను ఒకే పరమేశ్వరు నారాధించుటకు ఏర్పడినను సత్యమును గ్రహించి ఈ రెండు మతములును సమన్వయము చేయుటకు కొంత ప్రయత్నము జరిగెను. ఈ రెండు మతావ లంబకులలోను గల సనాతన ధర్మపరులు పూర్వాచార పారాయణులు, ఛాందసులు ఈ వేదాంతమునకు వ్యతిరేకులుగా నుండిరి. ఉభయ మతముల వారిలోనూ కొందరు అసహన పరులు, తీవ్రకారులు, ఆవేశపరులు ఉండిరి. వీరీ సమన్వయ ప్రయత్నముల కాటంకము కలిగించుచుండిరి. కానీ కాల ప్రభావము వలన క్రమ క్రమముగా నీసమభావము అభివృద్ధి చెంది తుదకు అక్బర్ చక్రవర్తి ఈ భావమున కొక నూతన స్వరూపమునిచ్చి నొక క్రొత్త మతమునే స్థాపింప బ్రయత్నించినాడు.

దక్షిణ హిందూదేశములో పదునాల్గవ శతాబ్దిలోనుండిన రామానందుడను వేదాంతి ఈ క్రొత్త వేదాంతమును బోధింప ప్రయత్నించిన వారిలో అగ్రగణ్యుడు. అతడు కులభేదములు నిరసించి అందరును సోదరులేయని బోధించినాడు. ఆయన శిష్యులలో ఒకడైన కబీర్ ఈ వేదాంతమును గూర్చిన హిందీ కీర్తనల ద్వారా సుప్రసిద్ధుడైనాడు. అతడు హిందూ మహమ్మదీయులకును కూడా గౌరవనీయుడైనాడు. కబీర్ తరువాత ఈ సంప్రదాయనుసారమైన ఒక కొత్త మతం స్థాపించిన మహానుభావుడు గురునానకు. అతడు సిక్కు మతమును స్థాపించినాడు. సిక్కుల మత గ్రంథమైన గ్రంథసాహేబులో రామానందు, కబీరుల వేదాంత బోధనలెన్నో సేకరింపబడి యున్నవి. రామ్ రహీముల యభేదత్వమును బోధించు "కబీర్ పంథా" అను వేదాంతము

సర్వజన సమ్మతముగా యుండెను. జలాలుద్దీన్ రూమీ, హాఫీజు మొదలైన పారశీక సూఫీ వేదాంతుల బోధనలకు చాలా సన్నిహితమై యుండెను.

భారత దేశ మత చరిత్రమున చైతన్య ప్రభువు చాలా ముఖ్యమైన పురుషుడు. ఆయన వంగదేశంలో నొక మహా విద్వాంసుడుగా నుండెను. ఈ పాండిత్యము వలన ముక్తి చేకూరదను సత్యమును గ్రహించి కేవల భక్తి మార్గము ద్వారానే మోక్ష సాధన చేయసాగినాడు. ఈ చైతన్య మతము అతి త్వరగా దేశంలో వ్యాపించినది. దీని ప్రభావమున వంగదేశమున అనేక మహమ్మదీయులు కూడా వైష్ణవులైనారు. మహమ్మదీయ వైష్ణవ కవులు, గాయకులు అనేకులు బయలుదేరిరి.

ఇట్లు మన దేశమున మత సంస్కరణోద్యమము బయలుదేరి విజృంభించుచుండగా సంగీత సాహిత్యములయందు శిల్పమునందు, వివిధ విద్యలయందు, భాషలయందు వికాసము కలిగెను. ఇది యంతయు మన నగరములందును పట్టణములందును మాత్రమే జరిగిందని జ్ఞాపకముంచు కోవలయును.

మహమ్మదీయ పరిపాలనలో పూర్వపు హిందూ రాజులు పరిపాలనమునందు వలె రాజులు ధర్మమునకు కట్టు బడి యుండక నిరంకుశులై ప్రవర్తింపసాగిరి. ఇస్లాము మత ధర్మమును బట్టి రాజును ఫకీరును సమానులేయను సిద్ధాంతం ఉన్నప్పటికీని ఒక బానిసవాడు బలవంతుడై సింహాసనము ఎక్కి సుల్తానగుటకు కూడా అవకాశం ఉన్నప్పటికీని ఆచరణమున రాజునకును ప్రజలకును (భేదము)అత్యధికముగానే యుండెను.

ఆ కాలములో మహమ్మదీయ సుల్తానులు తమ చుట్టును బానిసలను చేర్చి యుంచుకొనుచుండిరి. బానిసలే సుల్తానుల అంగరక్షకులై యుండిరి. కొందరు బానిసలు ప్రభువులై దేశ పరిపాలకులైరి. పూర్వము విజ్ఞాన కేంద్రములుగా యుండిన నలంద, తక్షశిల మొదలైన ప్రాచీన విద్యాపీఠము లంతరించినవి. కానీ దేశములోని ముఖ్య పట్టణములలో 'తలము' లను విద్యాపీఠములు వెలసినవి. అక్కడ సంస్కృత విద్య బోధింపబడుచుండెను. వారణాసి మాత్రమే సంస్కృత విద్యకు కేంద్రస్థానముగా నుండెను.

దేశములో సంస్కృతము కేవలము పండితుల భాషగానుండెను గాని అది జనులు వాడు భాషగా లేదు. వివిధ ప్రాకృత భాషలను జనులు మాట్లాడుచుంటిరి. పదునైదవ శతాబ్దము దేశభాషలలో కెల్ల హిందీ చాలా వ్యాప్తిలో నుండెను. అందువలననే కబీర్ హిందీలో చాలా కీర్తనలను చేసినాడు. అనేక ముసల్మాను కవులు హిందీలో గ్రంథములు రచించినారు. దీనితో పాటు వంగ దేశమునందు వంగ భాషయు ఇతర చోట్ల ఆయా ప్రాంతీయ భాషలును అభివృద్ధి చెందినవి. మన దేశమునేలిన మహమ్మదీయ ప్రభువులు కూడా ఈ దేశభాషలను అభిమానించిరి. వంగదేశమున జాన్ పూరును పరిపాలించిన ఒక తురక రాజు మహాభారతమును, భగవద్గీతను 15వ శతాబ్దములో బంగాలీ భాషలోని కనువదింప చేసినాడు.

బీజాపూరు నేలిన మహమ్మదీయ సుల్తానులు తమ లెక్కలను మహారాష్ట్ర భాషలోనే వ్రాయించేవారు. ఈ లాగున 15వ శతాబ్దినాటికి సంస్కృత భాషకు పుత్రికలైన భాషలు చాలా అభివృద్ధిలో ఉండెనని తెలియుచున్నది. దక్షిణ హిందూదేశములో తెలుగు అరవములు కూడా చాలా అభివృద్ధిలో నుండెను.

ముసల్మాను రాజుల ఆస్థానములలో పారశీ రాజభాషగా నుండెను. అందువలన దేశములోని హిందువులు చాలామంది పారశీ భాషను నేర్చుకొనుచుండిరి. క్రమ క్రమముగా ముసల్మానులు రాజులై సైనిక శిబిరములలోనూ గొప్ప పట్టణములలోని బజార్లలోను హిందీ,పారశీక భాషల మిశ్రమ భాష యైన ఉర్దూ భాష వ్యాప్తి చెందినది. ఈ హిందీ ఉర్దూ భాషను హిందుస్థానీ యని వ్యవహరించినారు. ఇది దేశములో కొలది తారతమ్యముతో ప్రజలు మాట్లాడు ప్రధాన భాష యైనది.

శిల్పమునందు క్రొత్త సంప్రదాయములు బయలుదేరి వివిధ రాజధానులలో నిర్మింపబడిన గొప్ప రాజనగరులలోస్థిర రూపము దాల్చినవి. గోలకొండలోను, అహమదాబాదులోను, జాన్ పూరులోను, బీజాపూర్ విజయనగరములలోను ఈ క్రొత్త శిల్ప నిర్మాణములనేకములు వెలసినవి.

— ✦ ❖ ✦ ——

రేషనలిస్టులు

("నా జ్ఞాపకాలు అభిప్రాయాలు" అను శీర్షికలోని ఒక వ్యాసము)

ఇటీవల మన దేశ విద్యావంతులలో కొంతమంది 'రేషనలిజం' అనే హేతువాదము పైన చాలా మక్కువ కలిగినందువల్ల మన నీతి మత ధర్మాలను, ఆచారాలను ఈ గీటురాతి మీద వన్నె చూసి దానికి సరిపోని వాటినన్నిటినీ మూఢ విశ్వాసాలని, అనాగరికాచారాలనీ విమర్శించడం పరిపాటియైనది.

మహామహులైన పాశ్చాత్య ప్రకృతి శాస్త్ర విజ్ఞానవేత్తలైన సైంటిస్టులు సంవత్సరాల వెంబడి పరిశోధనలు చేస్తూ కనిపెట్టిన ప్రకృతి శాస్త్ర సిద్ధాంతములు సృష్టి యొక్క పుట్టు పూర్వోత్తరాలు స్వరూప స్వభావాలు మొదలైన విషయాలు రేషనలిస్టు గీటురాతి మీద సరి చూడడానికి వీలు లేక పోతున్నదని ఒప్పుకుంటున్నారు. ప్రతి పరిశోధనలోనూ ఏదో ఒక స్థాయి చేరిన తరువాతగాని పైమెట్టు అగమ్య గోచరంగా ఉంటూవున్న సంగతిని చెప్పి మానవుని అశక్తతను అంగీకరిస్తున్నారు. అంతరిక్షాన్ని జయించామని ప్రగల్భాలు కొట్టే ఆధునిక రష్యా, అమెరికా దేశాల వారు తమ అంతరిక్ష యాత్ర వల్ల తెలియ వచ్చిన సంగతులు అనంతమైన అంతరిక్షంలో అత్యల్పాంశమేయని గ్రహించి గర్వభంగం చెందుతున్నారు

ఇలాగే ప్రపంచములోని వివిధ జాతుల నాగరికత, సంస్కృతి సంప్రదాయాలను గూర్చి ఆలోచించే వారిని ఊహింపలేని ప్రాచీన కాలము నుండి వివిధ కాలాలో కనబడిన మార్పులు వాని ఫలితాలుగా నేర్పడిన సంస్కృతీ సంప్రదాయాలు నీతి మత ధర్మాలు దిగ్భ్రమ కలిగిస్తాయి.

ఇటీవల పరిణతి చెందిన మార్క్సిస్టు సిద్ధాంతాలను రేషనలిస్టు భావాలను పురస్కరించుకొని ప్రాచీన చరిత్రలోని వివిధాంశాలకు విలువ కట్టు పద్ధతిన ప్రయత్నించడం చాలా పొరపాటు పద్ధతి అని కొందరు అంగీకరిస్తున్నారు. పూర్వ నాగరికతను గూర్చి చర్చించేటప్పుడు నేడు కనబడుతున్న ఆదిమజాతుల జీవిత విధానాలు వారి ఆచారాలను ఆధార పరుచుకుని ఊహలు చేయడం నేల విడచి సాము చేయడం వంటిదే. అందువల్ల వేలకొలది సంవత్సరాల కాలం నుండి పరిణతి చెందిన

భారత సంస్కృతి సంప్రదాయాల్లో నీతిమత ధర్మాలలోనూ ఆయా కాలాల నాటి పరిస్థితులు తెలుసుకోకుండా అవి మూఢ విశ్వాసాలని, ఫ్యూడల్ వ్యవస్థకు చెందినవని సిద్ధాంతీకరించడం అవివేకమైన కార్యము.

మానవుడు సంఘమునకు కట్టుబడి వుంటాడు. అందువల్ల ఒక్కొక కాలంనాటి సంఘంలోని నీతిమత ధర్మములు సంస్కృత సంప్రదాయములు శిరసావహించి జీవించవలసి యుండును. దానిని తృణీకరించడానికి వీలు లేదు. తృణీకరిస్తే సంఘ బహిష్కారానికి గురి అవుతాడు. అందువల్ల మన వేదశాస్త్రాలలో ధర్మశాస్త్రాలు ప్రస్తుత కాలంనాటి నీతిమత ధర్మాలు సంస్కృతీసంప్రదాయలు రేషనలిస్టులు గీటురాయితో గాని మార్క్సిస్టు గీటురాయితో గాని కొలిచి అంచనాలు కట్టడం పొరపాటు

ఇంకొక సంగతి; మన వేద శాస్త్రాలు, పురాణేతిహాసాలలో చెప్పబడిన నీతిమత ధర్మాలు ఈనాటి జాతీయ ఆర్థిక సాంఘిక పరిస్థితులకు సరిపడలేని మాట నిజమే. ఈనాటి వివిధ మతాలవారు, కులాల వారు పూర్వకాలం నాటి కట్టుబాటుల ప్రకారము జీవించడం లేదను మాట కూడా నిజమే.

నేటి మహా నగరాలలో పట్టణాలలో సంకుచితమైన ఇండ్లలో చిన్న చిన్న గదులలో జీవించే కుటుంబాల వారు కొన్ని వేళలలో ఉద్యోగ వృత్తి వ్యాపారాలు చేయవలసి యుండి కార్యాలయాలలో కర్మాగారంలో పనిచేస్తూ ఉన్నవారు పూర్వకాలం గ్రామంలో ఉన్నట్లుగా తమ కులాచారాలను ఆచరింపలేకున్నారు. అయినప్పటికీ వారు తమ కులాచారాలను పూర్తిగా విడనాడలేదు. కక్కుర్తిగా జరుపుకుంటున్నారు యధాశక్తిగా నాచరిస్తున్నామని సరిపెట్టుకుంటున్నారు. కులపెద్దలు, పురోహితులు చూసీ చూడ నట్లు ఊరకుంటున్నారేగాని కుల బహిష్కారాలు చేయడం లేదు.

అందువల్ల సంఘంలోని వివిధ కులాల వారి స్వరూపాలు పేరుకు మాత్రం నిలిచియున్నవే గాని .... లేవు. ఈ తరంలోని వారందరూ ధర్మశాస్త్ర శాసన విధుల నుల్లంఘించి పై స్థాయి నుండి క్రిందిస్థాయికి దిగిన వ్రాత్యా[29] మతాల వారిగానే యున్నారు.

---

[29] వ్రాత్యులు=భ్రష్టులు, ఆచారాలు పాటించనివారు.

ఈ కులాచారాలలోని మార్పులు మళ్లీ వెనక్కి వెళ్లడానికి గానీ సంస్కరించడం గాని అవకాశాలు లేవు. మన రాజ్యాంగమును బట్టి బ్రిటిష్ వారి కాలం నుండి నేటి వరకు చేయబడిన వివిధ శాసనములను బట్టి అనేక హిందూ మతాచారాలు మార్పు చెంది న్యాయశాఖ సమ్మతమ్ములైనవి. అస్పృశ్యతను పాటించడానికి వీలు లేదు. అందువల్ల రైళ్లు, హొటళ్ళు, పాఠశాలలు, కార్యాలయాలలోని వివిధ కులాల వారు మాల మాదిగలు కలిసి పనిచేయవలసి రావడం, భోజనాలు చేయవలసి రావడం జరుగుతూవుంది. బ్రాహ్మణుల మడి, మైల స్నాన, సంధ్యానుష్ఠానము, శుభాశుభాలలోని కర్మ కాండలు, కార్యక్రమము యధా క్రమంగా జరిగించే అవకాశమేలేదు. ప్రస్తుతం బ్రాహ్మణులు జరిగించే కార్యకలాపాలు కేవలము విధినిషేధాలకు వ్యతిరేకంగా జరిపే కక్కుర్తి వే. వారు పాటించే ఆచారాలు శూద్రాచారాలే. శూద్రులు కన్నా అధికులమని విర్రవీగుట వెర్రితనము.

మన పురాణాలన్నిటిలో కలియుగంలో 5000 సంవత్సరం జరుగగానే వర్ణ సంక్రమము కలుగుతుందని చెప్పబడియున్నది. వాటిని మనం నమ్మలేదు. కానీ ఇప్పుడు అందరికీ ప్రత్యక్షానుభవంలో నున్నది. ఈ పరిస్థితిలోనే మన ధర్మశాస్త్రముల లోని ఆచార కాండలు, ప్రాయశ్చిత్త కాండలు, స్మార్త చంద్రికలలోని కార్యకలాపాలు జరిగే అవకాశమేలేదు. ఇటువంటి పరిస్థితులలో సనాతన ధర్మము ఎలా కొనసాగుతుంది? దీనిని గూర్చి ఆలోచించేవారు లేరు. అందరూ కళ్ళు మూసుకునే జీవిస్తున్నారు ఎన్ని కబుర్లు చెప్పినా వివిధ కులాల వారు వారి కులాలవారితోనే సంబంధాలు చేస్తున్నారు. కులాలు పోవాలనటం తెలివి తక్కువ.

— ✦ ❖ ✦ ——

గాంధీమహాత్ముడు ప్రయోగించిన సత్యాగ్రహము

గాంధీ మహాత్ముడు ప్రయోగించిన సత్యాగ్రహం యొక్క స్వరూప స్వభావములను గ్రహించినవారు బహు కొద్దిమంది బుద్ధిమంతులే.

సత్యాగ్రహము రాజకీయ విధానమా, ఆర్థిక విధానమా మత ధర్మమా అన్యమా అని ఆలోచించిన వారు లేరు. నిజానికి ఇది ప్రజాసార్థ సాధనము వంటిదే.

భారతదేశ పారతంత్ర విమోచనము కోసం మహాత్ముడు ప్రయోగించిన ఒక మహాస్త్రమేకాక ఒక యోగ సాధనము

సత్యాగ్రహము నాచరించ వలెనన్నచో బాహ్యాభ్యాంతర శుచి అవసరము. జన సామాన్యము సత్యాగ్రహమును అనుసరించాలన్నచో దానికి వారిని తయారు చేయవలెను. ముందుగా అనేక శతాబ్దాల నుండి ప్రజల నావరించియున్న పౌరతంత్ర్య బానిస బుద్ధిని, పిరికితనమును పోగొట్టాలి. వారిలో ఆత్మవిశ్వాసము కలిగించాలి. ధైర్యసాహసాలు కలిగించాలి. స్వయంసహాయక శక్తి, కార్య దక్షత కలిగించాలి. ఇంగ్లీషువారి నాగరకతా వ్యామోహంనుండి వారిని విముక్తులను చేయాలి. బ్రిటిష్ వారి రాజ్యతంత్రపు వలనుండి ప్రజలను తప్పించాలి. ఇంగ్లీషునాగరికత [తో ప్రవర్తించు వారిని పరివర్తింప] చేసి వారిని పరిశుద్ధులను చేయాలి. వారిలో ఆత్మ గౌరవం, సత్యాహింసల పట్ల ఏకాగ్రత, త్యాగ నిరతి కలిగించాలి. ప్రభుత్వమువారు చూపు ఎరలకు లోబడకుండా వుండేట్లునూ, వారలను వారు పెట్టే బాధలను భరించేటట్లు చేయాలి. ఇట్టి సత్య వ్రతానుష్ఠానమును ప్రబోధించటానికే గాంధీ మహాత్ముడు దేశమంతటా పర్యటించి ఉపన్యాసాలిచ్చి తన పత్రికయైన యంగ్ ఇండియాలో అనేక వ్యాసాలు వ్రాశాడు. మన ప్రజలు అవినీతి కరమైన ఇంగ్లీషు ప్రభుత్వపు భల్లూకపు పట్టునుండి తప్పించుకుని బయట పడడానికి మార్గమొక్కటే. అది ప్రభుత్వము చేసే దుర్మార్గమునందు ప్రత్యక్షముగా గానీ, పరోక్షముగా గానీ పాల్గొనక సహాయక నిరాకరణము చేయుటే అని మహాత్ముడన్నాడు.

సహాయక నిరాకరణోద్య ప్రణాళికలో

(1) ఆ ప్రభుత్వాలు స్థాపించిన కోర్టులలో న్యాయవాదులు పనిచేయుట మాని వ్యవహారములు మధ్యవర్తులద్వారా పరిష్కారం చేయించుకొనవలెను.

(2) కలుషితమైన ప్రభుత్వ హస్తాలనుండి బిరుదులు, గౌరవోద్యోగములు మరెట్టి లాభాలను పొందకూడదు

(3) ప్రభుత్వ పాఠశాలలో చదువు పిల్లలు వైజ్ఞానికముగా ఉక్కిరిబిక్కిరవుతున్నారు కనుక వారికి వెంటనే జాతీయ మత ధర్మములు, ఆత్మ గౌరవము, అంతరాత్మ అనుసరించి చరించు స్వేచ్ఛను అలవరచు జాతీయ ఐక్యత నేర్పాలి.

(4) సైనిక ... (?)[30] అహింస నవలంబించినచో సైనిక నియామక వ్యవస్థ అవసరములేదు.

గాంధీ మహాత్ముడు నిర్మాణ కార్యక్రమమును కూడా ప్రజలను సత్యాగ్రహములకు సిద్ధపరచుటకే నిర్ణయించాడు. అస్పృశ్యతా నివారణము, మద్య పాన నిషేధము హిందూ మహమదీయ సఖ్యత, రాట్నము మొదలైన సాధనముల నిందుకే నిర్ణయించాడు. జాతీయోద్యమ చరిత్రను రచించే వారీ విషయాలను చక్కగా గమనించాలి.

— ✦ ❖ ✦ ——

[30] సైనిక నియామకం ఆపు చేయాలి.

ఆంగ్లేయుల రాజ్య సంపాదన

ఇంగ్లీషు కంపినీ వారు పొందిన పట్టా లేక చేసికొనిన సంధి తేది	సంపాదించిన జిల్లా లేక పరగణా	ఎవరివలన స్వాధీనము పొందినది
------------	--------	-----------------
1757 డిసెంబరు 20	వంగ రాష్ట్రమున 24 పరగణాలు	నవాబు మీర్జఫర్
1759 మే 14	మచిలీపట్నం వగైరా	హైదరాబాద్ నిజాం
1760 సెప్టెంబర్ 27	బర్ద్వాన్ విజ్ఞాపూర్ చిటకాంగ్	వంగరాష్ట్ర నవాబు, మీర్జఫర్
1765 ఆగస్టు 2	అలహాబాద్ జిల్లాలు	అయోధ్య నవాబు, మజీద్
1765 ఆగస్టు 12	వంగ రాష్ట్రము, బీహార్, ఒరిస్సాకు దివాన్గిరి	మొగలాయి చక్రవర్తి 2వ షా ఆలం
1765 ఆగస్టు 15	చెన్నపట్నం దగ్గర కంపెనీ జాగీర్, చంగల్పట్టు జిల్లా వగైరా	ఆర్కాట్ నవాబు (కర్ణాటక నవాబు)
1766 నవంబర్ 12	ఉత్తర సర్కారు జిల్లాలు	హైదరాబాద్ నిజాం
1768	గుంటూరు సర్కారు	హైదరాబాద్ నిజాం
1775 మే 21	బనారస్ కాశి జమీందారి	అయోధ్య నామ భవజీరు
1775 మార్చి 6	సాలశెట్టి లంక, బెసీను	మహారాష్ట్ర పేషవా
1778 జూన్ 17	నాగూర్	తంజావూర్ రాజు
1792 మార్చి 17	మలబారు, దిండిగల్లు సేలం,	

	బారామహల్ జిల్లాలు	సుల్తాన్
1799 జూలై31	కర్నాటకము	కర్నాటక నవాబు
1799 అక్టోబర్ 25	తంజావూరు	తంజావూరు రాజు
1800 అక్టోబర్ 12	1792 179 సంవత్సరములలో	
	టిప్పు సుల్తాన్ వలన నిజాము వాటాకు	
	రాబడిన రాయలసీమ	
	ఉత్తర దత్త మండలంలో	నిజాము
1801 జులై 31	కర్ణాటకము	కర్నాటక నవాబు
1801 నవంబరు 10	గోరఖ్పూర్ గంగ యమ నా నదుల	
	మధ్య దిగువ భాగము (Lower Doale)	
	చెరిల్లీ వగైరా	అయోధ్య నవాబు
1802 డిసెంబర్ 31	బుందేల్ ఖండములోని	
	జిల్లాలు, గుజరాత్	బీరారు రాజు
1803 డిసెంబర్ 30	గంగా యమునాల మధ్య దిగోభా దిగువ	
	భాగము బరెల్లి వగైరా	అయోధ్య నవాబు
1805 ఏప్రిల్ 21	గుజరాత్ జిల్లాలు	గైక్వాడ్
1815 డిసెంబర్ 2	కుమాను ఔరాయిలో	
	కొంత భాగము	నేపాల రాజు
1817 జూన్ 13	సాగరు, హట్టా, ధార్వాడు	పేష్వా
18 17 నవంబర్ 6	అహమదాబాద్ ఫారం (Farim)	గైక్వాడ్

1818 జనవరి 16	ఖాండేషు వగైరా	హెూల్కారు
1818	అజ్మీర్	దౌలత్ రావు సింధ్యా
1818	పూనహ్, కంకణము,	
	దక్షిణ మహారాష్ట్ర దేశం	పేష్వా
1818	నర్మదానది ప్రక్క జిల్లాలు,	
	సంబల పూరు, పాట్నా వగైరా	బీరారు రాజు
1820 డిసెంబరు 17	దక్షిణ కొంకణ జిల్లాలు	సావంత్వాడి
182 డిసెంబర్ 12	బీజాపూర్ లోని జిల్లాలో	
	అహ్మద్ నగరము	నిజాం
18 26 ఫిబ్రవరి 26	అస్సాము	బర్మా రాజు
1834	కూర్గ్	కూర్గు రాజు
1835	జయంతియా	జయంతియా రాజు
1836	లూధియానా	రాజుకి ఔరసులు లేదని
ఆక్రమణ		
1838	సిక్కు సంరక్షిత	రాజుకి ఔరసులు లేదని
	రాజ్య భాగములు	ఆక్రమణ
1840	జాల్నా (Jaloun)	రాజుకి ఔరసులు ఆక్రమణ
1840	కర్నూలు	కర్నూలు నవాబు
1840	ఖైతాల్ (Khytal)	రాజుకి ఔరసులు లేదని
		ఆక్రమణ
1843	కొలాబా	రాజుకి ఔరసులు లేదని

		ఆక్రమణ
1843 జూన్	సింధు రాజ్యం	సింధు అమీరులు
1845	సీరంపూర్, ట్రాంక్విబార్	డేనులు
1946 మార్చి 9	జలంధర్ పంజాబులో	ధులీప్ సింగ్
	నినీదుల మధ్యభాగం(డోలె)	
1847	సిక్కు సంరక్షణ రాజ్య భాగం	ఆక్రమణము
1848	సతారా	రాజుకి ఔరసులు లేదని
		ఆక్రమణ
1849	పంజాబు	ఆక్రమణము
1850	సంబల్పూర్	ఆక్రమణము
1853	ఉదయపురం	రాజ్యాక్రమణము
1854	నాగపూర్	రాజ్యాక్రమణము
1856	అయోధ్య	రాజ్యాక్రమణము

— ✦ ❖ ✦ ——

దక్షిణదేశ కుడిఎడమల కుల వర్గాలు

దక్షిణ భారతదేశంలో కావేరీ నదీ తీరాల ప్రక్కనున్న భూములు చాలా సారవంతమైనవి. పాండ్య దేశము నేలు రాజులు తొండ మండలములలో నున్న వ్యవసాయకులైన వెళ్లాల వారి నాహ్వానించి వారు తప్ప నితరు లెవ్వరునూ వ్యవసాయకులుగా నుండరాదని శాసించగా వెళ్లాల వారు కావేరీ తీరాన సుక్షేత్రాలను నెలకొల్పి దేశము పాడిపంటలతో తులతూగుటట్లు చేశారని తమిళ దేశంలో చిరకాలము నుండి వాడుకలో ఉన్న ఐతిహాసం.

వెళ్ళాల వారు శుచి శుభ్రతలు కలిగి బ్రాహ్మణాచారాలను అనుసరించే సచ్ఛూద్రులు. వీరు శైవులు. వీరు కావేరి నది తీరాలలో అనేక గ్రామ సముదాయాలను నిర్మించుకొని నాడులనే సీమలలోని వ్యవహారాలన్నీ తామే నిర్వహించుకుంటూ సుఖ జీవనం చేస్తూ ఉండేవారు. సింహళ దేశమందలి ప్రాచీన బౌద్ధ మత గ్రంథమైన మహావంశములో వెళ్ళాల వారు కృషి బ్రాహ్మలని వర్ణించబడి యున్నారు.

వెళ్లాల వారితో పాటు వారి వాడలలో కవలెయ్ లనే బలిజలు కూడా కాపురముండి పాడి పంటల నభివృద్ధి చేస్తూ తామనుభవించగా మిగిలిన వాటిని తీరప్రాంతాలకు తీసుకువెళ్లి విక్రయ వ్యాపారం కూడా చేసేవారు. ఈ వెళ్లాల కలెవయ్ ప్రముఖులను నాట్టరు లనేవారు. దక్షిణదేశములో పల్లవ రాజుల కాలములోనూ, చోళరాజుల కాలములోని వివిధ నాడులలోని నాట్టరుల చాల బలవంతులు గా నుండి రాజాధి రాజుల మన్ననలనందుకునేవారు. వారికి రాజభాగములనిచ్చి స్వతంత్రముగా తమ వ్యవహారాలను నిర్వహించుకుననిచ్చేవారు.

ఈ నాట్టరులు దేవ బ్రాహ్మణ భక్తి కలిగి దేవాలయములు నిర్మించి ఉత్సవాలు, ఆరాధనలు చేయిస్తూ దేవాలయములకు దేవాదాయాలనే స్థిరాస్తిని కేటాయించేవారు. భూములునుండి ఆదాయాన్ని కొంత దేవాలయాల కిచ్చేవారు. బ్రాహ్మణులకు బ్రహ్మ దేయాలనే అగ్రహారాలు ఇచ్చి వారి భూములను తామే సాగు చేసి వారి వల్ల తమ కులాచార ప్రకారము చేయవలెసిన శుభాశుభ కర్మలు కార్యకలాపాలు జరిపించు కునేవారు. బ్రాహ్మణ అగ్రహారాల నిర్వాహణమును బ్రాహ్మణ సభలకే వదలి తాము జోక్యము చేసుకునేవారు కాదు. బ్రాహ్మణ అగ్రహారాల పాఠశాలలలో వేద విద్యలే గాక లౌకిక విద్యలు, తమిళము, సంస్కృత భాషా సాహిత్యాలను తాముకూడా అభ్యసించే వారు.

దక్షిణ దేశంలో అడవులలోనూ కొండలపైన జీవిస్తూ గొర్రెలు, మేకలు, పశువులను మేపుకుంటూ పోడు వ్యవసాయం చేసే అనాగరిక ఆటవిక కొండ జాతులవారు కావేరీనదీ గర్భ పరిసరాలలో వెళ్లాల, కవెలయ్ కులాలవారు స్థాపించిన వ్యవసాయ క్షేత్రాలను చూసి తాము కూడా వారివలె ఆ చుట్టుపట్ల గల సారవంతమైన భూముల నాక్రమించి వ్యవసాయ క్షేత్రాలను స్థాపించాలనే కోరికతో దండయాత్రలు చేస్తూ గోలంభవాడి మొదలైన వాడలను స్థాపించి నారని, ఆ విధంగా దక్షిణ దేశములో కృషి, పశుపాలన వ్యవసాయ నలుమూలలా వ్యాపించి అభివృద్ధి చెందెనని స్టీన్[31] గారు వ్రాశారు. క్రీస్తు శకారంభమునుండి కొన్ని శతాబ్దాల పాటు దక్షిణ దేశంలో వివిధ వృత్తి వ్యాపారాలు అభివృద్ధి చెందడం, దాని ద్వారా పంట దినుసులతో వ్యాపారాలు, బట్టల నేత, నాగరకత జీవితానికి అవసరమైన వివిధ వస్తువులను తయారు చేయు కుల వృత్తుల వారు పెద్ద గ్రామాలు చేరుట వల్ల అవి పట్టణముగా మారిపోయినవని అక్కడనుండి దేశాంతరం కూడా ఎగుమతి దిగుమతి వ్యాపారాలు జరిగేవని ప్రాచీన తమిళ గ్రంథాల యాలైన జైన బౌద్ధ కథలలో వర్ణించబడియున్నది.

ఈ తొలికారు దశలో బౌద్ధులు జైనులు తమ మతాల ననేక పట్టణాల్లో స్థాపించి మత ప్రచారము చేశారు. జైన వసతులలో బౌద్ధ మఠాలలో ఆ మత ధర్మాలను అధ్యయనం చేసిన పండితులు వేద శాస్త్రములను కూడా అధ్యయనం చేసి వైదిక విద్వాంసులతో వాగ్వాదాలు చేస్తూ వారినోడించి రాజ స్థానములలో పలుకుబడి సంపాదించారని తెలుస్తున్నది. ఆ వింధంగా కొందరు రాజులు జైనమతా వలంబు లైనారు. క్రీస్తు శకం 600-630 మధ్య పాలించిన మహా ప్రతిభాశాలియైన మహేంద్ర విక్రమ వర్మ జైన మతావలంబియై ఆనాటి మతస్థులను వర్ణిస్తూ మత్తవిలాస ప్రహసన మనే గ్రంథాన్ని రచించాడు. ఆయన మొదట జైనుడిగా నుండిననూ తరువాత శైవనాయ నారులలో

---

31 అమెరికా దేశపు హవాయి విశ్వవిద్యాలయం ఆచార్యులైన ప్రొఫెసర్ బర్టన్ స్టీన్ (Burton Stein,1926–1996) గారు మన మత ధర్మాలను గూర్చి దక్షిణ దేశచరిత్రను గూర్చి 20 సం॥రాల కాలం పాటు నిశ్చితంగా పరిశోధనలు చేసి 1980సం॥లో Peasant State and Society in Medieval South India అనే ఉద్గ్రంథమును ప్రకటించారు. అందులో 30–40 సం॥నుండీ మన చరిత్రకారులు రచించిన గ్రంథాలలోని పొరబాటులను, సిద్ధాంతాలను ఖండించారు .... రచయిత వివరణ.

ప్రసిద్ధుడైన అప్పర్[32] అనే మహా విద్వాంసుడీ మహేంద్ర విక్రమ వర్మను శైవ మత ప్రవిష్ఠునిగా చేసిన తరువాత ఈయన జైన మతాన్ని అణగత్రొక్కడం ప్రారం భించినాడు

ఈ విధముగా క్రీస్తు శకారంభము నుండి కొన్ని శతాబ్దాల పాటు దక్షిణ దేశములో జైన మతము వ్యాపించియుండినది. ఈ జైనులు నాస్తికులని, వీరు అపవిత్రులని, వీరి సంపర్కం దోషభూయిష్ఠమని సనాతన ధర్మ పరులైన వైదిక బ్రాహ్మణులు బోధిస్తూ వుండటంవల్ల హిందూ మతాభిమానులైన తమిళ దేశపు వెల్లాల, కవెలయ్ మొదలైన వ్యవసాయ కులాలు వారైన సచ్ఛుద్రులు జైనులను అసహ్యించుకోవడం ప్రారంభించి నారు. వారి నాయకులను అసహ్యముతోనేగాదు దానికి తోడు తమతో పోటీ చేస్తు తమ పరిసర ప్రదేశాలాక్రమించిన అనాగరిక పాటక జన సంఘము వారు జైన మతావలంబులు అయినందువల్ల ఈ వ్యవసాయ సచ్ఛూద్ర కులాల వారకి చిల్లర వృత్తులు, పశుపాలనము చేసుకుని బ్రతికే పాటక జనములోని వివిధ కులాల వారికి రాజకీయ, ఆర్థిక, సాంఘిక వ్యవహారాలలో స్పర్థ, సంఘర్షణము ప్రారంభమై దక్షిణదేశ కుల సంఘములు కుడి కులాల వారనీ, ఎడమ కులాల వారనీ రెండు వర్గాలుగా చీలినది. కుడికులాల వారికి బలిజలు నాయకులుకాగా ఎడమకులాల వారికి విశ్వ బ్రాహ్మణులు నాయకులైనారు.

పల్లవ, చోళ రాజుల కాలంలో వెళ్లాల, కవెలయ్ వారు నాయకులుగా నున్న కుడి కులాలు ధనవంతులు బలవంతులుగా నుండి రాజులకు అవసరమైనప్పుడు పెట్టుబడులు కూడా పెడుతూ దానివల్ల అనేక సౌకర్యాలు అధికారాలు పొందసాగినారు. కుడి కులవర్గము వారి ఆర్థిక, సాంఘిక సంఘములైన అయ్యారళీ సంఘాలును, అటు తరువాత దేశంలో చాలా పలుకుబడి గల చిద్రనేళి పెరియవాడ సంఘమును దక్షిణ దేశ రాజకీయ ఆర్థిక సాంఘిక చరిత్రలో ప్రాముఖ్యత వహించినవి. ఈ చిద్రనేళి పెరియవాడనే తెలుగు ప్రాంతాల్లో మహానాటివారని వ్యవహరించేవారు. మహానాటి వారి కట్టు బాటులు చాలా కాలముదేశములో చెల్లుబడి యగుచుండినది. తమ ఆర్థిక, సాంఘిక వ్యవహారాలలో వచ్చే తగాదాలన్నిటిని పంచాయితీల ద్వారా పరిష్కరించు కునే న్యాయ పరిపాలనాధికారము కూడా ప్రభువుల వల్ల సంపాదించి దానిని అమలు పరుచుటకై దేశాయిసెట్టి, వృద్ధినీనాడు, పృథివీసెట్టి మొదలైన ఉద్యోగులను నియమించి చరిత్ర ప్రసిద్ధులైనారు.

---

32 *ఈ అప్పర్ అనే విద్వాంసుడు గారి పేరు మరుల్ నీక్కియార్ అనీ, వారు కూడా మొదట జైనమతమునే అవలంబించి తదుపరిగ శైవమతస్థుడైనారని తెలియు చున్నది*

జైన మతము దాని ప్రభావ

క్రీస్తు శకారంభమునాటికే బౌద్ధులు, జైనులు దక్షిణదేశములో తమ మత ధర్మాలను ప్రచారం చేశారు. ఈ రెండు మతాల వారు వేదముల ప్రామాణ్యము నంగీకరింపలేదు. అందువల్ల వీరిని మన హిందూ సనాతన ధర్మ పరులు నాస్తిక మతాలంవారు ఈ నాస్తికులు పాపిష్ఠులని వారితోడి సంపర్కము పాపమని బ్రాహ్మణుల దృఢనమ్మకము.

బౌద్ధ జైన మత ధర్మాలను ప్రచారం చేసే పండితులు మొదట పాలీ, అర్థమాగాధి భాషలో నే ప్రచారం చేసేవారు. గాని సంస్కృత పండితులను వాగ్వాదాలను జయించి రాజు సన్మానాలు పొందాలంటే సంస్కృత భాషను, వేదశాస్త్రాలను అభ్యసించి వారితో వాగ్వాదాలు చేయాలి గనుక ఆ పండితులు చాలా గట్టి కృషి చేసి వాదించేవారు. వాగ్వాదాలలో ఓడిన విద్వాంసులు జైనమాతాన్ని స్వీకరించవలసి ఉండేది. ఆ ప్రకారం జైనులైన హిందూ విద్వాంసులలో గొప్పవారు చాలామంది ఉండేవారు. ఆళ్వారులనే వైష్ణవ భక్తులలో నాయనారులనే శైవ భక్తులు కూడా కొందరు మొదట జైనులుగానుడిన వారున్నారు. ఈ వాగ్వాదాలలో పాల్గొన్న వారిలో బ్రాహ్మణేతరులైన వెళ్ళాళ పండితులుకూడా ఉండేవారు. వారికి బ్రాహ్మణులు శిష్యులుగానుండేవారు. తమిళ శైవ సంప్రదాయములోని అనేక గ్రంథాల... బ్రాహ్మణ వెళ్ళాళ విధ్వాంసులు సంతరించినవే.

జైన మతము పాపిష్ఠి మతముగాను, జైనులు అపవిత్రులుగా నెంచిన బ్రాహ్మణు లేగాక వారి ననుసరించిన సఛ్ఛూద్ర కులములు వారైన వెళ్లాలులు, కవెలెయ్ కులాల వారు కూడా ఈ విషయంలో చాలా పట్టుదల కలిగి ఉండేవారు.

పైన చెప్పిన విధముగా అడవులు, కొండలలో నుండి వచ్చిన అనాగరిక పాటకపు జనంవారికి జైనులు తమ మతమును బోధించి వారిని జైనులుగా చేశారు. దాని ఫలితముగా ఆర్థికముగానే కాక సాంఘికముగాను గల తారమ్యాలు మత ధర్మాలలో కూడా ప్రవేశించి తీవ్రమైన స్పర్థలు కలిగి దక్షిణ దేశ జన సంఘములు వ్యవసాయ సంబంధము గల కులాల వర్గం వారు కుడి కులములుగాను వివిధ వృత్తులు చేతి పనులు చేసుకుని వారు ఎడమ కులాలు గాను రెండు వర్గాలుగా చీలినది.

వెళ్లాల, కవెలెయ్ అనే బలిజలు కుడి కులాలకు నాయకులు. ఎడమ కులాలకు పంచాణము వారు లేక పంచ బత్తులు అనే ఐదు వృత్తులు చేసుకునే కంసాలి, కంచెరి, కమ్మరి, వడ్లాబత్తులనే వారు నాయకులైనారు. ఈ పంచాణమువారే తరువాత విశ్వకర్మ సంతతి వారమని వైదిక బ్రాహ్మణుల కన్నా శ్రేష్ఠులమని ప్రచారం చేస్తూ దక్షిణ దేశ రాజకీయార్థిక, సాంఘిక వ్యవహారములలో తక్కిన పాటక జనానికి నాయకులైనారు. వైదిక బ్రాహ్మణులీ కుడి ఎడమ కులవర్గతి వాదములలో చేరకపోయినా వారి సానుభూతి కుడి కులాల వారి పట్లనే యుండినది.

వెళ్లాలా కవెలెయ్ నాయకత్వము వహించిన కుడి కులాల వారు బలవంతులుగా నుండి పల్లవ, చోళ రాజులు వల్ల అనేక సౌకర్యములు సంపాదించారు దేశంలోని వ్యవసాయోత్పత్తుల రవాణా వ్యాపారములోను పట్టణాలలోని వర్తక కేంద్రాలలోనూ వారి సంఘానికి పలుకుబడి యుండేది. చోళరాజుల కాలములో కూడి ఎడమ కుల వర్గ తగాదాలను పదవ శతాబ్దంలో పరిష్కరించినట్లొక శాసనము ఉన్నది.

ఈ కుడి ఎడమ కులవర్గ తగాదాలకు కేంద్రస్థానం కాంచీపురం. కాంచీపురంలో కుడి కులాలకు, ఎడమ కులాలు వేరు వేరు మందిరాలు నిర్మించుకున్నారు. ఈ కుడి ఎడమ తగాదాలు ఉత్తరార్కాటు జిల్లాలోను, చెంగల్పట్టు జిల్లాలలోనే కాక వాటి ఇరుప్రక్కల గల ఇతర జిల్లాలలో కూడా వ్యాపించి ఉత్తరార్కాటు చెంగల్పట్టు జిల్లా జనాభాలో అరవ, తెలుగు భాషలు మాట్లాడేవారు సమాన సంఖ్యలో నుండేవారు. ఇంగ్లీషు వర్తక కంపెనీ రాజ్యకాలంలో చెన్నపట్టణంలో కూడా కుడి ఎడమలు కుల తగాదాలు వచ్చినవి. అప్పుడు వారి వీధులను వేరు పరచి రాళ్లుపాతించి వారి వారి దేవతల ఉత్సవాలు, వివాహాలలో ఊరేగింపులు వేరు వేరుగా జరిపించుకునే ఏర్పాటు చేశారు. కంపెనీ న్యాయస్థానాల్లో ఈ తగాదాల రికార్డులున్నవి.

వీటిని గూర్చి నేను నా కథలు గాథలనే వ్యాసాలలో ఆంధ్ర పత్రికలో వ్రాశాను. 1975 సంవత్సరంలో ప్రకటించిన విశాలంధ్రము-విస్మృతాంధ్రములో విపులముగా వివరించాను.

— ✦ ❖ ✦ ——

దాక్షిణాత్యాంధ్రుల దుర్గతి

పల్లవుల కాలంలో, కులోత్తుంగుని కాలంలో, విజయనగర సామ్రాజ్య కాలంలో తెలుగువారు దక్షిణ దేశంలో కన్యాకుమారి వరకు గల వివిధ జిల్లాలకు కూడా వెళ్లి స్థిరపడ్డారు. తంజావూరు, మధుర నేలిన తెలుగు నాయకుల కాలంలో అరవ మండలంలో కూడా తెలుగే రాజభాషగా ఉండేది. దక్షిణాంధ్ర సాహిత్య చరిత్రకు సరస్వతీమహలు గ్రంథాలయమే సాక్షి.

అరవ దేశంలో ఇప్పటికీ లక్షలాది తెలుగు వారు ఉన్నారు. అయితే వారికి అక్కడి ప్రభుత్వంలో పలుకుబడే లేనందువల్ల అనేక విధములుగా కష్టపడుతున్నారు. అన్నిటికన్నా ముఖ్యంగా అక్కడి పాఠశాలలో తెలుగు బోధించనందువల్ల అక్షరాభ్యాసం కూడా అరవంలోనే జరగవలసి వస్తున్నది. తెలుగు భాష ఇళ్ళల్లో మాట్లాడవలసిన దే గాని వీధిలో మాట్లాడే అవకాశం లేదు. అందువల్ల క్రమ క్రమంగా తెలుగు భాష అపభ్రంశమై అరవ యాసతో మాట్లాడడమే గాక తెలుగు ఉత్తరాలు అరవలిపితో వ్రాసుకోవాల్సిన దుస్థితి పట్టినది. తంజావూరు, మధుర నేలిన తెలుగు నాయకుల కాలంలో రాజ దర్బారులో తెలుగులో వ్యవహరిస్తూ, అరవ వారు కూడా తెలుగు నేర్చుకునేటట్లు అధికారాలు చెలాయించిన తెలుగువారి సంతతి వారి కెంత దుర్గతి పట్టినది!

బ్రిటిష్ పరిపాలనలో తెలుగువారు, ఆరవ, కన్నడ, మలయాళ భాషల వారితో మద్రాస్ రాజధానిలో కాలక్షేపము చేయుచుండేవారు. రాజధాని నగరమైన చెన్నపట్నం స్థాపనలోనూ, అభివృద్ధి లోను తెలుగువారే ప్రాధాన్యం వహించి చాలా కాలం వరకు ఆ పట్టణంలో ప్రభువులులై యున్నారు. క్రమ క్రమంగా అరవ వారు బలవంతులైనారు. అయినప్పటికీ తెలుగు భాషకు గాని సంస్కృతికి గాని దెబ్బతీయలేదు. అరవంతో పాటు తెలుగు కూడా పాఠశాలలోను, ప్రభుత్వ కార్యాలయంలోను వాడుకలోనుండేది. ఆంధ్ర రాష్ట్ర మేర్పడిన తరువాత అరవ వారు పాఠశాలలో తెలుగు తరగతులు తీసివేసినారు. చెన్నపట్నం వీధిలో పేర్లు మార్చిఅరవంలో వ్రాయడం ప్రారంభించారు. మన ఆంధ్ర మంత్రులు దీనిని గూర్చి పట్టించుకోలేదు చెన్న పట్టణంలోని తెలుగు వారికి దక్షిణాత్యాంధ్రుల గతియే పట్టినది.

బ్రిటిష్ వారు 1917 సం॥లో రాజ్యాంగ సంస్కరణలు చేస్తామని ప్రకటించిన సమయంలో చెన్నపట్నంలో బ్రాహ్మణేతరోద్యమం విజృంభించింది. కానీ చెన్నపట్నం లోని తెలుగువారు జాతి మత కుల విచక్షణ లేకుండా ఆంధ్రాభిమానం కలిగి ఉండేవారు. 1916 ఏప్రిల్ 17వ తేదీన చెన్నపురి ఆంధ్ర మహాసభ స్థాపించబడినప్పుడు బ్రాహ్మణ నాయకులైన సర్ పిట్టి త్యాగరాయ సెట్టి గారిని ఏకగ్రీవంగా అధ్యక్షునిగా వరించారు. త్యాగరాయసెట్టి గారు ఆంధ్రాభిమానము కలవారిలో అగ్రగణ్యులు. వారి నాయకత్వం క్రింద మద్రాస్ లో ఏర్పడిన జస్టిస్ పక్ష మంత్రి వర్గంలో తెలుగువారిదే అగ్ర తాంబూలము. మొట్టమొదట ఆంధ్ర- క్షత్రియుల గ్రామమైన రాజపాలయములో ఒక సభ స్థాపించబడినది. దానికి పూసపాటి వంశ రాజులు అండైయైనారు. ఇలాగే తిరునల్వేలి, తిరుచిరాపల్లి జిల్లాలలో కూడా శాఖ సంఘము ఏర్పడినవి. ఈ కృషి ఫలితముగా ఒట్టుపిడారు కమ్మవారి ఉన్నత పాఠశాల లోను, తిరునల్వేలి జిల్లా సమూహ రంగాపురం లోని పాఠశాలలోనూ, కోవెలపట్టి బోర్డు హైస్కూలు లోను రాజుపాలెం లోని కొన్ని బడులలోను తెలుగు బిడ్డలకు తెలుగు నేర్పుట కేర్పాటులు జరిగినవి.

1925 సం॥లో రామనాథపురం జిల్లా కలెక్టర్ గానుండిన శ్రీ సొంఠి రామ్మూర్తి పంతులు గారి అధ్యక్షత క్రింద దక్షిణాంధ్ర మహాసభ సాత్తూరులో మహా వైభవంగా జరిగినది. ఆ సభకు దక్షిణ దేశంలోని అరవ జిల్లాలలో నున్న తెలుగు వారి ప్రతినిధులనేకులు వచ్చితమ స్థితిగతులను గూర్చి వివరించారు. దక్షిణ దేశంలోని తెలుగు వారికి గల యిబ్బందులను తొలగించుటకు చేయవలసిన ప్రయత్నములను గూర్చి చర్చించారు. కర్తవ్యమాలోచించారు. పూర్వము ఆంధ్రోద్యమ కాలంలో ఆంధ్రదేశములోని తెలుగు వారిలో కలిగిన ఆవేశము, ఉత్సాహము, కార్యదీక్ష దాక్షిణాత్యాంధ్రులలో కలిగినది. ఇది దాక్షణాత్యాంధ్రోద్యమమే యని చెప్పవచ్చు.

దక్షిణాంధ్ర భాషాభి వర్ధని సమాజము 1935సం॥ వరకు చెన్నపూరిలోనే కేంద్రముగా చేసుకుని దక్షిణ దేశములోని అరవ జిల్లాలలో ఆంధ్ర సంస్కృతి అభివృద్ధికి గొప్ప ప్రచారము చేసి అనేక సభలను ఏర్పాటు చేసినది ఈ సంఘోద్ధేశములను పూర్తిగా సఫలము చేయు ఉద్ధేశముతో దక్షిణాంధ్ర పత్రిక అను ఒక తెలుగు త్రైమాసిక పత్రికను శ్రీ సాధు వరదరాజులు పంతులుగారు బహు వ్యయ ప్రయాసల కోర్చి దక్షిణాంధ్ర నిమిత్తము తమిళ లిపిలో ముద్రించి ప్రకటింప సాగిరి.

చెన్నపురి ఆంధ్ర మహాసభ స్థాయీ సంఘ సమావేశము 1936 జనవరిలో అయ్యదేవర కాళేశ్వరరావు గారి అధ్యక్షత క్రింద జరిగినప్పుడు ఆంధ్ర మహాసభ కార్య దర్శి సుసర్ల శ్రీ రామ నృసింహం గారి ప్రోత్సాహం వలన దక్షిణ జిల్లాలలో పర్యటించి అక్కడ తెలుగువారి స్థితిగతులను విచారించి రాష్ట్ర అధికారులతో సంప్రదించి నివేదికను సమర్పించుటకొక ఉపసంఘమేర్పడినది. గాని ఆ సంఘము యేపని చేయలేక పోయినది. కాంగ్రెస్ రాజకీయమునందు నిమగ్నులైన ఆంధ్ర నాయకులు దక్షిణాంధ్ర మహాసభకు తగు సహాయము చేయలేకపోయిరి. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణమే ఒడుదుడుకులలో పడినది. ఇక చెన్నపట్నంలో కేంద్రంగా పెట్టుకొని పని చేయుట నిష్ప్రయోజనమని తలచి వరదరాజం పంతులుగారు 1936 సం॥ ఏప్రిల్ నెలలో కార్య స్థానమును తమ స్వగ్రామమైన తిరునల్వేలికి మార్చుకొనిరి. అప్పట్లో తిరునల్వేలి జిల్లాలో జిల్లా సర్జనుగా నుండిన లెఫ్టినెంట్ కర్నల్ తాడేపల్లి శంకర శాస్త్రి గారు ఉద్యమం పట్ల సానుభూతి కలిగి ఉన్నందున వారి అధ్యక్షత క్రింద గొప్ప దక్షిణాంధ్ర మహాసభ జరిగించినారు. ఆ సభలో ఉత్తరాంధ్రులు దక్షిణమున పర్యటించి ఈ ఉద్యమమునకు తోడ్పడవలెనని తీర్మానము చేసిరి.

చెన్నపట్నంలోని ప్రముఖ న్యాయవాది శ్రీ వేమవరపు రామదాసు పంతులు గారును గ్రంథాలయోద్యమ నాయకుడైన అయ్యంకి వెంకటరమణయ్య గారు మొదలైన వారు కొత్తకోట (పుదుక్కోట) లో జరిగిన అఖిలభారత గ్రంథాలయ మహాసభకు వచ్చినప్పుడు అక్కడి తెలుగువారు ఆంధ్ర భాషాభివృద్ధి సంఘము నెలకొల్పిరి. శ్రీ సాధు వరదరాజం పంతులు గారీ ఈ యుద్యమాన్ని గూర్చి రాత్రింబవళ్ళు అవిరళ కృషి చేయుట వల్ల 1937 సం॥ తెలుగు సంవత్సరాది నాడు తిరునల్వేలి హిందూ కళాశాలలో ఆ జిల్లాలోని ఆంధ్రులు ఒక మహాసభ చేసిరి. ఆ మహాసభలో దక్షిణ దేశ ఆంధ్ర ప్రముఖులు తెలుగులోనే మాట్లాడిరి. దక్షిణాంధ్రుల అభివృద్ధి కొరకు కృషి చేయుటకు ప్రచారకులను పంపి సహాయము చేయవలెనని లేదా ధన సహాయమైన చేయవలసినదని ఉత్తరాంధ్రులను కోరుతూ తీర్మానించిరి. బెజవాడలో ఆంధ్ర మహాసభ రజతోత్సవములు జరిగినప్పుడు 1937సం॥లో పై తీర్మానములు సమర్పించబడెను కానీ ఫలితము కలుగలేదు.

తిరునల్వేలిలో సుప్రసిద్ధ న్యాయవాది రేమాని గురుమూర్తి అయ్యగారి అధ్యక్షత క్రింద జరిగిన దక్షిణాంధ్ర మహాజనసభలో దక్షిణాంధ్ర బాలబాలికలు పాఠశాలలో తెలుగు నేర్చుకొనుటకవకాశము కల్పించవలెనని తీర్మానం చేసి చెన్నపురి శాసన సభ్యులందరికినీ, ప్రభుత్వము వారికినీ పంపించిననూ ప్రయోజనం కలుగలేదు.

1938 సం॥లో చెన్నపట్నం టాల్ స్టాయి థియేటర్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారి అధ్యక్షత కింద జరిగిన ఆంధ్ర మహాసభలో అరవ జిల్లాలలో స్థిరపడి యున్న తెలుగువారి భాషా సమస్యను గూర్చి చర్చించి కొన్ని తీర్మానాలు చేసిరిగాని ఫలితము శూన్యం.

1923- 26 సం॥ మధ్య మద్రాస్ ముఖ్యమంత్రిగా నుండిన జస్టిస్ పక్షాన నాయకులైన శ్రీ రాజా పానుగంటి రామారాయనిం గారు చెన్నపట్నం యొక్క పుట్టు పూర్వోత్తరాలు యెరిగిన వారు. ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని చెన్నపూరిలోని ఉత్తర భాగము నుంచి వచ్చునని ప్రకటించినారు. అప్పటినుండి చెన్నపట్నంతో సహా ఆంధ్ర రాష్ట్రం మేర్పడవలనని ఆంధ్రులు కృషి చేయసాగిరి. ఇది అరవవారి కాటంకమైనది దానిని వారు ప్రతిఘటింప సాగిరి. చెన్నపట్నం తెలుగువారికి లేకుండా చేయుటకు కుట్రలు ప్రారంభమైనవి. చెన్నపట్నమును గూర్చిన చరిత్రనూ, జనాభా లెక్కలందును మార్పులు చేర్చిరి. అది అరవవారిదే యని ప్రచారము చేయసాగిరి. చెన్నపట్నం లోని ఆంధ్రులలోనే కొందరిని చీలదీసి మిత్రభేదం కలిపించిరి. అది వరకు చెన్నపట్నంలో తమిళ, ఆంధ్ర కాంగ్రెస్ కమిటీలు పనిచేస్తూ యుండగా ఆంధ్ర కాంగ్రెస్ కమిటీ అక్కడ లేకుండా చేసిరి. 1938సం.లో చక్రవర్తి రాజగోపాలాచార్యులు గారు కాంగ్రెస్ పక్షమున ప్రధానమంత్రిగా నుండగా చెన్నపట్నం వదులుకొననిదే ఆంధ్ర రాష్ట్రం సిద్ధింపని పరిస్థితిని కల్పించిరి. ఇంతలో యుద్ధ సందర్భముగా కాంగ్రెస్ మంత్రులు రాజీనామా యిచ్చిరి. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణము వెనుకబడినది. యుద్ధ పరిస్థితులలో పత్రికానిర్వాహణము దుస్తరమైనది. వరదరాజం పంతులుగారు 1942సం॥లో తమ దక్షిణాంధ్రపత్రిక ఆపివేసిరి. చెన్నపట్నంతో సహా ఆంధ్రరాష్ట్ర నిర్మాణముచేయవలెనని పొట్టి శ్రీరాములు గారు ప్రాయోపవేశము చేసిరిగాని చెన్నపట్నం లేకుండా 1953లో ఆంధ్రరాష్ట్రమేర్పడినది. అటుతురవాత 1956లో ఆంధ్రప్రదేశమేర్పుడినది. బళ్లారికూడా ఆంధ్రుల చేయి జారిపోయినది. దక్షిణాంధ్ర

భాషాభివర్ధిని తిరునల్వేలీలో కొనయూపిరితో పనిచేయుచున్నది. దానికి ఆంధ్ర రాష్ట్ర మంత్రులే సహాయమును చేయలేక పోయిరి. అరవ జిల్లాలో తెలుగు పిల్లలకు పాఠశాలలో తెలుగు నేర్చుకొను అవకాశము కల్పించమని వరదరాజం పంతులుగారు మొదలగు దాక్షిణాత్యాంధ్ర నాయకులు మద్రాసు ప్రభుత్వము వారికినీ, భారతదేశ కేంద్ర ప్రభుత్వమువారికిని ఆంధ్ర ప్రభుత్వములోని ప్రముఖులు ఎన్ని విజ్ఞప్తిలు పంపిననూ లాభములేకపోయినదని శ్రీ వరదరాజం పంతులుగారు 1958సం ప్రకటితమైన ఆంధ్ర విజ్ఞాన సర్వస్వములోని తెలుగు సంస్కృతి సంపుటమున వ్రాసిన వ్యాసమునందు మొర పెట్టి యున్నారు.

దాక్షిణాత్యాంధ్రుల విషయముననేగాక రాష్ట్రేతరాంధ్రుల విషయముననూ మన ఆంధ్ర మంత్రులు చూపిన ఉపేక్ష క్షమించరానిది

— ✦ ❖ ✦ ––

1894 సంవత్సరం మద్రాస్ కాంగ్రెస్ ప్రభావం

భారత జాతీయ కాంగ్రెస్ మహాసభ 1894 సం॥లో చెన్నపట్టణంలో జరిగినది. ఆనరబుల్ పి. రంగయ్య నాయుడు[33] గారు ఆహ్వాన సంఘాధ్యక్షులు. పార్లమెంట్ మెంబర్ ఆల్ఫ్రెడ్ వెబ్[34] సభాధ్యక్షులు. కాంగ్రెస్ ప్రముఖులు అయిన డి ఇ. వాచా, ఆర్. ఎన్. మధోత్కర్, సురేంద్రనాథ్ బెనర్జీ, మదన్మోహన్ మాలవ్య, చిమన్ లాల్ సెటల్ వాడ్, [గోపాలకృష్ణ] గోఖలే[35] గారు అంబికా చరన్ మజుందార్, ఎర్డలె నార్టన్[36] తీర్మానాలపైన మాట్లాడారు.

ఆ కాంగ్రెస్స్ లో ఆంధ్రులలో పనప్పాకం అనంత చార్యులు గారు రెంటాల వెంకట సబ్బా రావు గారు, ఆంధ్ర ప్రకాశిక ప్రకాశకులు ఆవుల చిన్న పార్థసారథి నాయుడు గారు,

---

33 పాల్వాయి రంగయ్య నాయుడు గారు (1828-1892).
34 Alfred Web (1834-1908) వీరు దాదాభాయి నౌరోజి మిత్రుడు.
35 గోపాలకృష్ణ గోఖలె (1866-1915).
36 ఎర్డలె జాన్ నార్టన్(1852-1931) బ్రిటిష్ దేశస్తుడైననూ భారతీయ పౌర హక్కులకోసం కృషిసల్పిన మద్రాసు హైకోర్టు న్యాయవాది.

గంజాం వెంకటరత్నం గారు మొదలైన వారు మాట్లాడారు. జి సుబ్రహ్మమణ్య అయ్యర్ మొదలైన వారు ప్రసంగించారు.

ఆదిభట్ల నారాయణదాసు గారు, చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు ఈ సభకు హాజరైనారు. ఆదిభట్ల నారాయణదాసు గారు దసరాలో మైసూర్ మహారాజా గారి వల్ల సన్మానం పొంది చెన్నపట్నం వచ్చారు. వారు తమ స్వీయ చరిత్ర వ్రాసియున్నారు. అందులో కొన్ని భాగాలు ఆంధ్ర పత్రికలో ప్రకటించబడినవి.

"మద్రాసులో ఇప్పుడు కాంగ్రెస్ జరుగుతుండెను. కాంగ్రెస్సని కాబోలు విస్తీర్ణముగా నొక పందిరి వేసిరి. అందువేల కొలది కుర్చీలున్నవి. అందుపై జనులు పది రూపాయలు టిక్కెట్టుకొని క్రిక్కిరిసి కూర్చుండిరి. నాటకములోని పాత్రల వలె కొందరు అభినయించుచు నుపన్యాసములిచ్చుచుండగా మధ్య మధ్య కెవ్వున కేకలు వేయిచు జప్పట్లు చరచుచుండ వారిని వీరు వీరిని వారు కొత్త మొగముల చూచు నింగ్లీషున మాట్లాడుకొనుచు నింత యుత్సాహముతో ప్రజాక్షేమము కొరకు యత్నించు చుండేది. ప్రజాక్షేమము మాటకేమి గాని అంగరఖాలకు బదులు కోట్లు, పాగాలకు మారు టోపీలు, చెప్పులకు బదులు బూట్సుని, చుట్టలకు బదులు సిగరెట్లు, ఈ తన్నీళ్ళకు బదులు సీసా ద్రావకమూ, సంస్కృత పాఠశాలలకు బదులు నింగ్లీషు పాఠశాలలు, చలివేంద్రలకు మారు రిఫ్రెష్మెంటు రూములు, కడిబంతికి[37] బదులు క్రికెట్టు, తీర్థయాత్రలకు మారు కాంగ్రెస్ పుట్టినది.

కాంగ్రెస్సులో మనము పెట్టుకున్న మొర్ర ఇంగ్లీషు చెవులకెక్కి మనకు లాభము కలుగునట.

కాంగ్రెస్సైన పిదప సోషల్ కాన్ఫరెన్స్ వెలసెను. ఆడపిల్లలకు పదేండ్లపై పెండ్లి సేయుట. బ్రాహ్మణుల్లో అన్ని శాఖలు సంబంధబాంధవ్యము చేసుకొనుట, వృద్ధ పురుషులు వివాహమాడకుండుట, స్త్రీ పునర్వివాహములు సేయుట. స్త్రీలకు చదువు వ్రాతలు నేర్పుట. సముద్రయాన మంగీకరించుట. యూరపు వెళ్ళిన వారిని తిరిగి కలుపుకొనుటయూ మొదలగు నేర్పాట్లు సోషల్ కాన్ఫరెన్స్ లో జరుగును. స్వతంత్ర రాజ్యము లేని దేశము నిత్తీరుగా బాగు సేయ బూనుట శవమున లంకరించుట కదా?

---

[37] కడిబంతి = పొలంలో పనిచేయటానికి సామూహిక కలయిక.

స్వతంత్రముగా రాజ్యము చేయుటకు మన మెంత మాత్రమూ అర్హులముకామని మన మునిసిపాలిటీ తెల్వియే మనకు జెప్పుచున్నది. మనము సవారి మోయటకే గాని యెక్కుటకు తగమిది నిశ్చయము. మన సురేంద్రనాథ్ బెనర్జీ గారు గావు కేకలు వేసి ఇంగ్లీష్ మాట్లాడుట, గోఖలే గారు ఇంగ్లాండ్ చేరి తద్దినములు జరిపించుటకు మనము సొంగులు[38] యెగాని పులి దాసరికి[39] బెట్టదను నట్లు మనలను దయతో సమానంగా ఎన్నడును ఇంగ్లీష్ వారు చూడనొల్లరు.

స్వరాజ్యం ఇచ్చిన గాని మనకు పౌరుష జ్ఞాన కీర్తులు గలుగ నేరవు. శిరస్సులేని మొండెమును అభ్యంగనమొనర్చినట్లు స్వాతంత్రము లేని దేశమున సోషల్ కాన్ఫరెన్స లేల. ఈ కాంగ్రెస్సు ఈ కాన్ఫెరెన్సని మనలోమనము డాబులు చేసికొనుచు టప్పాలు కొట్టుకొనటకు దప్ప మరేమి ప్రయోజనము లేదు. ఇవన్నియు నాటకములు. ఫార్సులలోని దుష్టకాలక్షేతమునకు వృధావ్యయమునకు విపరీత బుద్ధులుచే కల్పింపబడి అవివేకులచే పోషింపబడుచున్నవి.

వ్యవసాయ అభివృద్ధి చేసుకొని పంటలు పండించు కొనుచుండుటయు వర్తక మభి వృద్ధి చేసుకొనుటయు నీ రెండు మార్గములే మన దేశ క్షేమమునకు దగిన పనులు"

మొదటి గోదావరి మండల సభ కాకినాడలో 1895 సం॥ జూన్ నెలలో జరిగినది. న్యాపతి సుబ్బారావు పంతులుగారు అధ్యక్షుడు. ఆ సభ కాంగ్రెస్స మహాసభ వలెనే అనేక తీర్మానములు చేయబడెను. సభ మాడు రోజులు జరిగినది. మూడవ నాడు శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు పదునాలుగు పద్యములు చదివిరి. పద్యములు చదివినప్పుడెల్ల సభాసదులు చప్పట్లు కొట్టి యానందించు చుండరి. ఈ పద్యములను సుబ్బారావు గారు విజయనగరమునకంపి అక్కడ రాజాగారి కాలేజీ లో ఇంగ్లీషు పండితులుగా నుండిన గురజాడ అప్పారావు గారి చేత ఇంగ్లీషులోని కనువదింపచేసిరి. ఇంగ్లీషు తెలుగు పాదములు గోదావరి మండల సభా నివేదికలో ప్రకటింపబడినవి. తెలుగు పద్యము శ్రీ చిలకమర్తివారి స్వీయ చరిత్రలో పునర్ముద్రణ మైనది. అందులో ఇంగ్లీష్ వారు ఏక చ్ఛత్రాధిపత్యం వహించి భారత దేశమును కట్టుదిట్టంగా నేలుట, శాంతి భద్రతలు

---

[38] సొంగులు = ప్రవర్తనలు, వేషాలు నటనలు

[39] పులి దాసరికి పెట్టదు= ఇది ఒక సామెత వేటాడిన మాసమును భక్తుడైన దాసునకు పెట్టునా అని

స్థాపించుట, న్యాయ పరిపాలన చేయుట మొదలైన మంచి పనులుతో పాటు ప్రభుత్వంలో ప్రజలకు పలుకుబడి లేకుండుట, అధిక పన్నులు విధించుట మొదలైన అన్యాయములు కూడా వివరించబడినవి. రైతుల బాధలు వర్ణింపబడినవి రైతులకు నోరులేక పోవుట, వారి బాధలు ప్రభుత్వానికి చెప్పుటకు విధ్యాదికులకు ధైర్యము లేక పోవుట మొదలైన విషయాలు వివరించబడినవి. ఈ పద్యాలు దేశాభిమాన పూరితములై యున్నవి. ఆనాటి విద్యాధికుల రాజకీయ పరిజ్ఞానము తెలుపును. మద్రాసులో క్రిస్టియన్ కాలేజీలో పండితులుగా నున్న వేదం వెంకటరాయశాస్త్రులు వారి ప్రతాపరుద్రీయ నాటకము ఒక స్వతంత్ర జాతీయ తెలుగు నాటకము. ఇది 1897 సం॥ ప్రాంతమున అచ్చైనది. దీని ఇతివృత్తము ఓరుగంటి ప్రతాపరుద్ర మహారాజును తురకలు పట్టుకొని ఖైదు చేసి ఢిల్లీకి తీసుకొని పోవటం. మంత్రి యుగంధరుడు పిచ్చివాని వేషంతో పోయి తురక సుల్తానులను మోసగించి మహారాజుని విడిపించడము. ఈ కథను శాస్త్రులు గారు తమ బాల్యంలో తమ తండ్రిగారైన శ్రీ వేంకటరమణ శాస్త్రి గారు మిత్ర బృందానికి చెబుతుండగా విన్నారట. వేదం వెంకటరాయ శాస్త్రి గారు జన వినోదిని అనే తెలుగు పత్రికకు కొంతకాలం ముద్రణాధి కృతులుగా నుండగా ఈ కథను తమకు తోచిన విధంగా విరివి చేసి 1888 సం॥లో ఆ పత్రికలో ప్రకటించారు. 1896 సం. జూలై నెలలో దానిని నాటకోచితముగా రూపు చేసి నాటకములోని గద్యభాగమును మాత్రము వ్రాసి మిత్రులకు చూపించారు. అముద్రిత గ్రంథ చింతామణి పత్రికాధిపతులైన శ్రీ పూండ్ల రామకృష్ణయ్య గారు దానిని అచ్చు వేయించవలసినదని అది మీకు వెలగల యశస్సును సంపాదించునని శ్రీ శాస్త్రి గారికి 10-07-1897 తేదీన వ్రాశారు.

ప్రతాపరుద్రీయము అచ్చయిన తర్వాత 06-11-1897 తేదీన ప్రతాపరు ద్రీయమును చూసి బ్రహ్మానందము చెందితిమి. నిన్నటి రాత్రి మా యిల్లంతయూ దీని పఠణము వలన మన మిత్ర బృందముచే నిండి పోయినది. ఈ గ్రంథమునకు మిగుల ఖ్యాతి వచ్చుననుటకు సందియము లేదు అని వ్రాసిరి (పుట 78)

ఈ గ్రంథంలో శ్రీ శాస్త్రులవారు ఎనిమిది తొమ్మిది రకముల గ్రామ్య భేదములు ప్రయోగించి తమ పాత్రోచిత భాషా సిద్ధాంతమును స్థిరపరిచారు. ఇది ఆంధ్ర వాఙ్మయము నందలి మొదటి జాతీయ నాటకము. ఇది స్వతంత్ర నాటకము. 1897 సం॥లోనే గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కము, శ్రీ ధర్మవరం కృష్ణమాచార్ల వారి

చిత్రనళీయము ప్రకటింపబడినవి. లోకమాన్య తిలక్ కాంగ్రెస్స లో అతివాదులకు నాయకుడై పునహ నగరమునందు కేసరి పత్రిక నడుపుచూ 1897సం॥ జూన్ నెలలో శివాజీ పట్టాభిషేకమహొత్సవము జరిపించెను. రాజద్రోహ నేరమునకు బ్రిటిష్ ప్రభుత్వము 1897 సెప్టెంబర్ 15 తేదీన 18 నెలలు శిక్ష విధించారు.

ప్రతాపరుద్రయములో శ్రీ వేదం వెంకటరాయ శాస్త్రి గారు చెకుముకి శాస్త్రి చేత ఈ క్రింది అర్థము గల పద్యమును చెప్పించినారు.

లోకక్షేమార్థము క్లేశించుట ధర్మముగాని లోకమేమైనా మనకేమీ అని సీదా ముక్కు మూసుకొని మూలకుర్చుండుట ధర్మము కాదు. పూర్వము ఈ భూమి పరశురామునిది. అతడు దానిని కశ్యపుడు లోనగు బ్రాహ్మణులకిచ్చినాడు. దానిని వారు యోగ్యులైన క్షత్రియులు చేత పెట్టినారు. ఈ కలి కాలములో అపుణ్యాత్ములైన క్షత్రియులను వంచకమైన విధి బాధించుచుండగా ఎన్ని కష్టములైన పడి వారిని కాపాడుట బ్రాహ్మణులు చేయవలసిన పని. అది రాజనీతిని చేర్చి కార్యశూరుడగును. ఇంగ్లీషు పరిపాలనలో భారతీయులకు కలిగిన బాధలను మనసులో పెట్టుకొని ఈ పద్యములు వ్రాసినారు అని ఊహించవచ్చును.

వంగరాష్ట్ర విభజన వందే మాతరం

1897-1905 సం॥ల మధ్య భారతదేశ బ్రిటిష్ రాజ్య ప్రతినిధిగా పాలించిన కర్జను (George N.Curzon) గారి పరిపాలనను ఔరంగజేబు పరిపాలనతో పోల్చి చెప్పారు గోఖలేగారు.

బాలగంగాధర తిలక్, అరవిందఘోష్, విపిన్ చంద్రపాల్ గారి నాయకత్వమున బ్రిటిషు వస్త్రములను, వస్తువులను, సంస్థలను బహిష్కరించి స్వదేశాభిమానము పురికొల్పు స్వదేశ స్వరాజ్య జాతీయోద్యమము విజృంభించినది. వందేమాతరం పదాలలో ఈ భావాలన్నీ ఇమిడియుండేవి.

ఆ కాలంలో బందరు బజారులో మబ్బుల చావడిలో వారం వారం పెద్దలు ఉపన్యాసాలిచ్చేవారు. ఇందులో ముఖ్యులు చెన్నాప్రగడ భానుమూర్తి గారు, దుగ్గిరాల రామమూర్తిగారు

భానుమూర్తిగారు భారత భాగవతములనుండి స్వదేశ ఉద్యమానికి పోషణగా కొన్ని గ్రంథాలు కూడా వ్రాశారు. వారి భారత ధర్మ దర్శనం దేశ భక్తి ప్రబోధకమైన ప్రథమ గ్రంథం. ముట్నూరి కృష్ణారావు గారు 1906సం॥ లో కలకత్తా వెళ్ళి వంగదేశ ప్రముఖుడైన విపిన చంద్రపాలుతో కలిసి అక్కడ ఉద్యమం చూసి వచ్చారు. స్వరాజ్యము వాంఛితమా కాదా అనే చర్చ బందరు అయ్యంకి వారి హాలులో జరిగినది.

ఆంధ్ర దేశంలో వందేమాతరోద్యమాన్ని గూర్చి ప్రబోధించడానికి విపిన్ చంద్రపాల్ గారు 1907 సం॥ ఏప్రిల్ నెలలో ముఖ్య పట్టణాలలో పర్యటించారు. బరంపురం, విశాఖపట్నం, రాజమండ్రి, కాకినాడ బెజవాడ బందరు నెల్లూరు, మద్రాసు పట్నాలలో ఉపన్యాసాలిచ్చారు.

ఆంధ్రదేశములో ఎక్కడ చూసినా దేశభక్తి పూరితములైన పాటలు, భజన కీర్తనలు, ఉపన్యాసములు ఎక్కడచూసిన లోకమాన్యుని తిలకదారణము, ఎక్కడ చూసిన వ్యాయమ క్రీడలు, స్త్రీపురుషులు దేశభక్తిలో మునిగి తేలిరి. చిలుకలు, చిన్నపిల్లలు, గోరువంకలు కూడా వందేమాతరం మనదే రాజ్యం అని పలుకడం ప్రారంభమైనది.

ఆకాలంలో భజనలలో మహారాష్ట్ర దేశములోని సార్వజనక గణపతిని గూర్చిన పాటలు, మహిషాసుర మర్ధనిని గూర్చిన పాటలు బంకించంద్ర ఆనంద మఠంలో చేప్పిన మహాకాళీ, మహా సరస్వతి, మహాలక్ష్మి రూపమున భారత జననిని సాక్షత్కారింపచేయు పాటలు వ్యాపించినవి. ఆనాడు అచ్చమాంబగారు [భండారు] రచించిన పాటలలో ఈ క్రింది పాట చూస్తే అది ఎంత భావగర్భితంగా నున్నదో తెలుస్తుంది.

కరుణించు మా భారతి సరస్వతి ॥ క॥
జనలోకమాత నేను నమ్మి కోల్తూ నే ॥క॥
ఘనవిద్య దయసేయూమా గైకొని మమ్ము ॥క॥
మెప్పింప గలమా నీత విద్యల్
అచ్చమాంబారాధి పా గైకొని మమ్ము ॥క॥

బిపిన్ చంద్ర పాల్ ఉపన్యాసాలను రాజమహేంద్రవరంలో చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారు తెలుగులో కనువదించిరి

(1) భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకచున్నారు మూతులు బిగియగట్టి



అని అశువుగా[40] పద్యము చదివారు సభాసదులు చప్పట్లు కొట్టి సంతోషించారు

శ్రీ చెన్నాప్రగడ భానుమూర్తిగారు ఈ పై పద్య భావానికి ప్రతిగా[41] నీక్రింది పద్యము చెప్పారు

దురుసు దనముగ దీర దీ గడుసుదనము
లేగలన్నిటి నేక మౌలా గొనర్చి
నేర్పుతో తల్లియెగ చేపనే దనలము

భానుమూర్తిగారు భారతమాతను గూర్చి రచించిన మాలికాస్తవము సాహిత్యవీధులు పుట 113

09-05-1907 లాలా లజపతిరాయ్ గారిని మండలే జైలుకు ప్రవాసం పంపినప్పుడు చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు భారత దేశమొక చెఱసాల పద్యము వ్రాశారు

భరత వర్షంబు [ఖండంబు]చక్కని పాడియావు అనే పద్యంతో పాటు

(2) నూతి యొడ్డున కూర్చుండి త్రాగనీరు

తెచ్చుకొనలేక నోరెండి చచ్చినట్లు

సిరులగల దేశమందున వసించుచుండి

హిందువులు చచ్చుచుందురు కరువు చేత

---

40 అశువుగా చెప్పటం లేదా చదవటం అంటే తత్క్షణం ఊహించుకుంటూ. Impulsively on the spot.

41 ప్రతిగా అంటే సమాధానంగా.

(3) పాత దొంగల గుంపు బంధు వర్గము మాకు

పచ్చి జొన్నల కూడు బాయసంబు

బలుకాలు సంకెళ్లు బిరుదుటందెలు మాకు

మురికియుండెడు టోపి బొమిడికంబు

(4) కటిక నేలలు రత్న కంబళులు మాకు

ధీరులము గాని మేము ఖైదీలుగాము

గౌరవమె గాని మాకు లాఘవము లేదు...

అనే పద్యం కూడా చిలకమర్తి వారు వ్రాశారు

చూడు కాళేశ్వరరావు గారి జీవిత కథ[42] (1st Edition of 1959 పుట 94-99 (2nd Edition of 2006 pp83).

1907 సంవత్సరంలో చెన్నపురి రాజకీయ సభ (Madras Provincial Plitical Confereence) విశాఖపట్నంలో జరిగినది. న్యాపతి సుబ్బారావు గారు అధ్యక్షులు 1907 మే 9 తేదీన పంజాబ్ దొరతనము వారు దేశ అభిమానియూ మహా పురుషుడైన లాలా లజపతిరాయ్ గారిని పట్టుకొని బర్మాలో మాండలే నగరం జైల్లో ఖైదు చేసిరి. విశాఖపట్నం సభలో మొదటి తీర్మానము అందుకు నిరసన చర్యలను .....

చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు తెలుగులో మాట్లాడారు. (చిలకమర్తి స్వీయ చరిత్ర 258)

లాలా లజపతి రాయి గారి మాండలే జైలు ప్రవాసనము గూర్చి ఈ క్రింది పద్యములు లక్ష్మీ నరసింహం గారు రాజమహేంద్రవరంలో నుండగానే రచించారు

---

42 కాళేశ్వరరావు గారి జీవిత కథ= నవ్యాంధ్రము నా జీవిత కథ.

మ॥ చెరశాలల్ పృధు చంద్రశాలలెయగున్ చేదోలు గీలించు న
య్యరదండల్ విరిదండలయ్యెను హేయంబైన చోడంబ లే
పరమాన్నంబగు మోట కంబళులుదాల్పన్ పట్టు సెల్లాలగున్
స్థిరుడై యే నరుడాత్మ దేశమును భక్తింగొల్చునవ్వానికిన్

తే॥గీ॥ భరతఖండంబె యొక గొప్ప బండెఖాన
అందులోనున్న ఖయిదీలు హిందుజనులు
ఒక్క-గదినుండి మార్చి వేరొక్కగదిని
బెట్టుటే గాక చెరయంచు వేరెగలదె

(చిలకమర్తి స్వీయ చరిత్ర పుట 259)

దేశాభిమానము దీపింపజేయు మంత్రంబు వందేమాతరంబు అను మకుటంతో 1907 సంవత్సరంలో మంగిపూడి వెంకట శర్మ గారు దేశభక్త కవిత్వము ప్రారంభించారు

ఆంధ్ర మాత శ్రీ సమేత అనుపమ ప్రఖ్యాత చరిత కూడా
వందేమాతరమనుచు వింత వార్త ఒకటి పుట్టెనే
బిపిన చంద్ర పాలు చేత విత్తనము నాటించిరే వం॥

అనే పాట ఆకాలం నాటిదే

వందే వందే సదా| స్వదేశమాతరం | సదయ హృదయ జననీ నీకు చక్క మ్రొక్కెదన్ వం॥

౧ జయం జయమ్మనున్ సతమ్ము వేడుకన్
రయమ్ముగ సుఖవర్ధకంబు రంజిలన్ దరన్ ॥వం

౨ నీలో నేమాత్రమున్ నే లోపముల్గనన్
సర్వపరాధములు మావే చాలా సిగ్గగున్॥ వం

౩ కనకాదిలోహముల్ ఘనంబులౌ ఘనుల్

సమృద్ధి గ మాకు మన్న సంగ్రహింపము ॥వం

౪ కృషీ ప్రయత్నమూ కించిత్తు క్రొత్త యంత్రములు

౫ విదేశ వస్త్రముల్ తదేక నిష్ఠమై

౬ జయం జయం జయం జయం జయంబు నీకగున్

చాల నీకొసంగు సృష్టి సర్వసంపదల్ ॥ వం

1906 సం॥లో జరిగిన కలకత్తా కాంగ్రెస్సు లో దాదాభాయి నౌరోజీ గారు అధ్యక్షుడు. అప్పుడే భారతదేశానికి స్వరాజ్యం కావాలని తీర్మానం చేయబడినది దాంతోపాటు వందేమాతరం జాతీయగీతం గా ఆమోదింపబడినది.

శ్రీ కౌతా శ్రీరామశాస్త్రిగారిది[43] శ్రావ్యమైన కంఠము. వారు ఆంధ్రదేశంలో జరిగిన ప్రతి సభలోను వందేమాతరం గీతాన్ని చాలా ఆకర్షవంతంగా పాడేవారు.

1908సం॥ డిసెంబర్ లో మద్రాస్ లో జరిగిన కాంగ్రెస్సు గురించి గురజాడ అప్పారావు గారొక అపహాస్య[44] వ్యాసం వ్రాశారు. మింటో మార్లె సంస్కరణాల వల్ల అధ్యక్షుడు రాసవిహారీ ఘోష్[45] ప్రభుత్వ తీవ్ర నిర్బంధాలను ప్రయోగిస్తూవుంటే దమన[46] నీతిని సమర్థిస్తూ యువకుల దౌర్జన్యాలు (Violence) నిరసిస్తున్నామని తీర్మానం చేశారు. అప్పారావు గారు, టంగుటూరి ప్రకాశం గారు కూడా ఈ వైఖరికి రోత పడ్డారు.

మద్రాసు కాంగ్రెస్ జరిగిన రెండేళ్లకు అప్పారావు గారు దేశభక్తి గీతం దేశమంటే మట్టి కాదోయి 1910సం॥లో వ్రాశారు.

1911 సం॥ డిసెంబరులో వంగ రాష్ట్ర విభజన రద్దు చేస్తూ పంచమ జార్జి చేసిన ప్రకటన వెలువడిన తరువాత కాంగ్రెస్ మితవాదులు చక్రవర్తిని ప్రశంసిస్తూ గేయాన్ని

---

43 కౌతా శ్రీరామశాస్త్రి గారు (1873-1947). శారద పత్రికాధిపతి. వారి కుమారులు ఆనందమోహన శాస్త్రి, రామమోహన శాస్త్రి.

44 అపహాస్య వ్యాసం = వ్యంగ్యం, వెటకారంparody/ satirical essay.

45 రాస బిహారి ఘోష్ (1845-1921).

46 దమన నీతి= అణచివేసే సిద్ధాంతం.

వ్రాసి పెట్టవలసినదని రవీంద్రనాథ్ గారికి అశుతోష్ చౌదరి ద్వారా కబురంపారు. ఆయనకు కోపం వచ్చింది. అంతట అతడు జనగణమన అధినాయక ...

సశేషం.[47]

— ✦ ❖ ✦ —

ప్రాచీన ఆర్య సంఘము- చతుర్వర్ణములు

బృహదారణ్యకోపనిషత్తు 1-4-11

బ్రహ్మ వా ఇదమగ్ర ఆసీదేకమేవ తదేకగ్ం సన్న వ్యభవత్ తచ్ర్చేయోరూపమత్యసృజత క్షత్రం...
సైషా క్షత్రస్య యోనిర్యద్బ్రహ్మ ।
తస్మాద్యద్యపి రాజా పరమతాం గచ్ఛతి
బ్రహ్మైవాన్తత ఉపనిశ్రయతి స్వాం యోనిమ్ ।
స నైవ వ్యభవత్; స శౌద్రం వర్ణమసృజత

ఈ జగత్తు మొదట ఒకటైన బ్రాహ్మణ జాతి అయి యుండెను. ఆ బ్రాహ్మణ జాతి ఒకటిగా నుండి వృద్ధినొందలేదు. ఆ బ్రాహ్మణ జాతి శ్రేష్ఠమగు రూపముగల క్షత్రియ జాతిని సృజించెను. బ్రాహ్మణ జాతి యనునది క్షత్రియ జాతికి యోని భూతము. ఆ హేతువు వలన రాజసూయ యాగ మందభి షిక్తుడ గుటవలన రాజు శ్రేష్ఠత పొందుచున్నాడు గాని చివరకు తమకు యోని భూత మగు బ్రాహ్మణ జాతిని సమీపించి (యజ్ఞములు చేయుటకు కొరకు) నిశేనతచే నాశ్రయించు చున్నాడు. ఆ క్షత్రియ జాతి వృద్ధినొందలేదు. ఆ క్షత్రియ జాతి వైశ్యజాతిని సృజించెను. అదియు వృద్ధిచెందలేదు. ఆ క్షత్రియ జాతి శూద్ర వర్ణమును సృజించెను.

మొదట అందరూ బ్రాహ్మణులే. గుణకర్మల వల్ల చతుర్వ ర్ణములవారైనారు. వర్ణములలో హెచ్చుతగ్గులు లేవని మహాభారతము ఘోషించుచున్నది. కలియుగములో

---

47 ఈ వ్యాసము చేతి వ్రాత ప్రతి ఇంత మట్టుకే ఉపలబ్ధైయున్నది.

అందరూ శూద్రులేనని మత్స్య పురాణము చెపుచున్నది. పుట్టుక వల్ల బ్రాహ్మణుడు శూద్రుడే యగుచున్నాడు. కర్మల వల్ల ద్విజుడగుచున్నాడని చెప్పే మాట అలా వుండగా వేద శాస్త్రములు తెలియని బ్రాహ్మణునికి సాధ్యత లేదని, వేదార్థము తెలిసిన బ్రాహ్మణునకే గౌరవము కలదనే సంగతి అన్ని పురాణాల్లోనూ చెప్పబడినది. ఇక వివిధ స్మృతుల నాటికి గల దేశ, జాతి, కుల ధర్మాలు ఎలా వుండేవో ధర్మశాస్త్రాల వల్ల తెలుస్తూనే వున్నది.

చతుర్వర్ణముల వారి కుల ధర్మాలు నిర్ణయింపబడినవి. అవే స్వధర్మములైనవి. చతుర్వర్ణములోని వివిధ కులముల వారి వృత్తులను ఆచారములను స్వధర్మములే యని భగవద్గీత ఉద్ఘోషించుచున్నది.

కుల వ్యవస్థ మంచికీ చెడుకూ కూడా కారణమైనది. బ్రాహ్మణులు ఇతర కులములవారికి మేలుబంతులుగా నుండి ధర్మమును ఆచరించినంత కాలము ధర్మము నాలుగు పాదములు నడిచినది. బ్రాహ్మణులు రాజపురోహితులై రాజులకు తమకు లాభకరముగా ధర్మ నిర్ణయము చేయుట ప్రారంభమైనంతనే ధర్మచ్యుతి కలిగినది.

మన భారత దేశ కుల వ్యవస్థలో వివాహ సంస్కారము చాలా పవిత్రమైనది. ఏ కులము వారైనా సరే గృహస్థుకు ప్రాచీన కాలమునుండే సభా పూజ్యాత ఉన్నది. అతిథి అభ్యాగతి, సన్యాసి గృహస్థుల ఆదరణ పొందే వాడు. గృహస్థులే గ్రామ పెత్తన దారులు.

మన ధర్మశాస్త్రములు అనులోమ వివాహములు అంగీకరించినవి. ఉన్నతకుల పురుషులు తక్కువ కులముల స్త్రీలకు వివాహమాడగా అనులోమ సంతానము కలుగుతుంది. వారికి కర్మాధికారము, వారసత్వపు హక్కులు ఇవ్వబడినవి.

అనులోమ సంతానములోని ఆడపిల్లలను మళ్ళీ పైజాతి పురుషుడే వివాహమాడగా అలా ఏడు తరాలు గడిచేటప్పటికీ ఆ కడపటి పిల్ల సంతానము ఉన్నత కులానికి చెందుతారని మనుస్మృతి, గౌతమ ధర్మసూత్రములు శాసించినవి.

ప్రతిలోమ సంతాన మనగా తక్కువ కుల పురుషుడు ఉన్నత కులపు స్త్రీ ద్వారా కలిగిన వారు. ఈ స్త్రీ పురుషుల వివాహములు ధర్మశాస్త్ర మంగీకరించలేదు.

వ్యభిచారముతో సమానంగా చేసి ఈ సంతానమును సంకరులుగా పరిగణించిరి. కొందరిని శూద్ర సములుగాను, కొందరిని నీచ కులముల వారిగాను పరిగణించినది. బ్రాహ్మణ స్త్రీవల్ల శూద్రునికి పుట్టిన వాడిని ఛండాలుడనిరి. అట్టివాడు అస్పృశ్యుడుగను గ్రామం వెలుపల జీవించవలసిన వాడుగను నిర్ణయించిరి. దీనికి కారణము ఆర్యులు మొదట తమ విరోధులైన దస్యులను శూద్రులుగా పరిగణించినందువల్లనేయని శ్రీ అక్కిరాజు ఉమాకాన్త విద్యా శేఖరుల వారు వ్రాశారు

అష్టవిధ వివాహములు

మన ధర్మ శాస్త్రాలలో ఎనిమిది విధములైన వివాహములు చెప్పబడినవి.

(1) బ్రాహ్మము

(2) దైవము

(3) ఆర్షము

(4) ప్రాజాపత్యము

(5) రాక్షసము

(6) ఆసురము

(7) గాంధర్వము

(8) పైశాచము

ఇందులో మొదటి నాలుగు బ్రాహ్మణులకు, 5,6,7 క్షత్రియులకు, వైశ్యులకు యోగ్యములనిరి. పైశాచికము అన్ని కులాలకు నింద్య. ఈ వివాహముల విషయములలో మహాభారతానికి పూర్వము దేశములో జరిగిన విప్లవ ఫలితముగా క్షత్రియకుల వినాశము కలుగగా క్షత్రియ స్త్రీలు బ్రాహ్మణుల ద్వారా క్షత్రియ వంశాన్ని పెంచుకున్నారు. మహాభారత కాలంనాటికి అనులోమ వివాహాలు చాలా జరిగినట్లు తెలుస్తున్నది. ఇంకా కొన్ని మార్పులు కూడా జరిగినవి.

పుత్రులు

ఋగ్వేదములో ఏడు విధములైన పుత్రులు కనబడుచున్నారు.

హరితస్మృతిలో మొదటి వర్గమున

(1) వివాహమాడిన పతివ్రతయగు భార్యకు పుట్టిన వాడు (ఔరసుడు)

(2) తన భార్యకు జ్ఞాతి వల్ల పుట్టినవాడు

(3) ద్వితీయ వివాహము చేసుకున్న స్త్రీకి పుట్టినవాడు

(4) (వివాహితయైన) కుమార్తెకు పుట్టిన దౌహిత్రుడు

(5) గూఢోత్పన్నుడైన పుత్రుడు

రెండవ వర్గమున

(1) తల్లితండ్రులవల్ల దత్తు ఇవ్వబడినవాడు (2) క్రీతుడు (3) విడువబడిన వాడు (4) గర్భవతిని పెండ్లాడగా పుట్టినవాడు (5) స్వయం దత్తుడు (6) దత్తుచేసుకొనబడినవాడు

గౌతముడు, బోధాయనుడు, మను, తక్కిన స్మృతి కర్తలు భిన్నమైన వర్గీకరణము చేసిరి. తల్లిదండ్రుల వల్ల దత్తుని, దత్తుచేసుకొనిని పుత్రుని, గూఢోత్పన్నుని మొదటి వర్గమున జేర్చిరి.

ఆపస్తంబుడు అశాస్త్రీయ (ఇల్లెగితిమతె) పుత్రునికి విరోధి. మహాభారతములో ఈ విధములైన పుత్రుల ప్రశంస కనబడుచున్నది.

కొంతకాలము విభిన్నవర్ణముల వివాహములు నిషేధించబడినవి. ఈ లోపుగా హిందూ సంఘముందు వివిధ పుత్రుల ద్వారా కలిగిన సంతానము చేరినందువల్ల ఎవరు ఏ వర్గమునకు చెందినవారో నిర్ణయించుట కష్టమైపోయినది. ఏమాత్రము అనుమాన మున్ననూ వీరిని శూద్రులుగ పరిగణింప సాగిరి. వేద శాస్త్ర కాలమునుండి హిందు సంఘములో మూలపురుషుని సంతతి వారైన పురుషులు వారి భార్యలు అవివాహితులైన ఆడపిల్లలు కలిసిన సమష్టి కుటుంబములు ఒకే ఇంట్లోవుండి కలిసి భోజనము చేస్తూ వుండి ఒకే కుల దైవము నారాధిస్తూ వుండిరి. ఒక్కొక్క గ్రామములో జీవించుతూవుండము ఆచారమైనది.

ద్వాదశ విధ పుత్రులు

మన ధర్మశాస్త్రములలో ద్వాదశ విధ పుత్రులను గూర్చి వివరాలు చెప్ప బడియున్నవి.

1. ఔరసుడు: ఒక పురుషునికి ఆయన ధర్మ పత్ని యందు కలిగినవాడు
2. క్షేత్రజుడు: ఏదైన కార్యమువల్ల సంతాన విచ్ఛితికాగా పెద్దల అనుజ్ఞతో తన భార్యాద్వారా దేవరుడు మున్నగు వారికి పుట్టినవాడు
3. దత్తుడు: దత్తు చేసుకునిన వాడు
4. కృత్రిముడు: గుణవంతుడని అభిమానించి పెంచుకునిన వాడు
5. గూఢోత్పన్నుడు: భార్యయందు తనకు తెలియకుండా పుట్టినవాడు
6. అపవిద్ధుడు: తల్లి చేగాని తండ్రిచేగాని ఉభయులచే గాని విడవబడగా తెచ్చి పెంచుకొన్నవాడు
7. కానీనుడు: తన భార్యయందు కన్యాత్వమున రహస్యముగా ఇతరునికి పుట్టినవాడు.
8. సహోఢుడు: గర్భిణగానుండగా తెలిసి కాని తెలియకగాని వివాహముచేసుకున్న భార్యకు కలిగినవాడు.
9. క్రీతుడు: తల్లిదండ్రులకు వెలయిచ్చి కొనిన కుమారుడు
10. పౌనర్భవుడు: పునర్భువునందు (విధవయందు) పుట్టినవాడు
11. స్వయం దత్తుడు: తల్లి దండ్రులు లేకకానీ వారి చేవిడువబడినవాడు స్వయముగా వచ్చి కొమారుడైనవాడు
12. జ్ఞాతికేతుడు: జ్ఞాతికొడుకు

వీరిలో మొదటి ఆరుగురు బంధువులును, దాయాదులును అగుదురు. వెనుకటి యార్గురు బంధువులుగా నుందురు గాని దాయాదులు కారని ధర్మశాస్త్రము.[48]

---

[48] వివిధ స్మృతి కర్తలు ఈ కొమాళ్ళ యొక్క అధికారములను గూర్చి చెప్పుటలో కొన్ని అభిప్రాయ బేదములు వెల్లడి చేశారు. అటు తరువాత ఇతర సంఘ కులాచారముల వలెనే ఈ జాబితాలోని కొన్ని వర్గములు కలియుగమున పనికి రావని చెప్పినారు … రచయిత వివరణ.

మన ప్రాచీన భారత సంఘములోని ఉమ్మడి కుటుంబాలలో వివిధ తరగతుల సంతానము ఉండినట్లు స్పష్టముగా తెలుస్తున్నది. వీరికి గల అధికారాలను గూర్చి చెప్పిన ధర్మశాస్త్రాలు ఎంత దూరదృష్టితో నిర్ణయించినవో యని పాశ్చాత్యులు ఆశ్చర్య పడినారు.

బ్రాహ్మణుడు నాలుగు వర్ణముల స్త్రీలను వివాహము చేసికొని వారందరి వలన పుత్రులను కన్న యెడల వారు తమ తల్లుల వర్ణములను బట్టి కాగముల ననుసరించి తమ తండ్రి యాస్తిని పంచుకొనెదరు. ఈ సంబంధ బాంధవ్యముగల వర్ణము వారందరును ఒండొరులకు సపిండులగుచుండుటచే నిర్దిష్టకాలములకు సూతకము[49] పట్టవలయును.

విష్ణుస్మృతి అ 18 శ్లో 1-40, ఆ 222 శ్లో 20-24

మను అ 2 శ్లో 13 ఆ 9 శ్లో 151-154,15-9-160

గౌతమ అ 4 సూ 22-25

యాజ్ఞవల్క్య ఆచారకాండ శ్లో 57,58,132

వర్ణాంతర ప్రాప్తి

మనుస్మృతిలోను గౌతమ ధర్మసూత్రములలోను వర్ణాంతర ప్రాప్తిని గూర్చిన విధి నిషేధములున్నవి.

గౌతమ సూ 172

గౌతమ ధర్మ సూత్రములలో సవర్ణాదులగు అనులోమ జాతులకు ఉత్కర్షముగా తండ్రి ద్వారా ఏడు పురషాంతరములకును అపకర్షముగా మాతృద్వారా అయిదు

---

[49] సూతకం= జాత శౌచము, మృత శాచము.

పురుషాంతరములకును వర్ణాంతర ప్రాప్త మనగా ఇతర వర్ణముగా మారిపోవు స్థితి కలుగునని సూత్రము చెప్పుచున్నది.

ఎట్లనగా బ్రాహ్మణునిచే పెండ్లి చేసికొనబడిన క్షత్రియ స్త్రీ యందు పుట్టిన కన్యక తానుగూడా సవర్ణియగుచున్నది. (అనగా క్షత్రియ కన్యగానే) అ సవర్ణ మరల నింకొక బ్రాహ్మణుని చేత పెండ్లాడబడి కన్యకను కని ఆమె మరల అట్లే బ్రాహ్మణుని పెండ్లాడి కన్యకను కని ఈ విధముగా ఏడు పురుషాంతరములు (తరములు) అగునప్పటికి ఏడవతరంలో పుట్టిన సంతానము బ్రాహ్మణ జాతీయయైనట్టిది కాగలదు. మనుస్మృతి అధ్యాయంలో శ్లోకం 64, 65 లో కూడా ఈ విధి చెప్పబడి యున్నది. ఉదాహరణములో శూద్ర కన్య బ్రాహ్మణుని పెండ్లి యాడుట ఏడు తరములలో సంతానం బ్రాహ్మణ సంతానమగుట చెప్పబడినది. ఈ విధి అనులోమ వివాహమునకే గాని ప్రతిలోమ వివాహమునకు వర్తింపదు. అనులోమ వివాహము శాస్త్ర సమ్మతమైనందువలననే ఈ సూత్రములోని విధియేర్పడినది. కన్యకగాక మగపిల్లవాడు ఏడు పురుషాంతరముల లోనూ బ్రాహ్మణ జాతి సవర్ణుడుగానే ఉండిపోలేడు. అతడు బ్రాహ్మణ స్త్రీని వివాహమాడినచో అది ప్రతిలోమ సంకర సంతానమగుచున్నది. కనుక పై సూత్రము వర్తింపదు. ధర్మ సూక్ష్మమును గమనించినచో మన పూర్వులెంత దూర దృష్టితో కుల వ్యవస్థ విషయమైన కట్టుబాట్లు చేశారో తెలుస్తుంది.

ఈ వర్ణాంతర ప్రాప్తి విధికూడా ఇటీవల స్మృతికర్తలు కలియుగానికి పనికిరాదన్నారు

అయితే వందల కొలది సంవత్సరాలవరకు జరిగిన వివాహాల మాట ఏమిటి? వారికి కలిగిన సంతానం సంగతి ఏమిటి? అనేదానికి సమాధానం లేదు.

నేడు చతుర్వర్ణములలో అసంఖ్యాకములైన కులాలుండుటకిదే కారణమని అంటారు.

హిందూదేశములోని బ్రాహ్మణులు పంచగౌడులు, పంచ ద్రావిడులనే రెండు వర్గాలుగానున్నారు. గౌడ లేక గౌర అనే పదము వంగదేశానికి పేరు. ద్రావిడ అనేది తమిళ దేశానికి పేరు.

పంచగౌడులు:
కన్యాకుబ్జులు
సర్వర్యులు
గౌడలు
సారస్వతులు
మైథిలులు

పంచద్రావిడులు
ఆంధ్రులు
ద్రావిడులు
మహారాష్ట్రులు
కర్ణాటకులు
ఘూర్జరులు

ఈ గౌడులులోను, పంచద్రావిడులలోను ఉపశాఖలున్నవి.

బ్రాహ్మణులు వేద శాఖలను బట్టి కూడా విభజించబడినారు. ఋగ్వేదులు, యజుర్వేదులు, సామవేదులు, అధర్వణవేదులు

అశ్వయాన, బోధాయాన, ఆపస్తంబ సూత్రులనే విభజన మరొకటియున్నది

బ్రాహ్మణులలో అనేక శాఖలున్నవి. నాడు భేదమున్నది.

వైష్ణవులలో కూడా రెండు-వడఘు(వడగలై, వడఘలి), తెంగలి (తెంగలై) అనే రెండు శాఖలున్నవి

అనులోమ సంతానం

	తండ్రి	తల్లి	సంతానము
1	బ్రాహ్మణ	క్షత్రియ	అనుతర మూర్ధాభిషిక్త
2	బ్రాహ్మణ	వైశ్య	అంబష్ఠ
3	క్షత్రియ	వైశ్య	అనువద మాహిష్య
4	బ్రాహ్మణ	శూద్ర	నిషాద
5	క్షత్రియ	శూద్ర	ఉగ్ర
6	వైశ్య	శూద్ర	అనుతర కరణ

ప్రతిలోమ సంతానము

	తండ్రి	తల్లి	సంతానము
1	క్షత్రియ	బ్రాహ్మణ	సూత
2	వైశ్య	బ్రాహ్మణ	వైదేహ
3	వైశ్య	క్షత్రియ	మాగధ
4	శూద్ర	బ్రాహ్మణ	చండాల
5	శూద్ర	క్షత్రియ	క్షత్త
6	శూద్ర	వైశ్య	అయోగన

సంకీర్ణ సంతానము

	తండ్రి	తల్లి	సంతానము
1	బ్రాహ్మణ	ఉగ్ర	ఆశృత
2	బ్రాహ్మణ	అంబష్ఠ	ఆభీర
3	బ్రాహ్మణ	అయోగన	ధిగ్వణ
4	నిషాద	శూద్ర	పుక్కడ
5	శూద్ర	నిషాద	కుక్కుటక
6	క్షత్రియ	ఉగ్ర	శ్వపాక
7	వైదేహ	అంబష్ఠ	వేణ

ప్రాచీన ధర్మశాస్త్రంలో చతుర్వర్ణముల వారికి అనులోమ ప్రతిలోమ సంతానమును గూర్చిన నిబంధనలు ఉన్నవి. అనులోమ సంతానమునకు కర్మాధికారము కూడా ఉన్నది. ప్రతిలోమ సంతానం సంకరజాతులుగా పరిగణించిరి.

బ్రహ్మక్షత్రియ వైశ్యులకు అనులోమజులు 6, ప్రతిలోమజులు 6

వెరసి పండ్రెండు మంది. వీరు ప్రత్యేకముగా నాలుగు జాతుల స్త్రీలయందు నలుగురేసి పుత్రులను కన్నచో 48 భేదములు గల తండ్రులు. 12 మంది కలసి 60 భేదములు. ఈ 60 భేదములకు సంకరముచే నొకక్కటి యరువది చొప్పున అయినచో మొత్తం 3600 భేదములగును. అటుపైన ఇంకా చాలా భేదములు కలవారందరూ శూద్రులని మనువచనము.

షోడశ కర్మలు

(1) గర్భాధానము

(2) పుంసవనము: గర్భ చిహ్నము కలుగగనే
పురుష శిశువు పుట్టవలెనని చేయు కర్మ

(3) సీమంతము: గర్భవతికి ఆరవ మాసమున చేయు కర్మ

(4) జాతకర్మ

(5) నామకరణము

(6) అన్న ప్రాశనము

(7) చౌలము: జుట్టు పెట్టు తలవెంద్రుకలు తీయు కర్మ

(8) ఉపనయనము

(9) ప్రాజాపత్యము: ఒక ఇష్టి

(10) ఔమ్యము: ఒకానొక ఇష్ట

(11) అగ్నేయము: దశాహ కర్మ

(12) వైశ్వదేవము: విశ్వదేవుని గూర్చి చేయు హెూమము

(13) గోదానము

(14) సమావర్తనము: వేదాధ్యయనము తరువాత శిష్యుడు
గురువుగారింటి నుండి తన ఇంటికి వచ్చుట

(15) వివాహము

(16) అంత్యకర్మ

— ✦ ❖ ✦ ——

బ్రాహ్మణేతరోద్యమము I

ఆంధ్ర బ్రాహ్మణేతరుల సమావేశం ఆంధ్ర పత్రిక ప్రజోత్పత్తి సంవత్సర సంచిక

ఆంధ్ర పత్రిక 5-09-1917

"గోదావరి జిల్లా రామచంద్రపురం లో ప్రొఫెసర్ కోడి రామమూర్తి నాయుడు గారి విందు సందర్భంగా జరిగిన బ్రాహ్మణేతరుల సమావేశ వృత్తాంతమును వేరొక చోట ప్రకటించినాము.

ఆ సమావేశమునకు గౌరవనీయులగు రావు బహద్దూర్ కొమ్మిరెడ్డి సూర్యనారాయణ మూర్తి నాయుడు గారు అగ్రాసనాధిపత్యము వహించి త్వరలో ఉత్తర సర్కారుల బ్రాహ్మణేతర సభ జరుపుటకు నిశ్చయం జరిగినది. ఆ సభను సమకూర్చుటకై ప్రయత్నము సలుపుట కొక తాత్కాలిక సంఘ మేర్పడినది. హనుమంత రావు నాయుడు[50] గారు, కొమ్మిరెడ్డి కేశవ మూర్తి నాయుడుగారు ఆ సంఘమునకు సంయుక్త కార్యదర్శులుగా నియమింపబడిరి. సభను దసరా పండుగలలో కాకినాడ పురమందు జరుపుటకు ప్రయత్నం చేసెదరని తెలియుచున్నది. పై సంఘమున కాకర్లపూడి రామచంద్ర రాజ బహద్దర్ గారు, రావు బహద్దర్ [రఘుపతి] వెంకటరత్నం నాయుడు గారు, కొమ్మిరెడ్డి సూర్యనారాయణమూర్తి నాయుడు గారు ప్రొఫెసర్ కోడి రామ్మూర్తి నాయుడు గారు మొదలగు బ్రాహ్మణేతర ప్రముఖులు సభ్యులుగా ఎన్నుకొనబడిరి. ముందు జరుగనున్న బ్రాహ్మణేతర సభ జయప్రదముగాక అని కోరుచున్నాము.

బ్రాహ్మణేతరోద్యమము శాఖోద్యమముల కన్న విశాల దృష్టిని కలిగియున్నది. కమ్మ, రెడ్డి, వెలమ వైశ్య, విశ్వబ్రాహ్మణాది సాంఘికుల సభలు ఆంధ్రదేశమున ననేక దినముల నుండియు జరుగుతూనే యున్నవి. ప్రతి శాఖను తమ సాంఘికుల

---

[50] వీరి పూర్తి పేరు ప్రకటించబడలేదు.బహుశః మండపాక హనుమంతరావు నాయుడు గారైయుండవచ్చు

అభివృద్ధికే పాటుపడ మొదలిడినపుడు జాతీయాభివృద్ధి శీఘ్ర కాలమున జయప్రదముగ గాకపోదని యూహించియే శాఖ సభలనేక మారులు అభినందించి యుంటిమి. కాని ప్రతి శాఖయు తన యభివృద్ధికి మాత్రమే దృష్టినిలుపుచూ జాతీయాదర్శము మరచిన యడల జాతి యైకమత్యమునకు బదులు జాతీయ వైషమ్యం ప్రబలగలదని యూహింపవచ్చును. ఈ సంవత్సరము మునగాల జమీందారు నెల్లూరిలో జరిగిన రెడ్డి మహాసభ యందు దృక్పథప్రదర్శనల గావించియున్నారు. అందుచే నీ శాఖ సభలన్నింటికిని కూడలిస్థానమగు నొక సభ ఏర్పాటుగావించిన యెడల విశాలాశయములు లక్ష్యమునందుండి జాతీయైక్యతకు బలము కలిగించగలవు. అట్టి మహాసభ ఆంధ్ర మహాజన సభయె యని యూహించబడినది. వారి యన్ని సంఘముల వారికిని అన్ని శాఖల వారికిని సమాన వేదిక యగుటచే బ్రాహ్మణేతర శాఖలకు మాత్రము కేంద్ర స్థానముగా నుండు ప్రత్యేక సభ యవసరమని కాన్పించుచున్నది. అందుచే బ్రాహ్మణేతర సభ సమావేశము వాంఛనీయమని వేరుగ నొక్కి వక్కాణించ నవసరములేదు. బ్రాహ్మణేతర మహాసభలో పాల్గొనుటకు క్షత్రియులు మొదలు పంచమ జనుల వరుకును హక్కు గలదు. బ్రాహ్మణులు స్వల్ప సంఖ్యాకులు. వారి ప్రత్యేకావసరములు చర్చించుటకై బ్రాహ్మణ మహాసభ నేర్పరచి బ్రాహ్మణులలో నీ అంతః శాఖా సమ్మేళనమును గావించుటకును, బ్రాహ్మణుల ప్రస్తుత స్థితి నుత్తేజ వంతముగా వించుటకును ప్రయత్నం సలుపవచ్చును. బ్రాహ్మణులను వదిలి వైచిన బ్రాహ్మణేతర సభ మిగిలిన జాతి వారందరకు నుపకరించును. కోయంబత్తూరు సభ యందువలె క్రైస్తవులకు మహ మ్మదీయులను గూడ యందు ప్రాతినిధ్య మొసగినచో దాదాపు హైందవ జాతి యంతయు దేశాభివృద్ధికి కలిసి పనిచేయుటకు నవకాశమేర్పడును. అట్టి ఫలిత మొసగినచో జాతీయాశయములు ఫలప్రదమగు ననుటకు సందియము లేదు. జాతీయ వైషమ్యములు ప్రసిద్ధి చేయుట ఏర్పిడినదని తలచిన దాక్షిణ్య దేశ బ్రాహ్మణేత రోద్యమము కోయంబత్తూర్ మహాసభలో జాతీయాదర్శ మంగీకరించినది. ఆంధ్ర

దేశమున బ్రాహ్మణ- బ్రాహ్మణేతర విభేదములు తీవ్రత చెందలేదు. ఉభయ సాంఘికులును ఉద్యమములన్నిటి యందును కలిసి భ్రాతృభావముతో పనిచేయు చున్నారు. అందుచే ఆంధ్రదేశము నందు దక్షిణ దేశమున జాతీయోద్యమమునందు వైషమ్య చిహ్నము లెంత మాత్రమూ కడసూపవని నిశ్చయించవచ్చును. సంఘ సంస్కరణోద్యమము ఆంధ్రదేశము వర్ణ విభేద తీవ్రత తగ్గించుటకు తోడ్పడినది. బ్రాహ్మణేతరులలో ఒండరులపై నొకరికి ఈర్ష్యా భావము ప్రబలలేదు. ఆంధ్రోద్యమము అన్ని వర్ణముల వారికి సమానవేదిక నొసగి సమరస భావమును వ్యాపింప చేసినది. అందుచేత బ్రాహ్మణ-బ్రాహ్మణేతరోద్యమము ఆంధ్రదేశమున జాతీయ సౌష్టవము నుపాదించుటకు తోడ్పడునని విశ్వసించు అవకాశములు గలవు. ఈ సభ జరుగుట ఏర్పడిన సంఘము నందు ప్రొఫెసర్ కోడి రామమూర్తి నాయుడుగారు సభ్యులు. వీరు జాతీయవాదులు. ఆంధ్రదేశ మహాజనసభా పక్షపాతీయులు ఆంధ్రోద్యమమునందు పట్టుదలగలవారు. ఆంధ్ర మహాసభ చే గౌరవింపబడిన ప్రసిద్ధాంధ్రులు. వీరికి గల ఆంధ్ర రాష్ట్రాభిమానము నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభయందును వ్యక్తమైనది. రావుబహద్దూర్ ఆర్. వెంకటరత్న నాయుడు గారు మరియొకరనవచ్చు"

— ✦ ❖ ✦ ——

బ్రాహ్మణేతరోద్యమము II

చెన్నపట్నంలో 1917 సం॥లో ప్రారంభమైన బ్రాహ్మణేతరోద్యమ సందర్భాల్లో ఏర్పడిన జస్టిస్ పార్టీ వారు శాసనసభ్యులలో అధిక సంఖ్యాక సభ్యులై 1920 సం॥లో మద్రాసు రాజధానిలో ఏర్పడిన ద్వంద్వ ప్రభుత్వములో అధికారం వహించి ఆనాటి మద్రాసు రాజధానిని ఆరేండ్లు పరిపాలించారు. అటు తర్వాత రాజకీయాలలో కొన్ని మార్పులు జరిగిన తరువాత మళ్లీ 1937 సం॥ వరకు పరిపాలించారు.

ఈ రాజకీయ చరిత్రను గూర్చి మన చరిత్ర గ్రంథాలలోను విజ్ఞాన సర్వస్వములోను కనపడుతుంది గాని ఈ బ్రాహ్మణేతరోద్యమం యొక్క పుట్టు పూర్వోత్తరాలను గూర్చిన చరిత్ర, పరిణతి గూర్చిన చరిత్ర కనపడవు. దీనిని గూర్చిన సమగ్ర చరిత్ర రచన అత్యంతావశ్యకము. (1927-28) విభవ సంవత్సరంలో ప్రకటింపబడిన సమదర్శని ఉగాది సంచికలో పండిత శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు జస్టిస్ పార్టీ భూత వర్తమాన భవిష్యత్తులనే వ్యాసంలో బ్రాహ్మణేతర ఉద్యమాల పుట్టుపూర్వోత్తరాలను గూర్చి చక్కగా వివరించారు. బ్రాహ్మణేతరోద్యమము ఉత్తర భారతదేశంలో గాక దక్షిణ భారతదేశంలోనే పుట్టి పెరగడానికి కారణాలు లేకపోలేదు

ఉత్తర భారతదేశంలో మహమ్మదీయ దండయాత్రలు ముందుగా ప్రారంభమైనవి. అప్పట్లో అన్ని కులాల హిందువులను మహమ్మదీయులు నీచంగా చూసేవారు. హిందువులలోని బ్రాహ్మణకులాల వారు కొందరు దక్షిణ దేశానికి వెళ్లిపోవడం ప్రారంభించారు. మిగిలిన వారు జీవనాధారాలు లేక వంట బ్రాహ్మణులుగా, దర్యాకులుగా[51], కూలివారుగా జీవనం చేసేవారు. ఉత్తర భారత దేశంలో బ్రాహ్మణుల ఆచారాలు దక్షిణ భారతదేశంలోని ద్రవిడ బ్రాహ్మణుల ఆచారాలు భిన్నంగా ఉంటాయి. పంచగౌడులలో కొంతమంది మత్స్యమాంసాలు తింటారు అక్కడ బ్రాహ్మణులకు తినే గోధుమ రొట్టెలు చేసేటప్పుడు, భోజనాల్లో కూరలు పప్పులు పులుసులు చేసేటప్పుడు శూద్రులు చూస్తే తప్పులేదు. పంక్తి భోజనాల కారణంగా శూద్రుల దృష్టి దోషం లేదు. శూద్రులు నీళ్లను గంగా జలమని తెస్తే బ్రాహ్మణులుపయోగిస్తారు. నీళ్ళు, ఉప్పు

[51] దర్యాకులు= తమలపాకులు, విస్తరాకులు అమ్ముకునే శ్రమ జీవులు.

కలియకుండా తైల పక్వంగా చేసిన తడిపదార్థాలను శూద్రుడు చేస్తే బ్రాహ్మణులు ఆరగించడానికి అభ్యంతరం లేదు. ఈ ఆచారాలను గూర్చి ఏనుగుల వీరస్వామయ్య గారు 1830-31 సంవత్సరంలో వ్రాసిన కాశీయాత్ర చరిత్రలో చక్కగా వివరించారు.

దక్షిణ దేశంలోని ద్రావిడ బ్రాహ్మణులకు వంటా వార్పులలో శూద్రుల దృష్టి పనికిరాదు. భోజనాల సమయంలో శూద్రులు చూడకూడదు. దక్షిణ దేశంలో పల్లవ, చోళ రాజుల కాలంలో బ్రాహ్మణులకు చాలా పలుకుబడి ఉండేది. ఆ రాజులు ఇచ్చిన బ్రాహ్మణ అగ్రహారాలలోని బ్రాహ్మణులు శూద్రుల దృష్టిలేకుండా తమ కర్మకాండలు జరిగించుకునేవారు.

బ్రాహ్మణులు వేదములను బ్రాహ్మణేతరులకు చెప్పేవారు కారు. శాస్త్రములు పురాణములు మాత్రము చెప్పేవారు. బ్రాహ్మణుల దగ్గర సచ్ఛూద్ర కులాలైన వెళ్లాల వారు కొందరు చదువుకునేవారు. బ్రాహ్మణ అగ్రహారాల వ్యవహారాలన్నీ బ్రాహ్మణులే చక్కబెట్టుకునేవారు. అస్పృశ్యులను అగ్రహారలలోనికి రానిచ్చేవారు కారు. వీరు గ్రామాల వెలుపలనే గరచేరులనే గూడెములలో ఉండేవారు.

దక్షిణ దేశములో బ్రాహ్మణులలోను, బ్రాహ్మణేతరులలో ఉన్నత కుల కుటుంబాలలోనూ కూడా మతాచార పట్టుదల ఉండేది. కుడిఎడమ కులాలని రెండు వర్గాలుండేవి. బ్రాహ్మణులు బ్రాహ్మణేతరుల దృష్టిని సహించకపోవడం, తక్కువ కులాల వారు అవమానకరంగా ఎంచేవారు కారు. అయితే ఎడమ కుల వర్గాల నాయకులైన పంచాణము, పంచబత్తులు కొంత కాలానికి బ్రాహ్మణాధిక్యతను తృణీ కరించి తాము విశ్వబ్రాహ్మణులమన్నారు. మహమ్మదీయ రాజ్యకాలంలో మహమ్మదీ యులు ఇతర మతాల వారి అందరని కాఫిరులుగా పరిగణించి తక్కువగా చూసేవారు. మహమ్మదీయులు హిందువుల కులాచారాలకు ఆటంకాలు కలిగించేవారు కారు.

ఇంగ్లీష్ వర్తకులు దేశానికి వచ్చిన కొత్తలో వారికి మన మతాచారాలు కులాచారాలు వింతగా కనిపడేవి. వారు దేశాన్ని ఆక్రమించి పరిపాలకులైన తరువాత చాలా కాలం వరకు మన మతాచారాలతో జోక్యం కలిగించుకునే వారు కారు. ఆయా కులాల ఆచారాలను మన్నించేవారు. ఇంగ్లీష్ వారి ప్రభుత్వకాలం మనదేశములో కుడిఎడమ కుల తగాదాలు జరిగినవి. 1820నుండి 1827 వరకు చెన్నపట్నం రాజధాని గవర్నరుగా

digavalli1943@gmail.com

పనిచేసిన సర్ థామస్ మన్రో గారు చాలా కాలం కలెక్టరుగా నున్నారు. వారికి మన దేశాచారాలు బాగా తెలుసు. వారు గవర్నరుగా నుండగా దేశీయుల మతధర్మాలలో పూర్వాచారాలను మన్నించాలని కలెక్టర్లకు తాకీదులు పంపించారు. చాలా కాలం వరకు ఇంగ్లీషు కంపెనీ వారు క్రైస్తవ మతబోధకులను రానిచ్చేవారు కారు. ఆయితే వారి ప్రభుత్వం సుస్థిరమైన తరువాత వారిని క్రైస్తవ మత బోధ చేయనివ్వడమే కాక వారికి సర్వవిధాల తోడ్పడడం ప్రారంభించారు.

కంపెనీ వారు రోడ్లు, పబ్లిక్ స్థలాలు అందరూ స్వేచ్ఛగా నుపయోగించ వలెననే సిద్ధాంతం ప్రకారము అస్పృశ్యులను కూడా ఉపయోగించనిచ్చేవారు. ఊరేగింపులలో కుడి-ఎడమల కులాల వారి మధ్య తగాదాలు జరుగుచుండగా పోలీసులను బందోబస్తు చేసేవారు. మొదటినుండి బ్రాహ్మణులకు చదువుకునే అలవాటు ఉండుట వలన మహమ్మదీయుల కాలంలో పారసీ భాషను, ఇంగ్లీషువారి రాజ్య కాలంలో ఇంగ్లీషు నేర్చుకుని నౌకరీలు చేసేవారు. ఈ ఉద్యోగాలతో వారు ఇంగ్లీషు ప్రభు భక్తులుగా నుండేవారు. వీరు కచేరీలలో దొరల కనుగప్పి అవినీతి పనులు సాగించేవారు. వీరు అక్రమాలు చేస్తున్నారనీ, లంచాలు పుచ్చుకుంటున్నారని జనసామాన్యములోని బ్రాహ్మణేతరులు గవర్నర్ కిచ్చుకున్న అర్జీల నకలును జాన్ బ్రూస్ నార్టన్ అనే దొరగారు 1884 సంలో కంపెనీ బోర్డు ఆఫ్ కంట్రోలు సెక్రెటరీకి వ్రాసిన పెద్ద లేఖలో ఉదహరించారు.


అటుతరువాత బ్రాహ్మణేతరులలో కూడా క్రమక్రమంగా విద్యాభివృద్ధి కలిగి ఉద్యోగాలలో చేరారు. వారు కూడా అవినీతి పరులుగానుండేవారు.

ఇంగ్లీషు వారి రాజ్యకాలంలో బ్రిటిష్ సామ్రాజ్యం ప్రభుత్వము చిరస్థాయిగా చేయడానికి ప్రభుత్వాధికారులైన దొరలు కుటిల రాజనీతిని ప్రయోగించి ప్రజలలోని వివిధ వర్గాలను విడదీసి పాలించే పద్ధతిని అవలంబించారు. ఇంగ్లీషు రాజ్య తంత్రజ్ఞుల కుట్రలవలననే హిందూ మహమ్మదీయుల మధ్య తగాదాలు వృద్ధి యైనవి. వారి ప్రోత్సాహం వలననే 1909 సం॥ నాటి మింటో మార్లే రాజ్యాంగ శాసనములో శాసన సభలలో మహమ్మదీయులు ప్రత్యేక ప్రాతినిధ్యము సంపాదించుకున్నారు. 1914సం॥ నాటి ఐరోపా యుద్ధ కాలంలోనే చెన్నపట్నం ప్రభుత్వంలో పని చేసే దొరలు బ్రాహ్మణ

బ్రాహ్మణేతర భేదాలకు దోహదము చేసే అవరోధాలు ప్రజ్వలింప చేశారు. ప్రభుత్వ శాఖలలో బ్రాహ్మణులు ఉద్యోగాలలో అత్యధిక సంఖ్యలో వుండి బ్రాహ్మణేతరుల పట్ల అన్యాయం చేస్తున్నారనే భావము బ్రాహ్మణేతర నాయకులలో ప్రోత్సహించి బ్రాహ్మణేతరోద్యమానికి బీజవాపన చేశారు. ఆ కాలంనాటి పత్రికలు చదివితే బ్రాహ్మణ-బ్రాహ్మణేతరుల మధ్య వైషమ్యాలు ఎలాగా అభివృద్ధి చెందినదో తెలుస్తుంది. అప్పట్లో లోకమాన్య తిలక్ ప్రారంభించిన హోమ్ రూల్ ఉద్యమానికి అనీ బిసెంట్ తోడ్పడి చెన్నపట్నంలో హోమ్ రూల్ సంఘము స్థాపించి న్యూ ఇండియా పత్రిక ద్వారా బ్రిటిష్ నిరంకుశ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ దివ్యజ్ఞాన సమాజ సంఘములో తనకుగల పలుకుబడి నుపయోగించి స్వరాజ్యాందోళన ప్రారంభించింది. అ దివ్యజ్ఞానసమాజ సంఘములో చాలామంది బ్రాహ్మణులు ఉండేవారు. అందువల్ల బ్రాహ్మణేతరులను చేరదీసి వారిని ప్రతిఘటించేందుకు ఇంగ్లీష్ ప్రభుత్వాభిమానులు బ్రాహ్మణేతరోద్య మానికి తోడ్పడినారు. శ్రీ కురుగంటి సీతారామయ్య గారు నవ్యాంధ్ర సాహిత్యవీధులు (1942) బ్రాహ్మణేతరోద్యమం పుట్టుపూర్వోత్తరాలను గురించి వ్రాశారు చూడు 2వ భాగం పుట 280.

జస్టిస్ ఉద్యమం





1914 సంవత్సరం ప్రారంభం చాల ముఖ్యం. ఆ కాలంలో చెన్న పట్నంలో జస్టిస్ వాదమని ఒక వాదము ప్రారంభమైంది. (ఇంతకు పూర్వమే దేశంలో[విభేదాలుకలుగ] డానికి బీజములున్నవి. స్థానిక సంస్థలలో తగాదాలు గ్రామ [కార్యక్రమాలలో] స్వార్థపర [వ్యవహారాలు] వీటికి మూలములు). ఈ ఉద్యమానికి పితలిద్దరు; డా. నాయరు[52], ఆంధ్రుడైన పిట్టి త్యాగరాయ సెట్టి[53] గారు. బ్రాహ్మణులు ద్యోగాలన్నీ

52 డా. టి.ఎమ్ నాయర్ (1868-1919) వైద్యుడు, సామాజిక సంఘసంస్కర్త, రాజకీయ నాయకుడు.
53 పిట్టి త్యాగరాయసెట్టి(1852-1925) ప్రముఖ రాజకీయ నాయకుడు, జస్టిస్ పార్టీ వ్యవ స్థాపకులలో నొకడు.

కాజేస్తున్నారన్న ఆక్రోషంచేత బయలుదేరిన వివాదాలు. క్రమంగా దాని కారణజాతాలు వెనక్కి వెళ్ళినది. ప్రాచీన వేదకాలమునుంచీ కూడా బ్రాహ్మణేతరులకు వేదాలు చెప్పకుండా బ్రాహ్మణుడు వర్ణాశ్రమ ధర్మాలకు నియమాలు వ్రాసియూ అంధకార స్థలను శాశ్వత దాస్యములో పడవేసినాడని, మతమనే పేరుతో అప్పటినుండి యిప్పటి వరకూ వారు వీరిని ఏలుతున్నారని, తుదకు స్వార్థపరులై పూర్వమొకప్పుడు క్షత్రియులై వైదిక కర్మాధికారాలుగల కమ్మ, రెడ్డి మొదలగు ఇతర కులాలవారి క్షాత్రము బ్రాహ్మణులు దొంగిలించినారనీ మొదలైన వాదమును లేవదీసినారు. ఇదే బ్రాహ్మణ-బ్రాహ్మణేతరోద్యమము. ఈ ఉద్యమము దేశాన్నంతా కదిలించి వేసింది. ఏ ఊర్లో చూసినా సభలే! ఉపన్యాసాలే! బ్రాహ్మణ దూషణలే! (ఒక మీటింగ్ చెన్నపట్నంలో స్పర టాంకు అనే చోట జరిగింది. నేను, నామిత్రుడు ప్రయాగ రాఘవయ్య వెళ్ళాము). వీరేశలింగంగారి సంఘ వైరస్యాన్ని చదివిన ప్రజలంతా దీనిలో పడిపోయారు. ఇటువంటి ఉద్యమానికి తానుచేసిన పని కారణమౌతుందని ఆయన ఎప్పుడూ అనుకుని ఉండడు. “ఈ పరిస్థితులు రూపాంతరములతో ఇప్పటికే దేశము నిండా ఉండనే ఉన్నవి ” అని సీతారామయ్యగారు వ్రాశారు పుట287. శ్రీ కట్టమంచి రామలింగా రెడ్డిగారు ఇంగ్లండులో విద్యనేర్చి తిరిగి వచ్చి ప్రకటించిన కవిత్వ తత్వవిచారమనే గ్రంథములో చేసిన సాహిత్య విమర్శలతో పాటు సంఘములోని కులవ్యవస్థను గూర్చిన విమర్శ, సనాతన ధర్మమును గూర్చిన విమర్శ చేయడంలో ఈ బ్రాహ్మణ-బ్రాహ్మణేతరోద్యమ తత్త్వము స్పష్టంగా కనబడుతుంది.

అటు తరువాత కొంతకాలానికి చెన్నపట్నంలో గోఖలే హాలు లో రామాయణ మహాభారతాలను గూర్చి ఉపన్యసిస్తూ రెడ్డిగారు భారతంలోని సంఘ వ్యవస్థ రామాయణం కన్నా పూర్వకాలం నాటిదని శ్రీకృష్ణుడు జన్మ చేతనే ధర్మము విహిత మగుచున్నదని గీతలలో అర్జుననకు బోధించుట అసంగతమని బోయివద్ద బ్రాహ్మణుడు ఆధ్యాత్మిక విద్యను అభ్యసించెను గనుక ఇప్పటివలె గాక అక్కడ సంఘము చాలా ఉదార బుద్ధితో ఉండెనని అర్థం వచ్చే మాటలు చెప్పారు.

దీనిని గూర్చి అక్కిరాజు ఉమాకాంతం గారు విమర్శిస్తూ రెడ్డి గారి ప్రసంగము సొంతముగా చదువగా బ్రాహ్మణత్వాది జాతి భేదములను ఖండించటానికి జన్మ వల్లనే ఒకరెక్కువ ఒకరు తక్కువ అనే భావము నాశనము చేయవలెనని వారి కోరిక యైన్నట్లు దానికి వాఙ్మయ విమర్శ ఒక సాధనము చేసుకొనట్లు స్పష్టపడుతున్నది. జాతి భేదములు తలక్రిందులచేయడం మంచి ఉద్ధేశమైతే కావచ్చును కానీ దానికోసం రామాయణ మహాభారతములు తలక్రిందుల చేయనెంచుట మాత్రము ప్రశస్తమైన పనికాదని వ్రాశారు. మహాభారతమే రామాయణం కన్నా పూర్వ గ్రంథమనే వాదమును ఖండించారు. సాహిత్యవేత్త, విద్యాధికుడైన రామలింగారెడ్డి గారు ఇలాగ సాహిత్య విమర్శలలో బ్రాహ్మణేతరోద్యమం ప్రచారం చేస్తూ వుండగా సామాన్య బ్రాహ్మణేతరులు మొరటుగా బ్రాహ్మణులను దూషిస్తూ ప్రచారం చేసేవారు.

ఆంధ్ర పత్రిక యువ సంవత్సరం[54] సంచికలో కవిత్వతత్వవిచారాన్ని గూర్చిన విమర్శ ఈ సంగతిని స్పష్టీకరించినది.

"గ్రంథకర్త సాహిత్య విమర్శనము కొలది సూత్రములు లోపములు గలదియయ్యు అద్భుతమైనది... వేదాంతమును గూర్చియు, సత్త్వ గుణమును గూర్చియు విమర్శకు నకు ఎఱ్ఱి మొఱ్ఱి అపోహలు కలవు... సాహిత్య విమర్శనమే గాక సంఘ విమర్శనము కూడా గ్రంథమందు ప్రవేశమందినది. గ్రంథకర్త మనువుపై కారములు మిరియములు నూరిపోసినాడు. వర్ణాశ్రమ ధర్మములను చూచి కనులెఱ్ఱ చేసినాడు... ఈ గ్రంథకర్త సంఘ విమర్శనము పుస్తకమునకు రాచ పుండగుతున్నది... సందర్భశుద్ధి లేని మాటల నెట్లో దొల్లించి కుల స్త్రీలపేరున కగ్గిపుల్ల వెలిగించుట యేమి ధర్మము?"

"మనుస్మృతి దెబ్బతగిలిన నాటినుండి ప్రజ ఈవరకు లేవ లేక పడియున్నది. దానిది పరాశ్రయమైన బ్రదుకు. జాతి భేదమువలన శ్రేష్ఠకులులకు తదితరుల పక్షమున మర్యాదయు గౌరవమును కలుగగలదు. శ్రేష్ఠులకు మాత్ర మర్ధింపతగిన చారునియతి[55] ని విద్య దాల్చిన దన్నారు రెడ్డిగారు"

---

[54] యువనామ సంవత్సరం 20వశతాబ్దములో గ్రిగేరియన్ కాలెండరు ప్రకారము 1917 సం.

[55] చారు నియతి = గొప్ప నియమము. నీతివాక్యము నిక్కడ వ్యంగముగా వ్యాఖ్యా నించుట కుపయొగించి నటులున్నది.

digavalli1943@gmail.com

1916 సం॥ నాటికి ఐరోపా మహా సంగ్రామం ప్రారంభమై మన దేశంలోకూడా దాని ప్రభావం బాగా వ్యాపించింది. అప్పట్లో చాలా మంది దొరలు సైన్యంలో చేరినందుకు పెద్ద ఉద్యోగాలలో కొందరు దేశీయులను తాత్కాలికంగా నియమించారు. సహజంగా అందులో బ్రాహ్మలే అధిక సంఖ్యాకులుగానున్నారు. బ్రాహ్మణేతరులు కొద్దిమందికి మాత్రమే పెద్ద ఉద్యోగాలు వచ్చినవి. ప్రతి కార్యాలయాలలోను అరవ అయ్యర్లు, అయ్యంగార్లు తమ శాఖల వారినే అభిమానిస్తారు. తక్కిన వారిని తక్కువగా చూస్తారు. ఇది ఇలా వుండగా మద్రాసు మునిసిపాలిటి కార్పొరేషన్ లలో కూడా ఈ బ్రాహ్మణ బ్రాహ్మణేతర కుల తారతమ్యాలు ప్రారంభమైనవి.

అప్పటికి చాలా కాలంనుండి మద్రాసు కార్పొరేషన్లులలో అయ్యరులు అయ్యంగార్ల ప్రాబల్యం వహిస్తున్నప్పటికీ అధిక సంఖ్యాకులైన వివిధ కులాల బ్రాహ్మణేతరులకు ప్రతినిధులుగా కొందరు ప్రముఖులు సభ్యులైనారు. అందులో అగ్రగణ్యుడు పాత చాకలి పేటలో[56] చిరకాలము నుండి వ్యాపారం చేసే తెలుగు దేవాంగకుల[57] పెద్దైన పిట్టి త్యాగరాయ సెట్టి గారొకరు. వీరేగాక ఇంకా ఇతర ప్రాంతాల నుండి మరి కొందరు బ్రాహ్మణేతర ప్రముఖులు మద్రాస్ కార్పొరేషన్ లో సభ్యులుగా ఉన్నారు. ఎన్నికలలో బ్రాహ్మణ బ్రాహ్మణేతర కులాల వారి సౌకర్యాలను గురించి హక్కులను గూర్చి గట్టి ప్రచారం జరిగింది. చెన్నపట్నంలో కొంతకాలం నుండి స్వతంత్రంగా ఇంగ్లీషు వైద్యుడిగా జీవనం చేస్తున్న మలయాళీ దేశీయుడైన డాక్టర్ నాయర్[58] చాలా తెలివైనవాడు. ఆయన తిరువళికేణి డివిజన్ కు ప్రతినిధిగా ఎన్నుకొనబడిన సభ్యుడు. ఆయన పుర పారిశుధ్య ఆరోగ్య సమస్యల పైన చాలా శ్రద్ధ వహించేవాడు. అప్పట్లో తిరువళికేణి పార్థసారథి స్వామి కోనేరులో అయ్యర్లు, అయ్యంగార్లు తమ బట్టలు ఉతికేవారు. ఇది అనారోగ్య కరమని నాయర్ గారికి తోచింది. దానిని నిషేధిస్తూ

---

56 తొండియార్ పేట, పాత చాకలి పేట (old washerman pet) అను ప్రాంతాలు నేత పరిశ్రమలకు ప్రముఖమైనవి.

57 చేనేత కులవృత్తి గలవారు.

58 Dr. T.M. Nair was a physician and cofounded the South Indian Liberal Federation popularly known as Justice Party.

digavalli1943@gmail.com

కార్పొరేషన్ వారి ఉత్తర్వులు జారీ చేయించాడు. అంతట ఈ అరవ బ్రాహ్మణులుకు ఆయన మీద కోపం వచ్చింది. అప్పుడు జరిగిన ఎన్నికలలో వారాయనకు వ్యతిరేక ప్రచారంచేసి ఓడించారు. నాయర్ గారు అటుతరువాత జరిగిన ఎన్నికలలో స్వశక్తి చేత సభ్యుడై ఈ బ్రాహ్మణులకు బుద్ధి చెప్పటానికి కృత నిశ్చయుడైనాడు.

మలబారు దేశంలో ప్రాంతాలలో కూడా పూర్వాచారాలను బట్టి నాయరు స్త్రీలను నంబూదరీ బ్రాహ్మణులు సంబంధ వివాహాలు చేసుకుంటారు. వారి చేతి వంట వీరు తినరు. గాని ఇంటి పనులు చేయటానికి, పొయ్యి అంటించటానికి. ఎసరు పెట్టటానికి అభ్యంతరం లేదు. గొప్ప కుటుంబాల స్త్రీల ఇండ్లకు నంబూదిరి బ్రాహ్మణులు రాత్రిళ్ళు వెళ్లడము, పిల్లలు కనడము ఆచారముగా జరుగుచున్నది. ఈ నాయరులలో చాలమంది తెలివైనవారు, అక్షరాస్యులే గాక అనేక శాస్త్రములు చదివిన విద్వాంసులుండేవారు. పూర్వము మలబారులో సేనాధిపతులుగా సైన్యములో ఉద్యోగులుగా నుండేవారు. తరువాత కాలంలో ఇంగ్లీషు పరిపాలనలో కూడా నాయరులనేక వృత్తులలలో చేరి ప్రముఖులైనారు. వీరిలో గొప్ప వైద్యులు కళాకారులున్నారు. అన్ని విషయాలలో వీరు బ్రాహ్మణులతో సమాన గౌరవం పొందిరి. మలబారులో ఇతర కులాల వారందరిలోనూ అగ్ర గణ్యులైనారు.

నాయరులకు బ్రాహ్మణుల మంచి చెడ్డలు బాగా తెలుసు. మలబారు దేశ సరిహద్దులలో నున్న పట్టరులనే అయ్యర్లను నాయర్లు ద్వేషిస్తారు. దానికి కారణము ఈ పట్టర్లు వారిని తక్కువగా చూడటమే. చెన్నపట్నంలోని హోటళ్ళల్లో అనేక మంది నాయర్లు వంట వడ్డన పనిలో చేరారు. ఇతర ప్రాంతాలలో కూడా నాయర్లు అనేక వృత్తులలో ఉద్యోగాల్లో ప్రముఖులైనారు.

దక్షిణ దేశంలోని వెళ్లాలా వారు వ్యవసాయమే కులవృత్తిగా కలవారు వారు. బ్రాహ్మణాచారాలు అవలంబిస్తారు. వారిలో చాలామంది తమిళ విద్వాంసులున్నారు. అందువల్ల సింహళములోని మహా వంశమైన కృష్ణ బ్రాహ్మణులని వారిని పేర్కొన్నారు. వీరు శైవ మతావలంబులై స్నానం చేసి భస్మము దాల్చిశుచి శుభ్రం కలిగి ఉండేవారు.

వీరిని మూదలియార్లు లేక మొదలియారులని సచ్ఛూద్రకులాల వారిలో అగ్రగణ్యులని వ్యవహరిస్తారు.

మొదలియారులలో చాలామంది ఇంగ్లీషు వారి రాజ్య కాలంలో దుబాషీలుగా పని చేశారు. చెన్నపట్నంలో చాలామంది ప్రముఖులున్నారు. పూర్వం చెన్నపట్నంలో ఇంగ్లీషు కంపెనీ వారి కార్యకాలంలో కాంట్రాక్టులు చేసి ఉద్యాగాలు చేసి అనేక దానధర్మాలు చేసిన పచ్చయప్ప గారు ఆగముడయ మొదలియారు. వారు తెలుగువారే. అరవ దేశంలో వెళ్లాలవారిలో వడుగ వెళ్లాలవారందరూ తెలుగు శాఖ వారు.

చెన్నపట్నం కార్పొరేషన్ సభ్యుల్లో కొందరు మొదలియార్లు ఉన్నారు. నాయరు గారు తమ ఎన్నిక సభలలో బ్రాహ్మణుల మత ధర్మాలను ఆచారాలను వారి లోటు పాట్లను విమర్శిస్తూ మాట్లాడేవారు. అంతటితో ఊరుకోక ఆయన చెన్నపట్నంలోని బ్రాహ్మణేతర ప్రముఖులను చేరదీసి ఒక సంఘ సభ నేర్పరచి వివిధ స్థాయిలలో బ్రాహ్మణాధిక్యతను ధిక్కరించాలని నిశ్చయించారు.

చెన్నపట్నం లోని ప్రభుత్వ కార్యాలయములలో బ్రాహ్మణులలో హెచ్చు ఉద్యోగాలు, పదవులు గలవారు బ్రాహ్మణేతరులను చేరనివ్వక పోవడము, తక్కువగా చూడడము మొదలైన విషయాలను గూర్చి చర్చించి దాని విషయమై ఆందోళన జరిపించి ప్రభుత్వానికి తెలిపి న్యాయం పొందాలని ప్రచారం చేశారు. నాయరు గారు తన ఉద్దేశాలను గూర్చి ప్రముఖ బ్రాహ్మణేతర కార్పొరేషన్ సభ్యుడైన పిట్టి త్యాగరాయ సెట్టి గారికి చెప్పి వారి సహకారము పొందగలిగినాడు. త్యాగరాయ సెట్టి గారికి చెన్నపట్టణం ప్రజల్లో చాలా పలుకుబడి వుండేది. ఆయనను ప్రభుత్వం వారు కూడా గౌరవించేవారు. ఆయన పట్ట పరీక్ష ప్యాసైనా ఉద్యోగం చేయక వ్యాపారము, ప్రజాసేవ చేసేవాడు. పెద్ద ఉద్యోగం చేసే దొరలు కొందరు ఈయన కృషికి సంతోషించి మద్దతు చేస్తూ ప్రోత్సహించేవారు.

బ్రాహ్మణేతరులకు జరుగుతున్న అన్యాయాలను గూర్చి గట్టిగా ప్రచారం చేయడానికి ఇతర పత్రికలవారు తగిన ప్రోత్సాహం ఇవ్వనందున ఒక ప్రత్యేక పత్రిక వుండాలని ఇంగ్లీషులోనూ అరవములోను, తెలుగు భాషలలోనూ పత్రికలు స్థాపించాలని

బ్రాహ్మణేతరుల క్షేమ సమాచారాలను గూర్చి కృషి చేయడానికి ఒక సంఘము వుండాలని ఆయన ప్రచారం చేసి దానికోసం సంపన్నులైన బ్రాహ్మణేతర జమీందారులను, భూస్వాములను, వర్తకులను ప్రోత్సహించి చందాలు వేయించాడు.

1916 సం॥ డిసెంబరు నెలలో South Indian Peoples Association అనే ఒక లిమిటెడ్ కంపెనీని స్థాపించాడు. ఇంగ్లీషులో జస్టిస్ పత్రికను స్థాపించి ముందుగా తానే నడపటం ప్రారంభించినాడు. అటు తరువాత ప్రతిభావంతులైన యువకులను పత్రిక సంపాద కత్వానికి నియమించాడు. అరవములోను, తెలుగు లో కూడా పత్రికలు స్థాపించారు.

1917 సం॥లో South Indian Labour Federation అనే ప్రజాసంఘం స్థాపించారు దానికి పిట్టి త్యాగరాయ సెట్టి గారు కార్యదర్శి.



1917 సం॥ఆగస్టు నెలలో చెన్నపట్టణంలో బ్రాహ్మణేతర మహాసభ కాన్ఫరెన్స్ జరపడానికి ఏర్పాటు చేశారు. దానికి అధ్యక్షునిగా శ్రీ పానుగంటి రామారాయనిం[59] గారిని ఎన్నుకున్నారు. ఆయన ఎంఏ పట్టభద్రుడు. వెలమ జమీందారీ వంశస్థుడు. ఆంధ్రుడు. ఆయన దానిని ... బ్రాహ్మణేతరుల సమస్యలను విచారించి కర్తవ్యాన్ని సూచించారు.

అటు తరువాత మద్రాసు రాజధానిలో వివిధ ప్రాంతాలలో బ్రాహ్మణేతర సభలు జరుపడానికి నిశ్చయించారు. అరవదేశంలో కోయంబత్తూరు, సేలం, తిరునల్వేలిలో జరిపారు.

ఆంధ్రప్రదేశంలో బిక్కవోలు, బెజవాడలోనూ, రాయలసీమలోని పులివెందులలోను, సభలు జరిపారు. అక్కడ బ్రాహ్మణేతర నాయకులు మహోపన్యాసాలు ఇచ్చారు. కృష్ణా, గుంటూరు జిల్లాలలో ఇంతకుముందు గానే కమ్మ మహాజన సభలలో నాయకత్వం చేస్తున్న వారు బ్రాహ్మణేతర ఉద్యమంలో చేరారు. బెజవాడ ప్లీడరు రావు

[59] పానుగంటి రామారాయనిం K.C.I.E (1866-1928).

బహద్దూర్ కోవెలమూడి గోపాల కృష్ణయ్య గారు ఈ ఉద్యమంలో నాయకత్వం వహించిన తరువాత జస్టిస్ పార్టీలో ప్రముఖ పాత్ర వహించాడు విజయవాడ తాలూకాబోర్డు అధ్యక్షుడుగాను, మద్రాసు శాసనసభ సభ్యుడుగా చాలా ప్రాముఖ్యత వహించాడు.

ఆ కాలంలో బ్రాహ్మణ ఉద్యమం నాయకులు కొంతమంది కూత కరణాలు కొంతమంది వ్రాత కరణాలు వుండేవారు. ఉపన్యాసాలు ఇచ్చేవారు. సభా వేదిక లెక్కి బ్రాహ్మణులను దూషిస్తూ మాట్లాడేవారు. పూర్వము బ్రాహ్మణులు కులాధిక్యతకోసం వారు చేసిన అన్యాయములు పురాణేతిహాసాలలో వారి అభిప్రాయము తెలిపే ఘట్టాలు, ధర్మశాస్త్రాలలో బ్రాహ్మణాధిక్యతను దోహదంచేస్తూ బ్రాహ్మణేతరులకు అన్యాయంగా పక్షపాత బుద్ధితో వేసిన విధి నిషేధాలు, బ్రాహ్మణేతరులను నీచంగా వర్ణించే సందర్భాలను ఏకరువు పెట్టేవారు. ముఖ్యంగా మనుస్మృతిలోని విధి నిషేధాలలో శూద్రులను గూర్చిన విధి నిషేధాలను దుర్మార్గులైన బ్రాహ్మణులే కల్పించారనేవారు.

ఆకాలంలో మన పురాణేతిహసాలను, ధర్మశాస్త్రాలను జాగ్రత్తగా చదివి అందులోని నీతి ధర్మాలను అర్థవాదములను, అంతరార్థాలను ఆర్థంచేసుకున్న వారు లేరని చెప్పవచ్చును. ఉపన్యాస వేదికలపైన చాలా తీవ్రంగా ఆవేశపూరితంగా తిట్ల పంచాంగాలు విప్పేవారే అధిక సంఖ్యకులు. ఇక రచయితలలో కొలది మంది చదువుకున్నవారు, కవులు విద్వాంసులు తమ తెలివితేటలను ఉపయోగించి మన వేద శాస్త్ర పురాణేతిహాసాలకు, ధర్మశాస్త్రాలకు అపార్థాలు కల్పించి క్రైస్తవ మిషనరీలు, వీరేశలింగం గారు చేసిన విమర్శలు, ఖండనలు, దూషణలను ఉపయోగించుకొంటూ కొన్ని వ్యాసాలు వ్రాసేవారు గ్రంథాలు కూడా రచించేవారు.

ప్రతిభాశాలురైన కట్టమంచి రామలింగారెడ్డి గారు, త్రిపురనేని రామస్వామి చౌదరి గారు చాలా అపూర్వ రచనలు చేశారు. రామలింగా రెడ్డి గారు పైకి చాలా నిష్పక్షపాతంగా వ్రాస్తున్నట్లుగా నటిస్తూ బ్రాహ్మణులను కించ పరచడానికి రామాయణమును, మహా భారతమును, భగవద్గీతనుకూడా ఉపయోగించేవారు. రామస్వామి చౌధరిగారు బాహటంగా బ్రాహ్మణులను, వారి గ్రంథాలను, ప్రాచీన సాహిత్యాన్ని తారుమారు చేస్తూ నకలు గ్రంథాలనే వ్రాశారు. ఇక దుగ్గిరాల రాఘవచంద్రయ్య అష్టాదశ మహా పాపియగు

బ్రాహ్మణునితో సహాయ నిరాకరణ చేయమని తెలుగులోను, ఇంగ్లీషులోను కొన్ని వందల పుటల గ్రంథాలు వ్రాశారు.

ఇంగ్లాండులోని ఉదార రాజనీతిజ్ఞులు మొదట నుండి భారతీయుల పట్ల కొంత ఉదార భావాలు కలిగి ఉండేవారు. చర్చిల్ గారి వంటి టోరీ రాజ నీతజ్ఞులును భారతదేశంవల్ల లాభాలు పొందే వర్గం వారును భారతీయ జాతీ యోద్యామానికి వ్యతిరేకంగా నుండేవారు. భారతదేశంలో పెద్ధ పెద్ధ ఉద్యోగాలుచేసే సీనియర్ తెల్ల దొరలందరు జాత్యాహంకారము గలవారు గానే వుండి దేశీయులు పాలితులు తాము పాలకులమనే భావముతో ప్రవర్తించేవారు. భారతదేశంలో కాంగ్రెస్ నాయకులు మితవాదులుగా నున్నంతకాలం ఇంగ్లండులో దొరలు దానిని సహించారు గాని అతివాదుల వర్గం వారు బయలుదేరగానే వారికి కాంగ్రెస్ పట్ల విరోధ భావాలు ప్రబలినవి. ఇక ఐర్లాండ్ దేశ స్వాతంత్రోద్యమమును అనుసరించి మన దేశంలో కూడా ఇంగ్లీషు వారిపైన బాంబులు వేయడం ప్రారంభమైన తర్వాత ఇక్కడి సీనియర్ తెల్లదొరలకు అందరి పట్ల విరోధ భావము, అసహ్య భావము ప్రబలినవి. విడదీసి పాలించమనే బ్రిటిష్ రాజ్య విధానమును అనుసరించి వివిధ వర్గాల వారిని విడదీసి పాలించడంలో అందెవేసిన చేయిగా నుండేవారు. వీరిలో మద్రాస్ లో సీనియర్ ఐ సి యస్ ఉద్యోగ యైన అలెగ్జాండర్ కార్ డ్యూ[60] అనే అతడును మరి కొందరును బ్రాహ్మణేతరోద్యమానికి దోహదం చేశారు. ఆ కార్డ్యూ దొర తరువాత గవర్నరు కార్యలోచన సభలో సభ్యుడైనాడు. 1919 సం॥లో ఆక్టింగ్ గవర్నరైనాడు.

మాంటేగు[61] గారు రాజ్యాంగ కార్యదర్శియై 1917 సం॥ ఆగస్టు 20 తేదీన భారత దేశానికి క్రమానుగత భాద్యతాయుత పరిపాలన యొసగదునని చేసిన ప్రకటన ఇంగ్లండులోని టోరీ రాజకీయ నాయకులకు భారతదేశములోని పెద్ధ ఉద్యోగులైన దొరలకు ఇష్టములేదు. అందువల్ల దానికి వీలైనన్ని ఆటంకాలు కలుగ చేయడానికి ప్రయత్నించారు. దీని ఫలితంగానే మద్రాస్ లో బ్రాహ్మణేతరోద్యమం ప్రబలినది. రాజ్యాంగ సంస్కరణాల రిపోర్ట్ తరువాత బ్రాహ్మణేతరుల పక్షాన జస్టిస్ పార్టీ ద్వంద్వ.

60 అలెగ్జాండర్ కార్డ్యూ (1861-1937).
61 ఎడ్విన్ శామ్యూల్ మాంటేగు (1879-1929).

ప్రభుత్వంలో స్థానం కలిగించడానికి తోడ్పడడం జరిగింది. మద్రాస్ లోని బ్రాహ్మణేత్రోద్యమాన్ని గూర్చిన విశేషాలు కొన్ని 1918 సంవత్సరం నాటి కలకత్తా మోడ్రన్ రివ్యూ లో పత్రికలో ప్రకటింపబడి ఉన్నవి.

మద్రాస్ రాజధానిలోని బ్రాహ్మణేతరులు, అస్పృశ్యులు అనే శీర్షిక క్రింద 1918 ఫిబ్రవరి సంవత్సరం సంచికలోని సంపాదకీయ నోట్స్ లో (పుట234) కొన్ని సంగతులు ప్రకటింపబడినవి. ఉత్తర భారతదేశంలోవలె గాక దక్షిణ దేశ బ్రాహ్మణులు దృష్టి దోషమునకు ప్రాధాన్యమిచ్చి బ్రాహ్మణుల వంట బ్రాహ్మణేతరుల దృష్టి పడిన చోట మైల పడుననే దురాచారం పాటిస్తారని దీనివల్ల చాలా బాధలు కలవని సర్ పి. సి. రె గారొక సందర్భములో చేసిన విమర్శనుల్లేఖించి United India and Indian States[62] అనే పత్రికలో ప్రకటింపబడిన పాలఘాట్ పట్టణంలోని ఒక సంఘటనను గూర్చిన వివరాలు ప్రకటించి దానిని గూర్చి మోడరన్ రివ్యూ సంపాదకుల అభిప్రాయం ప్రకటించారు. మలబారులోని అస్పృశ్యులైన ఎలవులు[63], చెరుమలు వీధులలో స్వేచ్ఛగా తిరగరాదు. కొన్ని నెలల క్రిందట వారు పాలఘాట్ హోమ్ రూల్ లీగ్ యొక్క బ్రాహ్మణ అధ్యక్షునికి ఒక విన్నపం పంపి పాలఘాట్ లోని వీధులలో తాము స్వేచ్ఛగా తిరిగె హక్కు కలిగించు కోడానికి తోడ్పడవలసిందని ప్రార్థించారు. అంతట ఆ బ్రాహ్మణ పెద్దమనుష్యుడును ఆయన స్నేహితులును ఈ అస్పృశ్యులకు తోడ్పడుటకు నిశ్చయించి వారితో కలిసి ఆ వీధులలో ఊరేగింపుగా వెళ్ళారు. అంతట అక్కడ బ్రాహ్మణేతరులకు ఆగ్రహం కలిగింది. వారు ఒక అసమ్మతి సభ జరిపి ఉన్నత బ్రాహ్మణేతర కులాలవారమైన మాకు ఇది అవమానకరముగా నున్నదనీ, దీన్నివల్ల చాలా బాధ కలిగినదని ప్రభుత్వానికి మహజరు పంపించారు. తరువాత కొద్ది రోజులకు అస్పృశ్యులు తమ బ్రాహ్మణ మిత్రుల తోడు లేకుండానే స్వతంత్రంగా ఆ వీధులలో ఊరేగింపుగా నడచి వెళుతూవుండగా పైన చెప్పిన ఉన్నత కులాల బ్రాహ్మణేతరులు వచ్చి దౌర్జన్యం చేసి చావ కొట్టారు. దానిపై అస్పృశ్యులు వారి మీద క్రిమినల్ కేసులు పెట్టారు. అవి పెండింగుగా యున్నందువల్ల దాని గురించి తామేమీ అభిప్రాయం ప్రకటింప దలపలేదనినీ అయితే ఈ సంగతుల

---

62 December 21,1918 The Palghat anti-untouchability movement.

63 ఎలవులు Elavan or Ilavan (ఎజవ Ezhava) కేరళ లో వెనుకబడిన కులాలు ఇప్పటికినీ వున్నవి.

వలన నేర్చుకోదగ్గ పాఠమును గూర్చి మాత్రం వ్రాశామని చెప్పి నాయర్ గారును వారి ఉపగ్రహ నాయకులైన సహచరులను పంచములదుస్థితిని గురించి మొసలి కన్నీళ్ళు కారుస్తూ వుంటారని వారి పక్షాన పోరాడటానికి బ్రాహ్మణుల పైన కత్తి దూయటానికి సిద్ధ పడుతూ వుంటారనిగాని సాక్షాత్తుగా ఆచరణ వచ్చేటప్పటికి మాత్రము పంచములను, బ్రాహ్మణుల కన్నా నికృష్ఠంగా చూస్తారని వ్రాశారని మోడ్రన్ రివ్యూ సంపాదకీయం బ్రాహ్మణుల పట్ల గాని, బ్రాహ్మణేతరుల పట్ల గాని, పంచముల పట్ల గాని పక్షపాతం వహించమని తోటి మానవుని సమానంగా చూడని మానవుడు మానవుడు కాడని మాత్రం చెపుతామని వ్రాశారు.

1918 సం॥ జూన్ నెల మోడరన్ రివ్యూ సంపాదకీయం నోట్స్ పుట 685 లో డాక్టర్ నాయర్ గారు ఇంగ్లాండ్ పర్యటనలు అను శీర్షిక లో క్రింద విషయం ప్రకటించారు



మాంటేగు గారు 1917 ఆగస్టు 20వ తేదీన చేసిన ప్రకటన ప్రకారం ఏవిధమైన రాజ్యాంగ సంస్కరణలు ప్రసాదించ వద్దని ఇంగ్లాండు లోని రాజకీయ నాయకులకు నచ్చ చెప్పగలందులకు డాక్టర్ టి.ఎమ్ నాయర్ గారు ఇంగ్లాండ్ వెళ్లడానికి పాస్ పోర్టు నివ్వడమునకు తమ తీవ్రమైన అసమ్మతిని ప్రకటించుటకు మద్రాసు నగర పౌరుడు శ్రీ బయ్యా నరసింహ శర్మ[64] గారి అధ్యక్షత క్రింద మద్రాసు గోఖలే హాలు లో సభ చేశారని ఈ దిగువ తీర్మానాన్ని చేశారని అసోసియేటెడ్ ప్రెస్ సంస్థ తంతి వార్త పంపినారని ఆరోగ్య కారణముల వల్ల పాస్ పోర్ట్ ఇవ్వడానికి అంగీకరించి నట్లు ప్రభుత్వంవారు చెపుతున్నారని కామన్సు సభలో

---

[64] బయ్యా నరసింహ శర్మ K.C.S.I(1861-1932). పైన ప్రకటించిన వీరి ఛాయ చిత్రము ఫేస్ బుక్ లో Ancient Vizagapatnam అను పేజిలో 27-02-2021తేదీన పోస్టు చేశారు. వారి సౌజన్యముతో. వీరు 1914 సం స్థాపింపబడిన విజ్ఞాన చంద్రికా మండలి మేనేజ్మెంట్ కమీటి ఆధ్యక్షు డుగానుండిరి. విజ్ఞాన చంద్రికా మండలి Memorandum of Association చూడు ఈ సంపుటిలోనే విజ్ఞాన చంద్రికా మండలి.

రాజ్యాంగ కార్యదర్శి పక్షాన ఫిషర్[65] గారు చేసిన స్టేట్మెంట్ ఈ పరిస్థితులలో ఎంత మాత్రము సబబుగా లేదని అది జాతీయోద్యమానికి భంగకరమని ఆయన అక్కడ బలవంతులైన తన మిత్రుల తోడ్పాటుతో అక్కడి రాజకీయ నాయకులలో హెూంరూల్ కు వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి వెళ్ళదలచినారని క్రిందటి నెలలో అనేక సభలలో ఉపన్యసించి యున్నారని తన జస్టిస్ పత్రికలోకూడా ప్రకటించియున్నాడ నిన్ని అందువల్ల ఆయన కిచ్చిన ప్యాస్ పోర్టులను వెంటనే రద్దు చేయాలని ఈ సభ వారు కోరుతున్నారని తీర్మానించారు. మాంటేగూ గారి రాజ్యాంగ సూచనలు త్వరలో విడుదల కానున్నవి గనుక భారతదేశ ప్రజా ప్రతినిధులందరూ ఇంగ్లాండ్ పోవడానికి అనుజ్ఞ ఇవ్వాలని కూడా తీర్మానించినారు. ఈ తీర్మానాల ప్రతుల ఇంగ్లాండ్ ప్రధాన మంత్రికి, రాజ్యాంగ కార్యదర్శికి, ఇండియా వైస్ రాయికి, మద్రాసు గవర్నరుకు తెలియపరచడానికి అధ్యక్షులకు అధికారమిస్తూ తీర్మానించినారు.

--- మోడరన్ రివ్యూ పుట 685

— ✦ ❖ ✦ ——

[65] హెచ్ ఎల్ ఫిషర్ (1865-1940) బ్రిటిష్ ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి. మాంటేగు దొర సమకాలీకుడు., మిత్రుడు.

digavalli1943@gmail.com

బ్రాహ్మణేతరోద్యమము III



రఘుపతి వెంకటరత్నం నాయుడు[66] గారి ముఖ్యులలో నొకరైన కామరాజు హనుమంతరావు గారు స్వీయచరిత్ర సమీక్ష అనే గ్రంథంలో ఇలా వ్రాశారు (1973). ముఖ్యముగా రాజకీయోద్దేశ్యంతో కొన్ని కులముల వారు బ్రాహ్మణేతరోద్యమమును ఆంధ్రదేశ మున చేపట్టి దాని విస్తరణ కొరకు బ్రాహ్మణేతర సంఘమును ఒక కాలమున స్థాపించిరి. బ్రాహ్మణులు తప్ప తక్కిన హిందూ కులస్థులందరిని వర్ణభేదములు విసర్జించిన వారిని, ఇతర మతస్థులను ఆ సంఘములో చేర్చుచుండిరి. అందు చేరుడని వెంకటరత్నం నాయుడుగారిని గూడా అడిగిరి. ఆయన అంగీకరించి బ్రాహ్మణేతర సంఘమున సభ్యులైరి. నాయుడుగారు ఆ సంఘమును చేరుట తగదని తలచి అనుష్ఠానికులును అగు కాకినాడ బ్రహ్మ సమాజ సభ్యులు పదునేడుగురు వేమూరి రామకృష్ణారావు, మతుక మల్లి సుబ్బారావు, పెద్దాడ రామస్వామి, వి.డి. రాజు[67], కామరాజు హనుమంత రావు, గుడిపాటి వెంకటచలం, అత్తిలి సూర్యనారా యణ, వాడ్రేవు రామ్మూర్తి, వేదాంతం వెంకటకృష్ణయ్య గారు మొదలైన వారు కలిసి ఈ క్రింద పొందుపరిచిన విజ్ఞప్తిని నాయుడు గారికి పంపిరి.

మహారాజశ్రీ కాకినాడ బ్రాహ్మసమాజ అధ్యక్షులగు రావ్ బహదూర్ రఘుపతి వెంకటరత్నం గారికి కాకినాడ బ్రహ్మ సమాజ సభ్యులగు మేము ప్రేమ పూర్వకముగా తమకు విశదపరచడం ఏమనగా కుల వివక్షతతో సంబంధించినట్టియూ, సంకుచితమై నట్టియూ బ్రాహ్మణేతరోద్యమంలో మీరు ఐక్యం చేసుకొని పాటుపడుట వర్ణభేదము పొందని ఉదార బ్రాహ్మ ధర్మమునకు విరుద్ధముగనున్నదని మా అభిప్రాయము. తదుద్యమముతోడి తమ సంబంధము ఆంధ్ర దేశమందలి బ్రహ్మ సమాజమునకు చాలా హానికరమగుచున్నది. కావున బ్రాహ్మణేతరోద్యమంతో తమరు సంబంధం వదలుకొనవలెనని మా ప్రార్థన. ఈశ్వరుడు మనకు తోడ్పడు గాక.

కాకినాడ 04-12-1917 ఇట్లు

తమ ఆత్మబంధువులు

---

66 దివాన్ బహద్దూర్ రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు (1862-1939).

67 వి.డి. రాజు=వేమూరి డామినిక్ రాజు (డేనియల్ రాజు).

నాయుడు గారు దీనిని అందుకొని తాము వర్ణభేదం పాటింపనివారమనీ తమ జీవితం ద్వారా అందరికీ తెలిసిన విషయమే కావున తాము బ్రాహ్మణేతర సంఘము చేరుటచే వర్ణభేదం పాటించుచున్నట్లు తలచుటకు ఎవరికి భావ్యము కాదని నచ్చచెప్పుటకై ఒక ఇన్ఫార్మల్ సభకు సభ్యులను 15-12-1917 తేదీన ఆహ్వానించిరి. అందరూ సమావేశ మయిరి. అప్పటికి నాయుడు గారు తెలగ సంఘమున కూడా చేరారని సభ్యులకు తెలియవచ్చినది. ముందుగా వాదము నాయుడు గారు వినగోరిరి. వాటిని ప్రశ్నోత్తర ములు క్రింద చేర్చటమైనది. (పుట181)

[వర్ణభేదము]మాపుటకై పూనుకొన్న బ్రహ్మసమాజములో పుట్టుకను బట్టి నిర్మింపబడు నెట్టి కులమం దైనను జేరుటకు కులనామములను, కుల చిహ్నములగు జందెము మొదలైనవి ధరించుట వర్ణ వ్యవస్థ నిలబెట్టుటయె అని వాదించిరి. మరియు వర్ణ భేద పిశాచము వారికి అన్ని వర్ణముల వారు నేడు లోనైయుండగా బ్రాహ్మణులను మాత్రము మినహాయించి తక్కిన వర్ణస్థుల నేకము చేసి అభివృద్ధినొందించుటకై బ్రాహ్మణేతరులు ఒక ప్రత్యేక సంఘము నిర్మించ బూనుట ద్వేషమువలన కాదా యనియు కొందరు. వాక్రుచ్చిరి.

నాయుడుగారు వర్ణ హద్దులు దాటి చరించువారు కుల నామములు, కుల చిహ్నములను నామమాత్రముగ ధరించి కుల సంఘములందు జేరుట వలన వర్ణభేదము పాటించువారేయని నిరూపింప తగదు. బ్రాహ్మణేతర సంఘ నిర్మాణ మునకు కారణము ద్వేషము కాదని నొక్కి చెప్పిరి (పుట 182). సభ్యులు నాయుడుగారి సమాధానములతో తృప్తినొందరైరి. సభ ముగిసెను.

నాయుడు గారు బ్రాహ్మణేతర సంఘములో చేరిన దాని ఫలితముగా జస్టిస్ పార్టీ మంత్రివర్గము ముఖ్యమంత్రి యైన రామారాయనిం గారు నాయుడు గారిని 1925 సం॥లో మద్రాస్ విశ్వవిద్యాలయ యుపాధ్యక్ష పదవికి నిలబెట్టి గెలిపించారు. వారు 1928 వరకు ఆ పదవిలో ఉన్నారు. ఆయనకు డి.లిట్. ఎల్.ఎల్.డి గౌరవ బిరుదు లివ్వబడినవి. బ్రిటిష్ ప్రభుత్వం వారు వీరికి దివాన్ బహదూర్ బిరుదమున్నూ, సర్ బిరుదున్నూ ఇచ్చారు.

— ✦ ❖ ✦ ——

అమరావతి శేషయ్య శాస్త్రి గారు
(1829-1900)

శ్రీ శేషయ్య శాస్త్రి గారు ఇంగ్లీషు రాజ్యకాలంలో మద్రాసు రాజధాని లోని తమిళ ప్రాంతంలో కుంభకోణం పట్టణం దగ్గర ఉన్న వెట్టార్ నది దక్షిణ తీరాన గల అమరావతి అనే గ్రామంలో 1829 సం॥లో ఒక బీద బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన బాల్యంలో ఆ ఊరిలోని వీధి బడిలో తమిళ వ్రాతకోతలు లెక్కలు నేర్చుకున్నారు. తరువాత కుంభకోణంలో దొరలకు దేశీయ స్త్రీలకు పుట్టిన యురేషియన్ జాతి సంతతి దొరల దగ్గర కొద్దిపాటి ఇంగ్లీషు నేర్చుకున్నారు. చెన్నపట్నంలో క్రైస్తవ మత ప్రచారకులు 1835 సం॥లో స్థాపించిన ఇంగ్లీష్ పాఠశాలకు ఇంగ్లాండ్ నుండి 1837 ఫిబ్రవరి 22 తేదీన కొత్తగా వచ్చిన జాన్ ఆండర్సన్ (John Anderson) అనే చర్చి మిషనరీ సొసైటీకి చెందిన క్రైస్తవ యువకుడు ఆ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా వచ్చినాడు. అతను అప్పట్లో నల్ల వారి బస్తి అని నేటివుల జార్జి టౌన్ అని వ్యవహరింపబడే పేటలో ఆర్మేనియం వీధిలో రెండు అంతస్తుల మేడలోనికి మార్చిన ఆ పాఠశాలలో ఇంగ్లీషు తమిళం తెలుగు భాషల్లో చదువు చెబుతామని చరిత్ర, భూగోళ శాస్త్ర సంగ్రహాలు, ఆర్థిక శాస్త్రం నీతి మత ధర్మాలు బోధిస్తామని ప్రకటించాడు. తమిళము, తెలుగు బోధించడా నికి ఇద్దరు పండితులను నియమించాడు. ఈ పాఠశాల స్థాపించడంలో తమ ఉద్దేశము క్రైస్తవ మత ధర్మాల ప్రచారమేనని స్పష్టంగా ప్రకటించాడు. అప్పట్లో తమ పిల్లలను మంచి ఇంగ్లీష్ నేర్పే పాఠశాలలో చేర్పిస్తే మంచిదనీనూ ఈ దొరగారి క్రైస్తవ మత ప్రచారం కొనసాగి ఏడుస్తుందా అనే మొండి ధైర్యంతోను బ్రాహ్మణులు, మొదలియా రులు, నాయరులూ మొదలైన ఉన్నత కులాల వారు తమ పిల్లలను పాఠశాలకు పంపడం ప్రారంభించారు. పిల్లలకు నెలకు అర్ధ రూపాయి మాత్రమే జీతం నిర్ణయించడం వల్ల త్వరలోనే చాలామంది పిల్లలు చేరారు. 1838 అక్టోబర్ నాటికి 270 మంది పిల్లలు చదువుతున్నారు. పాఠశాల నల్ల వారి బస్తీలోని ఎర్రబాలు సెట్టి వీధి లోనికి మార్చి, ఆండర్సన్ గారు, ఆయనతో పనిచేసే జాన్సన్ అనే మిషనరీ కూడా ఆ

పాఠశాల ఆవరణలోనే కాపురం ఉండేవారు. దానిని మిషనరీ గృహమని ప్రజలు వ్యవహరించేవారు

ఆండర్సన్ గారు పాఠశాల ప్రారంభించినప్పటి నుండి తన ముఖ్య ఉద్దేశం ప్రకారం పిల్లలకు బైబిలు కథలు చెబుతూ క్రైస్తవ ధర్మాల ప్రాశస్త్యము నుగ్గడిస్తూ హిందూ మతాచారాలను కులాచారాలను మూఢవిశ్వాసాలని, హిందువుల దేవుళ్లకు లోపాలు పేర్కొని వారిని ఎగతాళి చేస్తూ పిల్లల చేత ఈ విషయాలను గూర్చి ఒకరితో ఒక వాదము చేయిస్తూ క్రైస్తవ మత ప్రచారం చేయసాగినాడు. పాఠశాలలో కుల తారతమ్యాలు పాటించక పిల్లలందరినీ కలిపి కూర్చోబెట్టాడు. తెలివితేటలు గల తక్కువ కులాల పిల్లలకే అగ్రస్థానమిచ్చేవాడు. 1838 సం॥ అక్టోబరులో ఈ పాఠశాలలో ముగ్గురు పంచములను చేర్చుకున్నాడు. అంతట హిందూ కులాల పిల్లల తల్లితండ్రులలో అలజడి కలిగినది. వారిని వెళ్ళగొట్టవలసినదని ఆండర్సన్ గారిని కోరగా ఆయన వినిపించుకోలేదు. అంతట పాఠశాల నుండి కొంతమంది పిల్లలను తల్లిదండ్రులు మాన్పించారు. ఈ అలజడి కొంతకాలం విపరీతంగా సాగింది. ఆ కాలంలో చెన్నపట్నంలో కొందరు రోమన్ క్యాథలిక్ క్రైస్తవ శాఖకు చెందినవారు స్థాపించిన ఇంకొక పోటీ పాఠశాలలో పిల్లలను చేర్చుకున్నారు. ఈ స్థితిలోనే 1840సం॥లో కంపెనీ ప్రభుత్వం వారు మద్రాస్ యూనివర్సిటీ స్కూలు అనే పాఠశాలను స్థాపించారు. అటుతరువాత చెన్నపట్నంలో పచ్చయప్ప మొదలియార్ అనే ధర్మాత్ముని దాన ధర్మాల ధర్మకర్తలు కూడా ఒక పాఠశాల పచ్చయప్పగారి పేరున స్థాపించారు. అండర్సన్ పాఠశాలలో చదివిన రాజగోపాల్ అనే మొదలియారు యువకుడిప్ప 1841 సం॥లో క్రైస్తవ మతంలో కలపడంతో చెన్నపట్నం ప్రజల్లో గొప్ప సంచలనం కలిగింది. ఈ వ్యవహారం మేజిస్ట్రేట్ కోర్టుకెక్కింది ఈ అలజడి కాలంలో ఆ పాఠశాలలో చదువుకున్న బ్రాహ్మణ పిల్లలలో శేషయ్య శాస్త్రి గారు ఒకరు.

చెన్నపట్నం పాఠశాలల పూర్వ చరిత్ర

మద్రాస్ ప్రెసిడెంసీ అనే పేరు గల కంపెనీ రాజ్యభాగానికి 1838-41 మధ్య ఎలిఫిన్ స్టన్ (John Elphinstone) ప్రభువు గవర్నరుగా ఉండగా ఏనుగుల వీరాస్వామయ్య గారు వారి మిత్రులు, సుప్రీంకోర్టు అడ్వకేట్ జనరల్ జాన్ బ్రూస్ నార్టన్ గారు ఇంగ్లీష్ కంపెనీ ప్రభుత్వాన్ని ప్రార్థించి ఇంగ్లీషు విద్య నేర్పే మద్రాస్ యూనివర్సిటీ అనే విద్యాలయమును స్థాపించడానికి చేసిన ప్రయత్నం ఫలితంగా ఎడ్యుకేషనల్ కౌన్సిల్ నెలకొల్పి ఒక ప్రిపరేటరీ స్కూలును స్థాపించి అటు తరువాత 1840 సం॥లో మద్రాస్ యూనివర్సిటీ స్కూల్ అనే పేరుతో ఒక పాఠశాల నెలకొల్పారు. దానిలో మొదట అడమ్ గార్డన్ గారు అటుతరువాత ఇ బి. పవెల్ దొరగారు ఉపాధ్యాయులుగా యున్నారు. అందులో మత ప్రచారములేని ఇంగ్లీషు విద్య నేర్పే ఏర్పాటు జరిగింది. ఈ పాఠశాలలో పరవస్తు చిన్నయ సూరి, పురాణం హయగ్రీవ శాస్త్రి గారు తెలుగు పండితులుగా నియమింపబడిరి. ఈ పాఠశాలలో విద్య నేర్చిన వారిని ఆ కాలంలో ప్రొఫిషెంట్సు అనేవారు. 1857 సం॥లో నేటి మద్రాస్ యూనివర్సిటీ స్థాపించినప్పుడు మెట్రిక్యులేషన్, ఎఫ్.ఎ, బి.ఎ పట్టాలు ఏర్పాటు చేశారు (చూడు 1857 పూర్వ రంగములు (1959) విశాలాంధ్ర పబ్లిషర్సు)

ఆ కాలంలో చెన్నపట్నంలో దుబాషీగా నుండిన పచ్చయప్ప మొదలియార్ గారి దానధర్మాలను గూర్చి చెన్నపట్నం సుప్రీంకోర్టు వారు చేసిన [తీర్పు] ప్రకారం ఆ దానధర్మాల ధర్మకర్తలు మొదట బీద బాలురకు కొద్దిపాటి విద్యార్థి వేతనములు లిచ్చేవారు. అటు తరువాత 1842 సం॥లో నేటి పచ్చయప్ప కాలేజీ ప్రాతిపదికగా 1862 సం॥లోపాఠశాలను స్థాపించారు. ప్రభుత్వ పాఠశాలలో నెల జీతాలు నాలుగు రూపాయలుండేది. మన శేషయ్యశాస్త్రిగారు పచ్చయప్ప దానధర్మాల ధర్మకర్తల విద్యార్థి వేతనమును, అటుతరువాత ప్రభుత్వ పాఠశాల విద్యార్థి వేతనములు వచ్చినందు వల్ల ఆయన మొదట ఆండర్సన్ పాఠశాలలో తరువాత పచ్చయప్ప పాఠశాలలో చదివి అటు తర్వాత 1940 నుండి 1948సం॥ వరకు మద్రాస్ యూనివర్సిటీ హైస్కూలులో చదివి ప్రొఫిషియంట్ పట్టా పొందినారు. ఆయన కుశాగ్రబుద్ధిమంతుడైనందువలన ఉపాధ్యాయుల దయకు పాత్రుడైనాడు. మద్రాసు యూనివర్సిటీ హైస్కూల్లోని క్రింది తరగతిలో Messers మెస్సెర్స్ వైట్ బ్రౌన్ అనే దొరల దగ్గరనూ పై తరగతులలో Messers ఆడమ్

నోబుల్ గార్డన్, ఇ.బి. పవెల్ దొరల దగ్గర చదివి ప్రశంసలను పొందినారు. ఆ పాఠశాలలో ఆయన వ్రాసిన వ్యాసాలను ఆ దొరలు మెచ్చుకున్నారు. ఆయన పోటీ వ్యాసములు కూడా వ్రాశారు. డిబేట్స్ అనే వాగ్వాదాల లో పాల్గొనేవారు. 1846సం॥ మద్రాసు పచ్చయప్ప పాఠశాల భవనం శంకుస్థాపన సందర్భంగా జరిగిన సభలో శేషయ్య శాస్త్రిగారిచ్చిన ఉపన్యాసమును గూర్చి ఆ కాలములో ప్రకటింపబడే క్రెసెంటు పత్రికాధిపతి[68] మెచ్చుకొని ఆండర్సన్ దొర పాఠశాలలో ఉత్తముడని ప్రఖ్యాతి చెందిన రాజగోపాల్ అనే విద్యార్థి తెలివితేటలతో శేషయ్య శాస్త్రి గారిని పోల్చి ప్రశంసించాడు. ఇంత తెలివితేటలతో చదివిన విద్యార్థి యైన శేషయ్య శాస్త్రి గారికి ఆనాటి కంపెనీ ప్రభుత్వంలో ఉద్యోగం దొరకడంలోనూ ఆ ఉద్యోగం చక్కగా నిర్వహించి ఉన్న ఉద్యోగి కావడంలోనూ ఆశ్చర్యం లేదు.

<u>శేషయ్య శాస్త్రిగారు చేసిన ఉద్యోగాలు, నిర్వహించిన బాధ్యతలు</u>

<u>రివెన్యూబోర్డులో లేఖకుడుగా</u>: 1848 సెప్టెంబర్ నెలలో శాస్త్రి గారు చెన్నపట్నం లోని రెవెన్యూ బోర్డులో నెలకు 25 రూపాయలు జీతం గల గుమస్తాగా ప్రవేశించారు. ఆ కాలంలో రెవెన్యూ బోర్డు లోని ముఖ్యాధికారి హెన్రీ పైక్రాఫ్ట్ (Henry Picroft) అనే దొరగారు. ఈయన రెవెన్యూ వ్యవహారాలను గూర్చిన పత్రముల రచనలు చదవడానికి ప్రసిద్ధి పొందియుండెను. శేషయ్యశాస్త్రిగారు కార్యాలయం వ్యవహారాలలో వ్రాసిన డ్రాఫ్ట్స్ ఆ దొరగారిని ఆకర్షించినవి. రెవెన్యూ బోర్డులోని సీనియర్ సభ్యులలో ఒకడై అటుతరువాత సర్ బిరుదు పొందిన వాల్టర్ ఎల్యట్ (Sir Walter Elliot) గారు 1848 నుండి ఉత్తర సర్కార్ల స్పెషల్ కమిషనర్ గా నుండేవారు. ఆయన ఉత్తర సర్కార్ల పర్యటనలో మన శేషయ్య శాస్త్రి గారిని వెంటబెట్టుకుని వెళ్లారు. రెవెన్యూ బోర్డు లోని వివిధ శాఖల వ్యవహారాలకు సంబంధించిన విషయాల్లో శాస్త్రిగారు ఆయనకు కుడి భుజంగా ఉండటమే గాక అటుతరువాత ఎల్యట్ గారు చేసిన గుంటూరు జిల్లా విచారణలలోను, దొరగారి చరిత్ర

[68] గాజుల లక్ష్మీనరుసు సెట్టి గారు క్రెసెంట్ పత్రికాధిపతి.

పరిశోధనలోను కూడా శేషయ్య శా|స్త్రి గారు ఆయనకు తోడ్పడినారు. శేషయ్య శా|స్త్రి గారు ఎల్యట్ దొరగారికి పర్సనల్ అసిస్టెంట్ గా ఉండేవారు.

<u>మచిలిపట్నంలో తాహశీల్దారు, హుజూరు శిరస్తాదారు</u>: శేషయ్య శా|స్త్రిగారు 1851 సం॥లో మచిలీపట్నం లో తహశీల్దారుగా నియమింప బడినారు. 1854 సం॥ ఫి|బ్రవరి నెలలో శేషయ్య శా|స్త్రి గారిని మచిలీపట్నం నాయబ్ శిరస్తాదారు అనగా హుజూర్ శిరస్తాదారు |క్రింద అధికారిగా నియమించారు. అటు తరువాత 1855సం॥ శా|స్త్రి గారిని మచిలీపట్నం జిల్లా హుజూర్ శిరస్తాదారుగా నియమించారు. చాలా కాలము తెలుగు జిల్లాలలో ఉద్యోగిగా యున్నందువల్ల ఆయన తమిళుడైనా తెలుగు అనర్గళంగా మాట్లాడటమే గాక |వ్రాత కోతలు కూడా నేర్చుకున్నారు. ఆయన మచిలీపట్నం జిల్లాలోని అన్ని మారుమూల |గ్రామాలకు స్వయంగా వెళ్లి |గ్రామస్తుల కష్టసుఖాలు తెలుసుకునేవారు. ఆ కాలంలో వివిధ తాలూకా కచేరిలోను, జమాబందీలలోనూ కలెక్టర్లు శిరస్తాదారుపైననే ఆధారపడేవారు. శా|స్త్రిగారి నీతి నిజాయితీలు వారి అఖండ |ప్రజ్ఞ పాటవములు చూసి |ప్రజలు రైతులు ఆశ్చర్యపడేవారు. శేషయ్య శా|స్త్రి గారీ జిల్లాలో ఎనిమిది సంవత్సరములు పనిచేశారు. 1857సం॥ తటస్థించిన ది |ఫేత్ ఈందీన్ ంఉతిన్య అనే విప్లవ కాలములో బందరులోని మహమ్మదీయ జనాభా అత్యధికముగా నుండినందువల్ల చాలా దూరదృష్టితో అనేక జా|గ్రత్తలు తీసుకొని తమ ఉద్యోగం నిర్వహించారు. ఈ విషయమును పై దొరలు |గ్రహించారు.

<u>డిప్యూటీ కలెక్టరుగా, ఇనాముల పరిష్కారాలు</u>: 1859 సం॥లో శేషయ్య శా|స్త్రిగారిని డిప్యూటీ కలెక్టరుగా నియమించారు. అటుతరువాత వారిని అప్పట్లో ఇనాములు కమిషనర్ గా ఉండిన జార్జి నోబుల్ టైలర్ (George Noble Tylor) గారికి స్పెషల్ అసిస్టెంట్ గా నియమించారు. శేషయ్యశా|స్త్రి గారు ఆ కాలమున చేసిన ఘనకార్యము సామాన్యమైనది కాదు. ఇనాముల పుట్టుపూర్వోత్తరాల విచారణ సంబంధించిన 2,50,000 ఒరిజినల్ క్లెయిమ్స్ ప|త్రాలను పరిశీలించి పరిష్కరించారు. వీరి చేతి కింద గల కేం|ద్ర కార్యాలయములో 2000 మంది పైన గుమాస్తాలు పనిచేసేవారు. ఈ ఉద్యోగుల చర్యలను జా|గ్రత్తగా పరిశీలించేవారు. ఇనాముల పరిష్కరణలో వారు చాల

ఔదార్యమును పాటించేవారనీనూ, న్యాయమును బట్టి పరిష్కరించేవారనీనూ ఆ కాలమునాటి పెద్దలు ఇప్పటికీ వారి గురించి చెప్పుకుంటారని చిరివాడ అగ్రహారం కాపురస్తులు, నా మిత్రులు వేలూరి యజ్ఞనారయణ శాస్త్రి[69] గారు చెప్పారు.

1866 సం॥లో శేషయ్యశాస్త్రి గారు ట్రేసుర్యీ డెపుత్యీ ఛొల్లెఛ్టొర్ ట్రెజరీ డిప్యూటీ కలెక్టరుగా నియమింపబడినారు. అటు తర్వాత 1868 సం॥లో మద్రాస్ లోని రెవెన్యూ బోర్డులో హెడ్ శిరస్తాదార్ గా నియమింపబడినారు.

శేషయ్య శాస్త్రిగారు మచిలీపట్నం హుజూర్ శిరస్తాదారుడైన తరువాత కచేరిలో అవినీతి గాని లంచగొండితనం గాని లేకుండా చేశారు. అంతకు పూర్వం బందరులో 1842 సం॥నుండి చాలా కాలము పోర్టర్[70] అనే బద్ధకస్తుడు కలెక్టరుగా నుండి నందున జిల్లా వ్యవహారములు పాడైనవి. ఎల్యట్ గారు దానిని గూర్చి విచారణ జరిపారు. 4000 అర్జీలను కలెక్టరుగారు పరిష్కరించకుండా మూల పడేసినట్లుగా తేలినది. ఆయన క్రింద శిరస్తాదారుగా యుండిన సుందరగిరి రామారావు[71] అవినీతిపరుడు. బంధు ప్రియుడు. లంచగొండి. ఆయన క్రింది ఉద్యోగులు అవినీతిపరులుగానుండేవారు. ప్రజలు చాలా బాధలు భరించేవారు.

తిరువాంకూర్ సంస్థానం దివానుగా: శేషయ్య శాస్త్రిగారు 1872సం॥ జులైలో తిరువాంకూర్ మహారాజా గారికి దివాన్ గా పనిచేశారు. అంతకు పూర్వం సంస్థానానికి సర్ టి. మాధవరావు గారు దివాన్ గా పని మానుకున్నారు మహారాజా రామవర్మ గారు సద్ధర్ముడు. మాధవరావుగారు సమర్థవంతం గానే నిర్వహించారు కానీ సంస్థానంలో చిరకాలము నుండి పాతుకొని యున్న దురాచారాలను వాటివల్ల కలిగే దుష్ఫలితాలను సరిచేయ లేకపోయినారు. సంస్థానం ఉద్యోగులు కొందరు కుట్రలు పన్ని మాధవ గారిపై కొండెములను చెప్పి దురభిప్రాయం కలిగించినారు. అందుచేత పని మానేశారు ఆయనకు మహారాజా గారు పించన్ ఇచ్చారు.

---

69 వేలురి శివరామశాస్త్రిగారి అన్నగారు......................సంపాదకుని వివరణ.
70 రాబర్టు టిండాల్ పోర్టరు.
71 ఈ సుందరగిరి రామారావు గారికి 110 బంధువుల రాజారావు అనే ప్రఖ్యాతి వచ్చింది.

<u>తిరువాంకూర్ సంస్థానంలో దివానుగా చేసిన సంస్కరణలు:</u>

శేషయ్య శాస్త్రి గారు తమ దివాన్గిరీలో కొన్ని గొప్ప సంస్కరణలు చేశారు. ఆయన చేసిన మొట్టమొదటి సంస్కరణ భూముల అమరకానికి సంబంధించినవి. సంస్థానంలోని భూములు కౌలు పద్ధతులనేక విధములైయుండి చాలా చిక్కులు కలిగించుట చూచి వాటన్నిటిని సక్రమంగా వర్గీకరించటం చాల కష్టసాధ్యమైన కార్యం[చేపట్టారు]

తిరువాంకూర్ సంస్థానములో మతాచారాల ప్రకారము అన్నదానానికి అనేక సత్రములు స్థాపించబడినవి. ఆ సత్రముల నిర్వహణలో ఉద్యోగులు అవినీతి పరులై అన్యాయం చేస్తూ లాభాల నార్జించేవారు. శేషయ్య శాస్త్రి గారు దానిని గూర్చి విచారించి అక్రమాలు మాన్పించారు.

సాల్ట్ శాఖలో ఉప్పు విక్రయ పద్ధతుల్లో చాలా లోపాలుండేవి. కొలపాత్రతో కొలిచి విక్రయించేవారు. ఇందులో చాలా మోసాలు జరిగేవి. దివాన్ గారీ దుర్మార్గాలు గమనించి కొలతలతో విక్రయించే పద్ధతిని రద్దు చేసి తూనికలతో విక్రయించే పద్ధతిని ప్రారంభించారు. అమాయకమైన జనసామాన్యాన్ని మోసగించడానికి ఇందులో కూడా అవకాశం యున్నప్పటికీ ప్రజలు [రెండిటికీ గల] తారతమ్యము సులభంగా తెలుసుకోగలరని దివాన్ గారి అభిప్రాయము. దీనివల్ల చాలా మేలు కలిగింది.

రెవెన్యూ రాజస్య శాఖ లెక్కల వల్ల శిస్తు వసూలు విపరీతంగా పెరిగియున్నట్లుగా కనపడగా దివాన్ గారు రైతులకు పెద్ద మొత్తాలు రిమిషనులని ఖర్చుగా [రికార్డు లెక్కలలో] చేయించారు.

తిరువాంకూరు సంస్థానంలోనూ ప్రభుత్వకార్యాలయాల వివిధ శాఖలలో రెవెన్యూ లెక్కలు మలయాళ భాషలో తాటియాకుల మీద గంటంతో వ్రాసేవారు. ఈ పద్ధతి వల్ల లోటుపాట్లను అధికారులు సులభంగా కనిపెట్టలేక పోయేవారు. అందువల్ల దివాన్ గారు ఈ రికార్డు లెక్కలు తాటియాకుల మీద గంటంతో వ్రాసే పద్ధతి మాన్పించి కాగితముల పైన కలముతో వ్రాసే పద్ధతి ప్రారంభించారు.

1875 సం॥లో న్యాయ పరిపాలన శాఖలో న్యాయవాదులను గూర్చి విచారించగా వారిలో చాలామంది న్యాయశాస్త్రము బాగా నెరిగినవారు కారని తేలినది. అసమర్ధులైన న్యాయవాదులు ఉన్నత న్యాయస్థానంలో పనిచేయుట వల్ల చాలా అన్యాయం జరుగుతుందని దివాన్ గారు ఆలోచించి ఉన్నత న్యాయస్థానంలో పని చేసే న్యాయవాదులకు ఒక పరీక్ష పెట్టించారు. అందులో చాలామంది ఉత్తీర్ణులు కాలేదు. ఉత్తీర్ణులైనవారే ఉన్నత న్యాయస్థానములలో పనిచేయాలని ఉత్తీర్ణులు కానివారు వివిధములైన క్రింది స్థాయిలో న్యాయస్థానంలో పనిచేయాలనీ శాసించారు. దీనివల్ల న్యాయ విభాగము చక్కబడినది.

శేషయ్య శాస్త్రిగారి దివాన్గిరీలో విద్యాశాఖలో కొన్ని గొప్ప మార్పులు చేశారు. తాలూకాలలోనూ, గ్రామాల్లోనూ పాఠశాలలో సంఖ్యను అభివృద్ధి చేశారు. విద్యాలయాల్లో చదువుకుని ఉత్తీర్ణులైనవారిలో కొందరిని ‘attaches’ వివిధ పరిపాలన శాఖలో వారికి తరఫీదు ఇప్పించి వివిధ శాఖలలో ఉన్నత ఉద్యోగులుగా నియమించే పద్ధతి ప్రారంభించారు. శాస్త్రి గారు దివాన్గిరీలో ప్రజలందరూ ముఖ్యముగా సంతోషించి జ్ఞాపకము పెట్టుకున్న ఒక గొప్ప సంస్కరణ తిరువాంకూర్ సంస్థానము వారి ఇలవేల్పు శ్రీ అనంతపద్మనాభ స్వామి వారి దేవాలయ [ప్రదేశ] మును శుభ్రపరిపించి పరిశుద్ధము చేసిన సత్కార్యాలు. దానిలోనికి ప్రవహించే కాలువ అధికారులు అశ్రద్ధ వల్ల మరమ్మత్తు లేక పాడై నందువలన దేవ దర్శనానికి వచ్చిన భక్తుల స్నానాలకు పరిశుద్ధమైన నీరు కరవైనది. శేషయ్య శాస్త్రి గారు దీనిని గూర్చి శ్రద్ధ వహించి బాగు చేయించుట వల్ల ప్రజలందరూ చాలా సంతోషించారు. మహారాజాగారు సంతోషించారు. శేషయ్య శాస్త్రిగారు దివాన్గిరీలో జరిపిన మరియొక గొప్ప విషయము.

శేషయ్య శాస్త్రి గారి దివాన్గిరీలో జరిగిన ఒక గొప్ప విషయం: 1876-71 సం॥లలో వచ్చిన పెద్ధ కఱవుకాలములలో తిరువాంకూర్ రాజ్య సరి సరిహద్దుల వెలుపల పాండ్యనాడు లోని మధుర, తిరునల్వేలి జిల్లాల్లో వివిధ కులాల వారిలోని సంపన్నులు కూడా అక్కడ గ్రామాలలోని చెరువులు వట్టిపోగా తమకు గానీ తమ పశువులు గాని త్రాగడానికి నీరు లేక అల్లాడిపోతూ గ్రామంలో ఇల్లు వాకిళ్లు వదిలి తమ పశువులతో సంస్థానంలో వివిధ ప్రాంతాలలో తలదాచుకోవడం ప్రారంభించారు. తిరువాంకూర్

ప్రజలు వారినాదరించారు. పూర్వము వచ్చిన కఱవులలో కూడా ఇలాగే జరిగినది. జన ప్రవాహము పట్ల దివాన్ గారు సానుభూతితో వర్తించడం ప్రజలు, మహారాజా గారు సంతోషించారు.

ఇలాగా ఐదు సంవత్సరాలు గొప్ప సేవ చేసి తమ ఉద్యోగం చాలించుకో దలిచారు. అంతట మహారాజా గారాయనకు 1877 సం॥లో నెలకు 500 పింఛను ఇచ్చేట్టుగా ఏర్పాటు చేశారు[72]. శేషయ్య శాస్త్రి గారు తిరువాంకూర్ సంస్థానమునకు చేసిన సేవ గుర్తించి బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం వారు ఆయనకు C.S.I.[73] అనే బిరుదు 1877 సం॥లో ప్రసాదించారు.

<u>తిరుచునాపల్లి లో మాన్షన్ ఫండ్ కార్యదర్శిగా:</u>

దివాన్ పదవి వదలి వెళ్ళిన తరువాత 1877సం॥ తమిళనాడులోని తిరుచునాపల్లి, తంజావూరు జిల్లాలో సంభవించిన కఱవు నివారణకై ఇంగ్లాండ్ దేశ ప్రజలు విరాళముగా పంపిన నిధి Mansion House Fund[74] నిర్వహణలో వెబ్ స్టర్ దొర[75] గారి తో కలిసి పని చేశారు. ఇంగ్లాండ్ దేశ ప్రజలు చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలుపుతూ చెన్నపట్నంలో ఒక సభ జరిగింది అందులో శేషయ్య శాస్త్రి గారు ప్రసంగించారు.

ఆ కాలంలో మద్రాసు రాజధాని గవర్నరుగా నుండిన డ్యూక్ ఆఫ్ బకింగ్ హమ్ ప్రభువు[76] గారు శేషయ్య శాస్త్రిగారు ప్రజల పట్ల సానుభూతితో కఱవు నివారణ కార్యక్రమాలు జరిపించినందుకు ప్రస్తుతించి శాసనసభలో ఒక సభ్యునిగా నియమిం చారు. కలకత్తాలోని గవర్నర్ జనరల్ శాసనసభలో కూడా సభ్యుడుగా నియమిస్తామని అన్నారు గాని శేషయ్య శాస్త్రిగారు ఇష్టపడలేదు.

---

72 1877సం॥ ఆగస్టు మాసంలో శేషయ్య శాస్త్రిగారు దివాన్ పదవి చాలించుకున్నారు. అదే సం॥లో తిరుచునాపల్లి కఱవు నిధి, Mansion House Fund నిర్వాహణకు ఉపాధ్యక్షునిగా సేవలందించారు.

73 C.S.I = Companion of the Order of Star of India.

74 మానసన్ హౌస్ ఫామైన్ రిలీఫ్ ఫండు అను విదేశ చందాల నిధిని నిర్వహణ వెబస్టర్ దొరతో కలిసి శేషయ్య శాస్త్రి గారు చేసేవారు.

75 ఎడ్మండ్ ఫాస్టర్ వెబస్టర్ (Edmund Forster Webster).

76 1875-1878 మద్రాస్ ప్రావిన్సు గవర్నరుగా డ్యూక్ ఆఫ్ బకింగ్హామ్ అను దొర. ఈయన పూర్తిపేరు రిచార్డు టెంపుల్ గ్రెనివిల్లె.

<u>పుదుక్కోట సంస్థానం దివాన్, దివాన్ రీజంట్ గా:</u>

ఆ సమయంలో మద్రాస్ గవర్నర్ గారు శేషయ్య శాస్త్రి గారిని పుదుక్కోట సంస్థానానికి పాలించే రామచంద్ర తొండమాన్ గారికి దివాన్ గా ఉండి ఆ రాజ్య వ్యవహారం చక్కపెట్ట వలసినదిగా కోరి 1878 సం॥లో దివాన్ గా నియమించారు.

<u>పుదుక్కోట సంస్థానంలో దివానుగా చేసిన సంస్కరణలు:</u>

పుదుక్కోట సమస్యలను దక్షిణ దేశంలో తిరువాంకూర్, తంజావూరు, మధుర జిల్లాల మధ్య నున్న చిన్న స్వదేశ సంస్థానము. ఈ సంస్థానము నేలిన తొండమాను రాజులు మొదట విజయనగర చక్రవర్తుల కాలంలో మధుర, తంజావూరు తెలుగు తాలూకాల రాజ్యాలకు సామంతులుగా నుండేవారు. వీరు తరువాత స్వతంత్రులైనారు. 1857 సం॥లో ఇంగ్లీషు ప్రభుత్వాన్ని ధిక్కరించి ఉత్తర దేశంలో జరిపిన స్వాతంత్ర్యో ద్యమమును అణచివేసిన తరువాత బ్రిటిష్ గవర్నర్ జనరల్ క్యానింగ్ (Canning) అప్పట్లో బ్రిటిష్ ప్రభు భక్తులుగా నుండిన సంస్థానాధీశులకు [పరిపాలన] అధికార సన్నదులిచ్చిన సందర్భంలో పుదుక్కోట సంస్థానాధీసుడైన తొండమాన్ గారుకి కూడ సన్నదలిచ్చారు.

ఈ సంస్థానము తమిళ భాష ప్రాంతాల మధ్యలో నున్నప్పటికీ కొందరు రాజులు ఆంధ్ర భాషాభిమానులుగా నుండి తెలుగు పండితులను కవులను, గాయకులను పోషించేవారు. తొండమాన్ రాజవంశ చరిత్ర నుదురుకోటి వెంకన్న కవి, ఆయన కుమారుడు సాంబ కవి రచించారు. వారు బృహదాంబ అనే దేవి భక్తులు. శేషయ్య శాస్త్రి గారు దివాన్గా వెళ్లే నాటికా సంస్థానమునకు రామచంద్ర తొండమన్ గారు పరిపాలకుడు. ఆయనకు ఇద్దరు భార్యలున్నా పుత్ర సంతానము లేదు. ఆయన 1877 సం॥లో తన రెండవ భార్య యొక్క ఏకైక పుత్రికయొక్క ముగ్గురు పిల్లల్లో మూడో పిల్లవానిని దత్తు చేసుకున్నారు. ఈ దత్తత ప్రభుత్వం వారు అంగీకరించారు. రాజా గారు వార్ధక్యం వలన పరిపాలన వ్యవహారాలలో అశ్రద్ధ వలననూ సంస్థానము ఉద్యోగుల అలక్ష్యం వలననూ ఆ సంస్థానము అభివృద్ధి లేక ఆర్థిక దుస్థితిలో మునిగి యున్నది. శేషయ్య శాస్త్రి గారు దివానుగా వెళ్ళేటప్పటికీ ఖజానాలో డబ్బు లేదు.

రివెన్యూ వ్యవహారాలలో చిరకాలానుభవము గల శేషయ్య శాస్త్రి గారు సంస్థానము యొక్క ఆర్థిక దుస్థితికి ముఖ్య కారణము ఆ సంస్థానములోని గ్రామ భూములను అమరకం చేయుటలో అమానీ[77] పద్ధతి అవలంబించటమే యని గ్రహించారు.

అమానీ పద్ధతిలో గ్రామ పొలాల్లో రైతులు సాగు చేసేటప్పటి నుండి పంట నూర్చేవరకూ సంస్థాన సర్కారు ఉద్యోగుల అజమాయిషీ జరుగుతుంది. పంట అంచనా వేసి సర్కారుకు చెల్లించవలసిన ధాన్యము కొల్చి కుప్పలు వేయించే వరకు రైతు చేతులు కట్టుకొని నిలిచి యండాలి. సంస్థానపు సర్కారు ఉద్యోగులు హాజరు లేనిదే పంట నూర్చకూడదు. సంస్థానంలో ఈ అమానీ పద్ధతి అమరకం పనుల కోసమెంతమంది ఉద్యోగులను, ఎంతమంది సిబ్బందిని నియమించినా పనులు సరిగా జరిగేవి కావు. ఉద్యోగుల జీతాలు తక్కువే. వారు అవినీతిపరులు లంచగొండులై యుండేవారు. అజమాయిషీ కార్యములు సరిగా చేసేవారు కారు. వీరి చర్యల వల్ల రైతులు బాధపడేవారు. సర్కారుకు రావలసిన పంట భాగము సరిగా వసూలు అయ్యేది కాదు. రైతుల వ్యవసాయం తనిఖీ చేయడంలో పంట అంచనాలలో జరిగే అక్రమాలు అలా వుండగా పంటలో సర్కారు భాగమును విడదీయడానికి ఆలస్యం చేయటం వల్ల పంట నష్టమయ్యేది, కాపలా ఖర్చులు పెరిగేవి. .... తరువాత బజారులో సరియైన ధర లేదని ... కట్టి పాతర్లు వేసి నిల్వ చేయడానికీ కాపలా ఖర్చులు పెరిగేవి. పంట తగ్గి బజారు ధర పెరిగినా కూడా అది గిట్టుబాటు కాక సర్కారుకు నష్టం కలిగేది. పూర్వం ఇంగ్లీష్ కంపెని పరిపాలనలో కూడా కొన్ని గ్రామాల్లో ఇలాగే జరిగేదని ఇటీవల చరిత్ర పరిశోధించిన డాక్టర్ ఫ్రైకెన్ బర్గ్ (Freikenberg) గుంటూరు జిల్లా గ్రంథంలో వ్రాశారు. ఈ వ్యవహారాల్లో సర్కారు ఉద్యోగులు చాలా లాభాలు పొంది అవినీతిగా నుండేవారు. దివాన్ గారు ఈ విషయాలన్నీ ఆలోచించి అమానీ పద్ధతి రద్దుచేసి భూములను రొక్కపు శిస్తుల అమరకపరిచే పద్ధతి ప్రారంభించారు. అనవసరమైన ఉద్యోగులను, సిబ్బందిని తీసివేశారు. దీనివల్ల శిస్తులు హెచ్చించకుండానే సర్కారు ఆదాయం పెరిగింది.

---

[77] పుదుక్కోట సంస్థానములో వాడుకలో నుండిన భూమి అమరక పద్ధతిని అమానీ అనేవారు.

ఆ కాలంలో సంస్థానమునేలే రాజులు డాబు దర్పాలు కోసం రాజలాంఛనాల కోసం, తమ సొంత ఖర్చులకోసం విపరీతంగా ఖర్చు చేస్తూ వుండేవారు. దానికి కావలసిన సొమ్మును సంస్థానాల ఆదాయం నుండే తీసుకునేవారు గొప్ప గొప్ప నేటివ్ స్టేట్సుల్లో కూడా ఇలాగే జరిగేది. ప్రజల విద్యాభివృద్ధి అనీ, వ్యవసాయభివృద్ధనీ, ప్రజల క్షేమాలకు ఖర్చులని దొంగ లెక్కలు వ్రాయించేవారు. సంస్థానాల అభివృద్ధి కార్యాలకు ఖర్చు మిగిలేది కాదు. పుదుక్కోట సంస్థానంలో కూడా ఇలాగే జరుగుతుండటము వల్ల దివాణం ఖర్చులకు ఒక మితి వుండాలని దివాన్ గారు ఆలోచించి మద్రాస్ గవర్నర్ గారికీ సంగతి తెలిపి దివాణం ఖర్చులకు కొంత నిధి ఏర్పరచి రాజాగారీ మొత్తమును మీరి ఖర్చు పెట్టరాదనే ఉత్తర్వులు తెప్పించారు. సంస్థానంతో జరిగిన ఏర్పాటు ప్రకారం ఈ నిర్ణయం చేయడానికి గవర్నర్ గారికి అధికారం వున్నది. అంతట రాజా గారి దివాణం లో ఖర్చులు తగ్గి చాలా సొమ్ము మిగిలింది. ఈ విధంగా పొదుపు చేసిన సంస్థానాదాయమును దివాన్ గారు సంస్థానం అభివృద్ధికి వినియోగించటానికి అవకాశం కలిగింది.

అదివరకు సంస్థానంలో రాకపోకలకు సరైన రోడ్లు లేవు. విద్యాభివృద్ధికి తగిన పాఠశాలలు, వ్యవసాయ అభివృద్ధికి ఆవసరమైన చెరువులు, వాటికి మరమ్మత్తు లేవు. ప్రజలకు సౌకర్యాలు లేవు.

1882 సం॥లో దివాన్ గారు అప్పటివరకూ హైస్కూల్ గా యున్న రాజా గారి పాఠశాలను ఫస్ట్ గ్రేడ్ కాలేజీగా మార్చారు. అది వరకు పుదుక్కోట పట్టణానికి, సంస్థానాల్లో గ్రామాలవారి కావాల్సిన వంటచెరుకు నిమిత్తం చుట్టుపక్కలగల అడవుల్లోని చెట్లను నరికివేస్తున్నందువల్ల కొద్దికాలంలోనే చెట్లు నశించే ప్రమాదం జరిగే పరిస్థితి కలిగింది. దీనిని నివారించడానికి దివాన్ గారు సంస్థానంలో వెళ్లారు నదీ తీరాన, కొన్ని ప్రాంతాలలో వేలకొలది సరుగుడు చెట్లు నాటే కార్యక్రమం ప్రారంభించారు.

సంస్థానములోను, పరిసర గ్రామాలలో తవ్వించిన చెరువులు మరమ్మతులు లేక పాడైనందున వ్యవసాయమునకు గానీ, త్రాగటానికి గాని నీటి వసతి చాలినంత లేదు. వెంటనే బావులను తవ్వించి చెరువులు మరమత్తు చేయుట కష్టసాధ్యమైన పని.

చాలామంది వడ్డె వారు మొదలైన పనివారు కావలసి వచ్చారు. దివాన్ గారు సంస్థానంలోని చిన్న పెద్ద గ్రామాలన్నింటిలో నుండి తవ్వకానికి కూలి మనుష్యులను రప్పించే ఏర్పాటు చేశారు. కూలివారిని రొటేషన్ ప్రకారము రప్పించే ఏర్పాటు చేయుటవల్ల గ్రామాలలో మిగత పనులకు ఆంటంకము లేకుండా చేశారు. ఆ కాలంలో పుదుక్కోటలో ప్రతిరోజు 7000 మంది కూలి వారు చెరువుల మరమత్తులు, భావులు నుండి మట్టి తవ్వించి తీసేవారు. ఈ విధముగా త్రవ్వకాలు చేసి త్వరలోనే పెద్ద చిన్న చెరువులన్నీ పూర్వం వలె మంచి జలాశయములు(రెసెర్వాఇర్స్)గా మారినవి. దీనివల్ల గ్రామస్తులు చాలా సుఖపడ్డారు.

ఈ చెరువులలో మరమ్మతు పని తరువాత దివాన్ గారు సంస్థానంలోని రాకపోకలకు రహదార్ల అభివృద్ధికి, సంస్థానంలో తగిన రాజ బాటలను నిర్మించు పని కొనసాగించారు.

1880 సం॥లో పుదుక్కోట సంస్థానమునేలే వృద్ధ బ్రహదాంబ దాస రాజా రామచంద్ర తొండైమాన్ గారు చనిపోయారు. ఆయన మనవడైన బ్రహదాంబ దాస రాజ మార్తాండ భైరవ తొండైమాన్ గారు చిన్నవాడు. అందువల్ల ఈ చిన్న రాజు గారి మైనారిటీ కాలంలో దివాన్ గారే రీజెంట్ (Regent) అనగా పాలకుడు గా నుండుటకు మద్రాసు ప్రభుత్వం వారు నిర్ణయించారు. అందువల్ల దివాన్ శేషయ్య శాస్త్రిగారికి దివాన్-రీజెంటు గా సంస్థానం అభివృద్ధి చేయడానికి సంపూర్ణాధికారములు లభించినవి.

పెదరాజు గారు చనిపోయిన తరువాత దివాన్ రీజెంట్ గారు చేసిన మొదటి గొప్ప సంస్కరణము సంస్థానం న్యాయస్థానము యొక్క అపీల్ అధికారాలను కట్టు దిట్ట పరచటము. 1887 సం॥ జనవరి నెల మొదటి తేదీన శేషయ్య శాస్త్రి గారు పుదుక్కోట చీఫ్ కోర్టు ను స్థాపించి దానిని మద్రాస్ హైకోర్టు యొక్క నమూనాలో తీర్చి దిద్దారు.

చీఫ్ కోర్టు స్థాపన తరువాత దివాన్ రీజెంట్ గారు ఇనామ్ కమిషనరులో (Commissionerate of Inams) స్పెషల్ ఆఫీసరుగా తమకు గల చిరకాలానుభవమును పురస్కరించుకొని పుదుక్కోట సంస్థానము లో వివిధరకాల ఇనాముల గూర్చి విచారణ జరిపి అక్రమములైన వాటిని రద్దు పరచి Enforcement and Resumption of Service Inams అనే గొప్ప కార్యము చేపట్టారు. బ్రిటిష్ రాజ్యభాగములందు వలెనే ఈ

సంస్థానములో కూడా ప్రాచీనకాలములో దేవాదాయ ధర్మాదాయాలు గ్రామ పేదలకు సంబంధించిన వివిధ సేవలు చేయడానికి అనేక రకములైన ఇనాములుండేవి. ఆదాయముననుభవిస్తున్ననవారు ఆ సేవలను చిరకాలమునుండి నిర్వహించక యినాములను క్రయవిక్రయము చేస్తూ స్వంత హక్కుగా అనుభవించడం జరిగింది. దీని వలన సర్కారుకు రావలసిన ఆదాయము రాకపోగా వివిధ ధర్మ సంస్థానాలు గ్రామాలకు జరుగవలసిన అభివృద్ధి పనులు కుంటు పడినవి. గ్రామాధికారులు మొదలైన ఉద్యోగులు ఈ భూముల విస్తీర్ణములను లెక్కలలో తబ్బీలు[78] చేస్తూ అనేక అక్రమాలు జరిగించారు. దీనిని గూర్చి విచారించి న్యాయంగా చేయవలసిన సేవలకు సంక్రమించిన ఇనాములకు quit rent అనే స్వల్ప పన్ను కట్టి పట్టాన్నిచ్చి ఇనాముల అసలు విస్తీర్ణము కన్నా ఎక్కువ భూమిని సర్కారు వశము చేయవలెనని మొదలైన నిబంధనలు బ్రిటిష్ రాజ్యములోని ఇతర ఇనాములకు లాగానే ఈ సంస్థానములో కూడా అమలు పరిచే ఏర్పాట్లు చేశారు.

ఇనాములను గూర్చి చేసిన ఈ సంస్కరణల వల్ల ఇనామ్ దారులకు కష్టములు కలిగినందువల్ల బలవంతులైన, ధనవంతులైన ఇనామ్ దార్లు దీనిని ప్రతిఘటించి కోర్టులలో వ్యాజ్యములు దాఖలు చేశారు. ఏమైతేనేమి దివాన్ గారి ధైర్య సాహసాలవల్ల సంస్థానాదాయము చాలా అభివృద్ధి చెందినది.

శేషయ్య శాస్త్రి గారు దివాన్ రీజెంటు పదవి చేపట్టిన తరువాత పుదుక్కోట పట్టణములోని రాజ బాటలు చక్క పరచి దివ్య భవనములు నిర్మించారు. పట్టణవాసులకనేక సౌకర్యములు కలిగించారు. అయన దివాన్ రీజెంటు హాయామునకీ నిర్మాణములు శాశ్వత కీర్తిని కలిగించినవి.

పుదుక్కోట పట్టణములో రాత్రిళ్ళు మంచి దీపాలును వెలిగించే ఏర్పాటులు చేశారు. పట్టణములోని రోడ్లు, ఇతర జిల్లాలలో రాజవీధులలోను మంచి కంకర వేయించారు.

---

78 తబ్బీలు = తప్పులెక్కలు (మార్పులు).

శేషయ్య శాస్త్రిగారు బ్రిటిష్ రాజ్యములోని పరిపాలనా విధానాలనే సంస్థానములో ప్రవేశపెట్టారు. ఈ సంస్థాన పరిస్థితులను గూర్చిఏటేటా అడ్మినిస్ట్రేటివ్ రిపోర్ట్స్ ప్రకటించేవారు.

1894 సం॥ నవంబరు 27 తేదీన మైనరు రాజాగారికి యుక్తవయస్సు వచ్చిందు వల్ల ఆయనకు సంస్థానము వశముచేసే రోజునే శేషయ్య శాస్త్రిగారు తమ దివాన్ రీజెంటు పదవి వదలిపెట్టారు. ఆ కాలంలో మద్రాసు గవర్నరు గా వచ్చిన Wenlock[79] ప్రభువు గారు శేషయ్య శాస్త్రిగారి శక్తియుక్తులను గూర్చి, వారు సంస్థానమునకు చేసిన అఖండ సేవను గూర్చి ప్రశంసించారు. పుదుక్కోట సంస్థానాధీసులైన కొత్త రాజాగారినుద్దేశించి హితోపదేశము చేసినారు.

శ్రీ శాస్త్రిగారు దివాన్గిరీ రీజెంటు పదవి నుండి విరమించుకున్న తరువాత కుంభకోణములో కావేరీ నదీ తీరాన తమ స్వంత భవనములో విశ్రాంతి తీసుకోవడం

— ✦ ❖ ✦ ——

[79] వెన్లాక్ పూర్తి పేరు Beilby Lawley. 3rd Baron Wenlock.

digavalli1943@gmail.com

అనుబంధము-1

18-19 శతాబ్దపు కొందరు[80] ఆంధ్ర ప్రముఖులు
(చిన్న నోట్సులు, పూర్తికాని వ్యాసములు)

జూలూరు అప్పయ్య[81], రావిపాటి గురుమూర్తి శాస్త్రి: చార్లెస్ ఫిలిప్ బ్రౌన్(సి.పి. బ్రౌన్)[82]దొర గారు 1831సం॥ బందరులో ఉన్నప్పుడు జూలూరు అప్పయ్య గారు ఆయనకు పండితులుగా ఉండేవారు. బ్రౌన్ దొరగారు రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారి[83] సహాయం కూడా పొందేవారు. గురుమూర్తి శాస్త్రి గారు చెన్నపట్నం కోట కాలేజీలో పండితులుగా ఉండి 1820సం॥లో ప్రధాన ఉపాధ్యాయుడైనాడు. క్యాంబెల్[84] దొర గారు, బ్రౌన్ గారు కూడా ఈయనను ప్రశంసించారు. ఈయన అనేక గ్రంథములు రచించారు. అవి అచ్చు పడ్డాయి.

కోలా శేషాచల కవి[85]: 1846సం॥లో నీలగిరి యాత్ర రచించినాడు విశాఖపట్నంలో ఒక జమీందారుడైన గోడే వెంకట జగన్నాధ రావు గారికి అంకితం ఇచ్చాడు. ఆ జమీందారు చెన్న పట్టణంలో ఇంగ్లీషు చదువుకున్నాడు. ఈ చరిత్ర 1853సం.లో అచ్చు పడింది దీనిలో చాలా ఇంగ్లీషు మాటలు ఉన్నాయి.

---

80 రచయిత చేతి వ్రాత ప్రతులలో 18-19 శతాబ్దపు ఆంధ్ర ప్రముఖుల పేర్లు జాబితాలుగా నుండి కొన్నిటికి మాత్రమే చిన్న నోట్సులాగ వివరణ వ్రాసినారు. వాటిలో కొన్నిటిని మాత్రమే ఇచ్చట ప్రకటించడమైనది

81 జూలూరి అప్పయ్య గారి జీవితకాలము అంచనా1780-1860.

82 ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సి.పి. బ్రౌన్) దొర గారు 1822 అక్టోబరులో మచిలిపట్నం కోర్టులో Register, 1824సం॥ రాజమండ్రిలో Assistant to Collector, 1826సం॥ కడప, 1831సం॥ బందరు, 1833సం॥ రాజమండ్రీ 1834సం॥ కోరంగి

83 రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారి జీవితకాలం అంచనా 1770-1836. వీరి రచినలు- విక్రమార్క కథలు (1819) పంచతంత్ర కథలు (1834), తెలుగు వ్యాకరణము (1836).

84 ఎ.డి. క్యాంబెల్ (1789-1857) దొరగారు సి.పి. బ్రౌను కంటే చాలా ముందే సైంట్ జార్జి కాలేజీకి వరిష్ఠ అధికారిగా నుండి తెలుగు నేర్చుకుని 1816సం॥ లోనే తెలుగు వ్యాకర్ణమును, తరువాత 1821సం॥లోతెలుగు-ఇంగ్లీషు నిఘంటువు కూడా ప్రకటించారు.

85 కోలా శేషాచల కవి జీవిత కాలం అంచనా 1800-1860.

బేతపూడి సుందర రామయ్య[86]

1846 సం.లో నే బేతపూడి సుందర రామయ్యగారు నీలగిరి యాత్ర చేసి బొమ్మదేవర నాగన్న నాయుడు గారికి అంకితం ఇచ్చారు. ఇది 1864సం॥ లో అచ్చుపడింది. దీని రెండవ భాగం అర్జీలు. వీటిలో ఇంగ్లీష్ మాటలు చాలా ఉన్నవి. సుందర రామయ్య గారు బందరు దగ్గర పులివర్రు కాపురస్తులు. బందరులో చదువుకొని చెన్నపట్టణం వచ్చారు. అక్కడ కాలేజీలో ప్రవేశించారు. అక్కడ తెలుగు ఇంగ్లీషు సంస్కృతం అభ్యసించటానికి సర్కారు ఏర్పరచిన కలెక్టరేట్ టీచర్ పనిలో ఏడు సంవత్సరాలు పనిచేశారు. 1836 సం.లో ఆ పనులు తగ్గించినందువలన ఖాళీగా ఉన్నారు. ఎ.డి. క్యాంబెల్ గారి ప్రాపకం వల్ల అప్పట్లో కెప్టెన్ రొలండ్ [87] గారు మళ్ళీ కాలేజీలో పని యిచ్చారు. మున్షీ పనులు కూడా చేస్తూ చాలాకాలం జీవనం చేశారు. తెలుగు పరీక్షాధికారులైన దొరలు జాన్ మక్కెరల్, ఎ.డి. క్యాంబెల్, జె.సి. మారీసు , సి.పి. బ్రౌన్, జె.డి. మర్డనాల్డు అనే దొరలు సన్నిధాన వర్తులు[88]. సైదాపేట మీనాక్షయ్య, రావిపాటి గురుమూర్తి శాస్త్రి, అడక్కి సుబ్బారావు, శ్రీపెరంబుదూరు కృష్ణమాచార్యులు, రావిపాటి గురవయ్య ద్వారా పరీక్షింపబడి ఆయా జిల్లాల్లో నియమింపబడతారు. హైస్కూల్లో పవెల్ దొర ప్రధానాధికారి.

కాలేజీ బోర్డు వారు సుందర రామయ్య గారిని తెలుగు మున్షిగా పని ఇచ్చిన తరువాత సెలవు పుచ్చుకొని ఎం. ఒగల్వీ, ఆర్.ఎస్. ఎర్లిన్ దొర గార్లకు తెలుగు చెప్పడానికి వారితో 1846 సం. నీలగిరికి వెళ్లారు. ఆ యాత్రను వర్ణిస్తూ గ్రంథములు రచించారు. ఈ గ్రంథం

---

86 బేతపూడి సుందర రామయ్య గారు (1800-1865) రచించిన పుస్తకం పేరు నీలగిరి చరిత్ర అని తెలుస్తున్నది.

87 కెప్టన్ మైఖేల్ జాన్ రొలండ్ (1804-1894) సైనికాధికారి. సాహిత్య పరంగా బహుభాషా కోవిదుడైనందున సైంట్ జార్జి కాలేజీలో కూడా వీరు అజమాయిషీ స్థాయిలో పనిచేసినరు. బేతపూడి సుందర రామయ్య గారిని కాలేజీలో ఉపాధ్యాయునిగా నియమించినాడు.

88 సన్నిధానవర్తులు = సాహిత్యపరంగా తెలుగు భాషాభ్యాసన విషయంలో ఆంతరంగిక బృదం- సైంట్ జార్జి కాలేజీలో తెలుగు భాష పరీక్షాధికారులగానుండిన దొరలుకు తెలుగు భాషనేర్పి వారికి తెలుగు పరీక్షాధికారులగా నుండిన పండితుల దాదాపు 20మంది లో ముఖ్యులు రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారని తెలియుచున్నది.

1864 సం. అచ్చయ్యే నాటికి కొన్ని మార్పులు చేశారు. అర్జీలు (అను పుస్తక విభాగం) రెవెన్యూ అండ్ మెజిస్ట్రేట్ డిపార్ట్మెంట్ పబ్లిక్ వర్క్ డిపార్ట్మెంట్ మిలటరీ డిపార్ట్మెంట్ అను నాలుగు శీర్షికలుగా విభజింపబడినది.

పెద్దాడ నాగరాజు గారు (1760- 1825)

వీరొక సుప్రసిద్ధ సిద్ధాంధ్ర కవి అని పోలవరం రాజా కొచ్చర్లకోట రామచంద్ర వెంకట కృష్ణా రావు గారి జనక కుటుంబానికి చెందిన వారని, వీరి శకుంతలా పరిణయమను గ్రంథమును రాజా గారు ముద్రించారని చిలకమర్తి వారి స్వీయ చరిత్రలో వ్రాశారు. విప్రకులదర్పణమనే గ్రంథములో పుట 38-39లో వీరిని గురించి కొన్ని వివరాలున్నాయి మొగల్ తుర్రు సంస్థానం జమీందారు, కలిదిండి తిరుపతి రాజుగారి సంస్థానంలో ఈ నాగరాజు గారు 30 సం పాటు ఆస్థాన కవిగానుండిరి. 1766సం॥ లో కంపెనీ ప్రభుత్వం వారు దక్కన్ సుబేదారు వల్ల ఉత్తర సర్కారులు కౌలుకు పొందారు. [మొగలితుర్రు ఉత్తర సర్కారులోనుండిన సంస్థానము]. అక్కడ Sadlier[89] అను దొర అవినీతిని మొగలితుర్రు కలిదిండి తిరుపతి రాజు గారు సాగనివ్వనందున ఆ రాజాగారి మీద పగపట్టి ఇతర జమీందార్ల పేష్కస్సు వసూలుకు కలిదిండి తిరుపతి రాజు గారిచ్చిన పూచీ క్రింద ఈ తిరుపతి రాజు గారి రాజ్యాన్ని 1780సం॥ జప్తు చేయించి కలెక్టరు పాలనలో పెట్టించాడు. 1790సం॥లో తిరుపతి రాజుగారు చనిపోగా ఈ సంస్థానమును కంపెనీ రాజ్యంలో కలిపేసినారు. 1802సం లో కంపెనీ ప్రభుత్వము వారు రాజమండ్రీలో అదాలత్ కోర్టును బందరులో ప్రొవెన్సియల్ కోర్టు స్థాపించినారు. మొగలితుర్రు ఆస్థాన కవిగా మానేసిన తరువాత మన పెద్దాడ నాగరాజు గారు బందరు ప్రొవెన్సియల్ కోర్టులో ప్లీడరు గా కూడా పనిచేసియున్నారు. విప్రకులదర్పణం అనే గ్రంథములో 38-39 పుటలలో వీరిని గురించి కొన్ని వివరాలున్నాయి.

---

89 యాంథోని శాడ్లియర్ అను దొర ఉత్తర సర్కారులలోని మచిలీపట్నం ఛీఫ్ ఇన్ కౌన్సిల్ లో సభ్యుడు. వీరి అవినీతి చర్యయలపై విచారణ జరిగినది.

పరవస్తు చిన్నయ సూరి (1809-1862)గారు

పరవస్తు వారు చాత్తాడ వైష్ణవులు. శ్రీపెరంబుదూరు జన్మస్థానం. తండ్రి పరవస్తు వెంకటరంగ రామానుజాచార్లు గారు. ఆయన సుప్రీంకోర్టులో న్యాయాధిపతులకు హిందూ ధర్మ శాస్త్ర సలహాదారుగా నుండెను.

చిన్నయ సూరి సంస్కృతాంధ్ర, ప్రాకృత, ద్రావిడ భాషలందు, వ్యాకరణ తర్క, మీమాం సాలంకార శాస్త్రములందు పాండిత్యము సంపాదించెను. ఇంగ్లీషు పరిచయము కలదు. 1844-1847సం॥. పచ్చయ్యప్ప పాఠశాలలో ఆంధ్ర పండితుడు. 1847సం.లో మద్రాసు రాజధాని కళాశాలకు పూర్వ రూపమగు 'యూనివర్సిటి' అనే స్కూల్లో ఆంధ్ర పండితుడుగా నియమింప బడియుండెను. చిన్నయ సూరి నీతిచంద్రిక 1853సం॥లో ప్రచురింపబడినది. చిన్నయ సూరి వ్యాకరణము 1858 సం॥. ప్రకటించబడినది. చిన్నయసూరి 1862సం॥ లో మరణించిరి. చిన్నయ సూరిగారు అకారాది నిఘంటువు, సంస్కృతాంధ్ర వ్యాకరణము, విశ్వ నిఘంటువునకు టీకా రచింప నారంభించారు గానీ ముగింప లేదు. దానిని సమగ్రమముగా చేయింపవలెనని హెనౌరబ్లె గాజుల లక్ష్మీనరుసు సెట్టి గారు బహు ప్రయత్నం చేయుచున్నారని బహుజనపల్లి సీతారామాచార్యులు వారు 1865 సం. జనరంజని పత్రికలో వ్రాసిరి.

చిన్నయ సూరి రచించిన నీతిచంద్రికను 1853సం.లో వారు స్థాపించిన వాణి దర్పణ ముద్రాక్షరశాలలో ముద్రించినాడు. తనను ఆదరించిన విద్యాధికారి ఆర్బుతు నాట్ దొర గారికి అంకితం చేసినారు.

శబ్ద లక్షణ సంగ్రహమను నింకొక వ్యాకరణ గ్రంథమును కూడా 1853సం.లో ముద్రించినాడు. బాల వ్యాకరణము 1858సం. లో ప్రకటింప బడినది. శబ్ద లక్షణ సంగ్రహమును తన మిత్రుడైన గాజుల లక్ష్మీనరుసు సెట్టి గారికి అంకితమిచ్చినారు. అందులో నిట్లు వ్రాసినారు: "బాల్యంబు దొరకొని మదీయ మిత్రులు దేశభాషా పరిజ్ఞానంబున నిరతిశయంబైన దేశాభిమానంబును గలిగి బహుజనోపకార కార్యలం బ్రవర్తించుచు గీర్తి సమార్జించు గాజుల లక్ష్మీనరుసు సెట్టి గారి వలన

బహుపకారంబులం బడసిన వాడం గావుటం జేసి కృతజ్ఞతాభి వ్యంజనముగా ఈ గ్రంథము తదీయాంకితంబు గావించినాడ"

వేదం వేంకటరమణ శాస్త్రులు గారు (1837-1900)

వేదం వేంకటరమణ శాస్త్రులుగారు కావాలి తాలూకా ఇసుకపల్లెకు సమీపాన మల్లయ పాళెం గ్రామంలో వేంకట్రాయ శాస్త్రి గారి కుమారుడు. వారు వేద శాస్త్రములలో ప్రఖ్యాతులు. వెంకటరమణ శాస్త్రి గారు కంచిలోని పత్తి వెంకట రామ శాస్త్రి గారి వద్ద విద్యాభ్యాసముచేసి చెన్నపట్నం ముత్యాల పేట సంస్కృతాంధ్ర ద్రవిడ పాఠశాలలో ప్రధాన పండితులైరి. తరువాత కాకినాడ, నర్సాపురం, కోడూరు, విశాఖపట్నం గ్రామాల్లో పనిచేసి రాజమండ్రి ప్రొవెన్షియల్ స్కూలు-కాలేజీలో ప్రధాన సంస్కృత పండితులుగా నుండి ఉపకార వేతనం పొందిరి.



వేదం వేంకట్రాయ శాస్త్రి గారు వీరి ప్రథమ పుత్రులు. 1853సం. లో జన్మించిరి. (భారతి 1935 మే పుట 737).

వేంకటరమణ శాస్త్రి గారు తమ 83వ ఏట 1900 వ సంవత్సరంలో చనిపోయిరి.

వేదం వేంకటరాయ శాస్త్రి(1853-1929)[90]

[90] శ్రీ వేంకటరాయ శాస్త్రిగారు ది. 05-12-1927తేదిన విజయవాడ వచ్చినప్పుడు వారికి బెజవాడ మునిసిపాలిటీ వారు సమర్పించిన అభినందన పత్రమును తమే రచించినటుల కీ.శే. దిగవల్లి వేంకట శివరావుగారు తమ దినచర్య పుస్తకములో వ్రాసుకునియుండిరి. అభినందన పత్రము శుద్ధ ప్రతి (చూడు పుట 140)

కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు

వీరు మాధ్వులు. 1842 మార్చి 24వ తేదీన వినుకొండలో జన్మించిరి. వీరి తండ్రి నరసింగ రావు గారు సర్వే శాఖలో ఉద్యోగి గా వినుకొండలో నుండి 1845సం॥లో ఆయన చనిపోగా వినుకొండలో నుండిరి. తల్లి రామాయమ్మగారి అక్కగారైన రాజాంబ గారి భర్త ధన్వాడ శ్రీనివాసరావు గారు గుంటూరు జిల్లాలో శిరస్సాదారుగా నుండిరి. రామాయమ్మ గారు కానూరు లో వారింటనుండిరి.

ఆ కాలమున గుంటూరు జిల్లా కలెక్టర్ H. Strokes. వెంకటరత్నంగారికి 5వ ఏట అక్షరాభ్యాసమైనది. తెలుగు సంస్కృతం నేర్చిరి. 8వ ఎట ఇంగ్లీషు బడిలో ప్రవేశపెట్టిరి.

1855 సం॥లో వివాహము. గుంటూరు కలెక్టర్ ఆఫీస్ లో గుమస్తాగా చేరి ఒక ఏడాది పని చేసిరి. 1856సం॥లో తల్లి గారితో చెన్నపట్నం వచ్చిరి. అక్కడ ఆయన ఇంగ్లీషు ఉత్తరములు, దరఖాస్తులు వ్రాసి, లెక్కలు వ్రాసి లేఖన వృత్తితో జీవించిరి. ఆ కాలమున కంచి, తిరువళ్ళూరు దర్శించినారు. సేలంలో సర్వే పార్టీలో compositor గా ఉద్యోగం చేసిరి. కోయంబత్తూర్ లో కూడా పనిచేసిరి. ఒక పాఠశాలలో తెలుగు, తమిళ పండితుడుగా పనిచేసినారు. పాలఘాటులో తెలుగు పిల్లలకు పాఠశాల స్థాపించిరి. మంగళూరులో కన్నడ భాషా పండితుడుగా కొన్ని నెలలు పనిచేసిరి. 1864సం॥ లో చెన్నపట్నం స్థిరనివాస మేర్పరచుకొనిరి. 1865 సం॥లో…కు గుమస్తాగా పనిచేసిరి. 1868 సం॥లో రివెన్యూ బోర్డు ఆఫీసులో శిరస్తాదార్ గారు సుంకు జయరామారావు శ్రేష్ఠి గారాయనకు బోర్డు వారి Standing Ordersను తెలుగులోనికి భాషాంతరీకరణము చేయనియోగించిరి. పంతులుగారు అద్వైతియై శృంగేరి స్వాముల వారి కోరిక పైన శంకర విజయమును తెనుగు చేసిరి. 1871 సం॥లో ఆంధ్ర భాషాసంజీవని స్థాపించిరి. 1872 సం॥లో రాజధాని కళాశాలలో తెలుగు పండితుడై 22 సంవత్సరాలు పనిచేసిరి. 1892 సం॥ [కందుకూరి] వీరేశలింగం గారు రెండు సం॥లు. సెలవు పైన రాజమండ్రి నుండి చెన్నపట్నం వచ్చారు. ఆపదవికి వెంకటరత్నం గారిని రాజమహేంద్రవరం కాలేజీకి ట్రాన్స్ఫర్ చేశారు. అక్కడ ఎనిమిది సంవత్సరాలు ఉద్యోగం నిర్వహించిర. వీరికి ప్రభుత్వం వారు మహోపాధ్యాయ బిరుదునిచ్చిరి.

గోడే జగ్గప్ప గారు (1769-?)

కార్మికేల్ (David Freemantle Carmichael) గారు రచించిన విశాఖపట్టణం మాన్యువల్ 1865 సం॥లో ప్రకటించబడినది. దానిని ఆనందగజపతి మహారాజు గారు తెలుగులోకి అనువదించి ముద్రించారు. నవాబు నిజామలీ ఖాన్ వల్ల 1766 సం॥లో ఉత్తర సర్కార్లు కవులు పుచ్చుకున్న తరువాత 1769 సం॥లో ఈ రాజ్య భాగాన్ని స్వాధీనం పరుచుకున్నారని అప్పట్లో బందర్ లోని కంపెనీ ఏజెంటునే అక్కడ కార్యాలోచన సభలో ముఖ్యాధికారిగా (Chief in Councilగా) రాజ్యాన్ని పాలించమని కంపెనీ డైరెక్టర్లు నియమించారని క్రిష్ణా డిస్ట్రిక్టు మాన్యువల్లో వున్నది.

అలాగే విశాఖపట్టణంలో 1769 సం॥ Chief in Council గా నియమింప బడిన Andrews దొర దగ్గర గోడే జగ్గప్ప గారు దుబాషీగా ఉండేవారు. ఆయన చాలా గొప్ప పలుకుబడి కలిగి చాలా ధనవంతులైనారు. 1802 సం॥లో శాశ్వత ఫైసలా జరిగినప్పుడు హవేలీ[91] గ్రామాల ముఠాలలో ఆరు ముఠాలను ఆయన వంశీయులు కొని ప్రొప్రైటర్లైనారు. వాటికి జమీందారీ పట్టాలు పొందారు

ఈ గోడేవారి వంశీయులలో 1788- 1841 సం॥ మధ్యకాలంలో గోడే సూర్య ప్రకాశ రావు గారు దానధర్మాలకు పండిత పోషణకు పేరు పొందారు. పరవస్తు శ్రీనివాసాచార్యులు గారు అనే గొప్ప సంస్కృత పండితులు వారి పోషణలో శబ్ద బోధిని అనే సంస్కృత నిఘంటువును 4-5 అక్షరముల వరకు రచించి పరమపదించారు.

సూర్య ప్రకాశ రావు గారు చనిపోయిన తరువాత వారి సతీమణి జానకమ్మ గారు శ్రీనివాసచార్యులు గారి కుమారుడైన రామానుజాచార్యులు, వేంకట రంగాచార్యుల వారిచేత దానిని పూర్తి చేయించి ముద్రింపజేశారు.

జానకమ్మ గారు మంచి తెలివితేటలు గలవారు. విశాఖపట్టణంలోని సెంట్ జార్జి కాన్వెంట్ లోని దొరల చేత తమ కుమార్తె రత్నమ్మ రావు గారికి ఇంగ్లీషు చెప్పించారు.

[91] బ్రిటిష్ ప్రభుత్వం వారి స్వాధీనంలో వున్న భూములను, గ్రామాలను హవేలి భూములు, గ్రామాలని అనేవారు.

అంతేకాక 1867 సం॥ ఏప్రిల్ లో వారి పర్యవేక్షణ కింద ఒక స్త్రీల పాఠశాలని విశాఖపట్టణంలో స్థాపించారు. అందులో చదువుకున్న స్త్రీలు ఇంగ్లీషు, తెలుగు, అల్లిక పని మొదలైన వాటిని అభ్యసించేవారు. ఆ పాఠశాల దినదినాభివృద్ధి చెందినది.

జానకమ్మ గారి కుమార్తె రత్నమ్మ గారిని అనకాపల్లి ప్రొప్రైటరైన జి.ఎల్ నరసింహ రావు గారికి ఇచ్చి వివాహం చేశారు. రత్నమ్మ గారు, నరసింహ రావు గారు ఆ స్త్రీల పాఠశాల అభివృద్ధికి కృషి. చేశారు. ఆ పాఠశాలకి ఒక సొంత భవనము నిర్మించారు. అప్పటి కలెక్టర్ J.L. Michin (మిన్ చిన్) దొరగారు అప్పట్లో విశాఖపట్నంలో మిషనరీల ప్రధానాచార్యుడు. ఈ విషయమై చాలా శ్రద్ధ తీసుకున్నారు. ఈ పాఠశాలలో తయారుచేసిన అల్లిక నమూనాలను అప్పటి గవర్నరైన Francis Napier (ఫ్రాన్సిస్ నెపియర్) గారికి కలెక్టర్ గారు పంపగా ఆయన చాలా సంతోషించారు

ఈ పాఠశాల వార్షికోత్సవం 1868 సం॥లో జరిగినప్పుడు గొప్ప సభ జరిగింది. స్త్రీ పురుషులు చాలామంది వచ్చారు. దీనిని గురించి Madras Revenue Register, Madras Journal of Education లోను ప్రకటించబడినది.

జి.ఎల్. నరసింహ రావు గారు మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్లో సభ్యులుగా ఉండేవారు.

గోడే అంకితం వెంకట జగ్గా రావు గారు 1817- 1856 సం॥ మధ్యలో విశాఖపట్టణంలో దేశీయ ప్రముఖులలో నొకరు. వీరు విద్యా పోషకులు. చుక్కల మేడ అనే నక్షత్రాల [అధ్యయనానికి.] విశాఖపట్టణంలో నిర్మించారు. ఈ ఖగోళ శాస్త్రం విషయమును గూర్చి Madras Revenue Register, Madras Journal of Education లో గొప్ప వ్యాసం వ్రాశారు. వీరు మద్రాస్ లో వృత్తాంతి పత్రికను స్థాపించారు. దానిని గూర్చిన వివరాలు C.P. Brown సాహిత్య జీవిత చరిత్రలో ఉన్నది. (పేజీ 62). వీరు పరవస్తు శ్రీనివాసాచారి గారికి ఇల్లు కట్టించి ఇచ్చారు. తాము నిర్మించిన కోదండ రామాలాయానికి స్థానికాచార్యులుగా నియమించి నెలకు 30 రు జీతము ఏర్పాటు చేశారు.

వృత్తాంతి- గోడే జగ్గారావు గారి యాజమాన్యం.

Letters and autobiography of CP Brown page 62 edited by Bangorey S.V University

In one of his [*Bangorey's*)] MSS he made an interesting note on the first known Telugu Weekly, Vrithanthi as follows "the Telugu newspaper we at present have but one denominated the Vrithanthi which appears once a week at of half a Rupee per month. It is a Hindu publication independent of European guidance or assistance and is under the care of the opulent and learned Godey Jaggarao of Vizagapanam who is known to the readers of the Madras Journal (of Literature and Science) by some ingenuous English essays on mathematical subjects printed in that Journal. In this paper (Vrithanthi) we also find a perfect loyalty to the British Government but a strong feeling against the progress of Christianity. It would be more popular but that the sensible proprietor forbade the discussion of braminical divinity and sectarian questions which are to the Hindu Society what politics are in England. The once fashionable theme of conversation". See MSS Eur B 64-10 L London. Microfilm copies of the manuscripts volumes of Brown's collections lying in the Indian Office Library, London.

జగ్గారావు గారి అనంతరం గోడే నారాయణ గజపతి రావు గారు 1828-1902సం॥ మధ్యకాలంలో విశాఖపట్టణం ప్రజా జీవితంలో పాల్గొంటూ మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించారు. మద్రాసు శాసన సభ సభ్యులు. విశాఖపట్టణంలో Mrs. A.V.N. College అని ప్రఖ్యాతి చెందిన కాలేజీని స్థాపించిన వారు ఈ గోడే నారాయణ గజపతి రావు గారే.

కావలి వెంకట బొర్రయ్య గారు 1776-1803

విస్సన్నపేట జమీందారు దరిగొండ రమణప్ప గారు ఏలూరులో కావలి వెంకట సుబ్బయ్య గారి కుమార్తెను వివాహమాడినారు. ఆమె సోదరుడే కావలి వెంకట బొర్రయ్య గారు. విస్సన్నపేట జమీందారీ తుదకు కావలి వారికి సంక్రమించింది

కావలి వెంకటసుబ్బయ్య

లక్ష్మీదేవమ్మ సీతయ్య వెంకట బొర్రయ్య వెంకటలక్ష్మి వెంకట రామస్వామి

వంశ వృక్షం కృష్ణా జిల్లా మాన్యువల్లో వున్నది. చూడు పుట 338

తూర్పుఇండియా వర్తక కంపెనీ క్రింద ఇంజనీర్ గాను, సర్వేయరు జనరల్ గాను పనిచేసిన కర్నల్ మెకంజీ (Col. Collin Mackenzie) గారి దగ్గర గుమస్తాగా చేరి దేశ చరిత్రకు సంబంధించిన శాసనాలు, కైఫియతులు మొదలైన వాటిని సేకరించి ప్రఖ్యాతి వహించిన కావలి వెంకట బొర్రయ్య గారు ఏలూరు కాపురస్తులు. వీరు ఐదుగురు అన్నదమ్ములు. బొర్రయ గారు 1776 సం॥లో ఏలూరులో జన్మించి ఐదేండ్లు వచ్చువరకు వీధిబడిలో తెలుగు, సంస్కృతం అభ్యసించారు. ఏలూరుకు దగ్గర ఉన్న కొత్తూరులో ఒక మహమ్మదీయ జాకీర్ దగ్గర పారసీకము, హిందూస్థానీ భాషలు నేర్చుకున్నారు. పదునాల్గేండ్ల వయసులో 1790సం॥ అ ప్రాంతాల్లో మచిలీ బందరులో మార్గన్[92] అనే ఒక దొర పెట్టిన ఇంగ్లీషు పాఠశాలలో ఇంగ్లీష్ నేర్చుకున్నారు.

ఏలూరు తిరిగి వచ్చిన తరువాత అక్కడ సిపాయిల దళానికి అధిపతి అయిన కర్నల్ పియర్సు [Later Maj. Gen. Thomas Pears] దొరతో పరిచయం చేసుకొని సైన్యానికి జీతం పంచి యిచ్చు మిలటరీ పే మాస్టర్ ఆఫీస్ లో ఒక గుమస్తాగా ఉద్యోగం సంపాదించారు. ఒంగోలు, మునగాల, కొండపల్లి మొదలైన చోట్ల గల సైన్యానికి స్థావరాలలో సిపాయి దళాలకు జీతాలు పంచి ఇవ్వడానికి వెళ్లేవారు. డెంటు [John Dent దొర దగ్గర బందరు ఇంగ్లీషు ఫ్యాక్టరీలో లేఖరి (గుమస్తా) పనిలో చేరదల్చినారు. అప్పట్లో కర్నల్ మెకంజీ

---

92 మార్గన్= మోర్గన్ పూర్తి పేరు విలియమ్ కేరీ మోర్గన్ 1890సంలో మచిలీపట్నంలో స్థాపించిన పాఠశాల Morgan's Boys School.

దొరగారి దగ్గర బొర్రయ్య గారి అన్నగారు నారాయణప్ప గారు దుబాషిగా పనిచేస్తున్నారు. 1792-93 సం॥లో మెకంజీ హైదరాబాద్ లో ఉండగా బొర్రయ్య గారిని పరిచయం చేసినారు. 1794సం॥ లో బొర్రయ్యగారి తెలివితేటలకు హర్షించి తన క్రింద హెడ్ గూమాస్తాగా నియమించిరి. అప్పటికి ఆయన వయస్సు 18 సంవత్సరాలు. అప్పట్లో ప్రయాణ సౌకర్యములు లేవు. బొర్రయ్య గారు అడవులలో కొండలలో ప్రయాణం చేయుచు చరిత్రకు సంబంధించిన [సమాచారం] సేకరించేవారు.

మెకంజీ గారు శ్రీశైల క్షేత్ర మును సర్వే చేయుటకు అక్కడ ఉన్నప్పుడు ఆ గర్భాలయము నాయన చూడవలెనని, శ్రీ శైల క్షేత్ర విశేషములను తెలుసుకొనవలెనని చాల కుతూహలము కలవాడయ్యెను. అయితే క్రైస్తవులు, మ్లేఛ్ఛులు లోపలికి పోవుటకు వీలు లేదు. బొర్రయ్య గారు ఒక ఉపాయం ఆలోచించి రెండు మూడు పెద్ద అద్ధములను తెప్పించి వానిని తగు ప్రదేశంలో నుంచి గర్భాలయంలోని శివలింగము వెనుక దానిలో నుండి ఇంకొకదాని లోనికి ప్రతిఫలింప చేసి మెకంజీ గారికి చూపగా ఆయన చాలా సంతోషించెనని Campbell[ఎ.డి. క్యాంబెల్] దొరగారు రచించిన ఒక పుస్తకంలో ఫుట్ నోట్ లో తాము చూచినామని దాసు విష్ణురావు[93] గారు 1935సం॥.లో తమ స్వీయచరిత్రలో వ్రాసినారు. తెలుగు శాసనములు పఠించి ప్రతిబింబములు వ్రాయుచు హళె, కన్నడము మొదలైన దేశీయ భాషలను చదివి అందలి శాసనములను అర్థము చేసుకొని చరిత్రాంశములను ఇంగ్లీషులోనికి అనువదించుట, తాము చూచిన ప్రాంతముల పటములను యంత్ర సహాయం లేకనే చేతితో వ్రాయ గలుగుట మొదలైన అనన్య సామాన్యములైన ప్రావీణ్యములకు మెకంజి గారి మెప్పును పొందినాడు.

1797సం॥లో మెకంజి గారు మనీలాకు వెళ్లవలసినది కాని అక్కడ తిరుగుబాటు జరుగుటవలన ఆయన మరల హైదరాబాద్ కు తిరిగి వచ్చినాడు. ఇంతలో మైసూరులో టిప్పు సుల్తాన్ తో యుద్ధం వచ్చినందున 1790సం॥లో మెకంజి గారు మైసూరు పోయిరి. బొర్రయ గారు ఆయన తోడి వెళ్ళిరి. 1795సం॥లో టిప్పు సుల్తాను యుద్ధంలో

93 దాసు విష్ణురావు గారు మహాకవి దాసు శ్రీరాములు (1846-1908) గారి 5వ కుమారుడు. విజయవాడలో న్యాయవాది

digavalli1943@gmail.com

మరణించగా శ్రీరంగపట్నం కంపెనీ వారికి స్వాధీనమైనది. అక్కడ ఇంగ్లీషుల సైనికులు చాలానాళ్లు ధన కనక వస్తు వాహనాలను దోచుకున్నారు. అక్కడ పరిపాలన కొరకు ఒక కమిషన్ ఏర్పడెను. దానికి మెకంజి గారు సలహాదారుగా ఉండెను. 1800 సం॥లో మెకంజి గారు మైసూర్ సర్వే పని చేసిరి. ఆ సందర్భంలో బొర్రయ్య గారు చిత్రదుర్గము, బెంగళూరు నిజగల్లు లోనగు ప్రదేశములలో పర్యటించినారు. 1801సం. లో చెన్నపట్నం కోటలోనే మెకంజీ గారు ఉద్యోగరీత్యానుండగా బొర్రయ్య గారు అంతవరకు సేకరించిన శాసనముల ప్రతిబింబములు వ్రాసి వాటి ఇంగ్లీషు అనువాదములు తయారు చేశారు. బొర్రయ్య గారు 1803సం॥ లో చనిపోయే నాటికి ఆయన తమ్ముడు [కావలి]లక్ష్మయ్య గారు కూడా మెకంజి గారి క్రింద పని చేయుచుండిరి.

కాంద్రేగుల జోగిపంతులు[94]

కాంద్రేగుల జోగి పంతులు గారి పూర్తి పేరు కాంద్రేగుల జోగి జగన్నాథరావు పంతులుగారు. వారు కరణ కమ్మ వేపారులు. వారి తండ్రి పేరు ఇతర వివరాలు తెలియడం లేదు. కాంద్రేగుల అనే ఊరు నేటి తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం తాలూకాలో నున్నందువల్ల వారి కాపుర స్థలం ఆ ఊరని చెప్పవచ్చును. అదివరకు నవాబుల క్రిందను, పెద్దాపురం వగైరా సంస్థానం వారి క్రిందను తరువాత ఇంగ్లీషు కంపెనీ వారి క్రిందను ఉద్యోగాలు చేశారని చెప్పడానికి ఆస్కారం ఉన్నది. ఏ ఉద్యోగాలు చేసింది తెలియడం లేదు. గాని 1759 సం॥ నాటికి ఆయన బందరులో కంపెనీ దొరల దగ్గర దుబాక్షిగా వున్నట్లు ఎంచడానికి అవకాశం వున్నది. 1762- 1764 సం॥ల మధ్య బందరులో ఇంగ్లీషు కంపెనీలో చీఫ్ ఇన్ కౌన్సిలు వర్తక వ్యాపారాలలో పాటు దేశ పరిపాలన జరిగించే ముఖ్య అధికారి అయిన జాన్ పైబస్[95] దొరగారికి జోగిపంతులు గారు సొంత దుభాషిగా నున్నట్లు వారి రికార్డులలో నున్నది. 1759 సంవత్సరం ఇంగ్లీషు వారికి హైదరాబాద్ నవాబు ఇంగ్లీషు కంపెనీకిచ్చిన బందరు హవేలీ భూముల అమరకం

---

[94] కాంద్రేగుల జోగి పంతులు గారి జీవిత కాలం అంచనా 1720–1790.

[95] జాన్ పైబస్ (1727–1789).

పనులలోను, నిజాంపట్నం ఉప్పుమళ్ళ వేలంలోనూ ఇంకా ఇతర పనుల్లోనూ ఫైబస్ దొర జోగి పంతులు గారిని నియోగించినట్లు ఆ సందర్భంలో జోగిపంతులుగారు బందరు కొండపల్లి నిజాంపట్నం వగైరా ప్రాంతాల్లో పనిచేస్తూ బాపట్లలో దేవాలయం మరమ్మత్తును చేయించినట్లు కనబడుతున్నది. కంపెనీ వారు హైదరాబాద్ నవాబైన నిజాం అలీ ఖాన్ దగ్గర నుంచి ఉత్తర సర్కారులను కౌలు పొందడానికి రాయబారాలు జరిగించడంలో ఫైబస్ గారు జోగు పంతులు గారిని హైదరాబాద్ పంపించారు కానీ కార్యం సఫలం కాలేదు.

ఆ కాలంలో విజయనగరం సంస్థానాన్ని పరిపాలించే రాజు గారి అన్నగారైన సీతారామరాజు గారు కంపెనీ వారికి స్నేహితుడైనాడు. ఆయన కొంతకాలం ఆ సంస్థానాన్ని పరిపాలించాడు. శిస్తుల వసూళ్లలో చాలా సమర్థుడు. ఆయనకు కంపెనీవారు కొన్ని గ్రామాలు పది సంవత్సరాలుగా కవులకిచ్చారు. ఆయన భూమి అమరకం పద్ధతి, శిస్తు వసూలు పద్ధతి, జమాబంధీ విధానములు జోగిపంతులుగారు స్వయంగా వెళ్లి చూసి వచ్చారని ఆ పద్ధతినే కంపెనీ వారు రాజమహేంద్రవరం సర్కారులు స్వాధీన పరచుకున్నప్పుడు అక్కడ ప్రవేశపెట్టారని ఇంగ్లీషు గ్రంథకర్త యొకడు వ్రాశాడు.

బందరు కింద ఉన్న హవేలీ భూములు అమరకమును గూర్చి వ్రాయబడిన వివరాలలో జోగిపంతులు గారు పనిచేసినట్లున్నది. తరువాత ఆయన కుమారునికే పదేండ్లు కౌలుకిచ్చినట్లు కనబడుతున్నది. జోగిపంతులుగారు కంపెనీ వారికి చేసిన సేవను ప్రతిఫలంగా వారికి దివిసీమను బహుమతిగా ఇచ్చారు. జోగిపంతులు గారికి కంపెనీ దొరల దగ్గర చాలా పలుకుబడి యున్నందువల్ల ఆ దొరల దర్శించడానికి వచ్చినవారు అందరూ వీరిని ముందుగా దర్శించేవారు.

1766 సం॥వత్సరంలో కంపెనీవారు ఉత్తర సర్కారులను కౌలు పొందిన తరువాత వివిధ ప్రాంతాలలో నున్న జమీందారులు దొరలను దర్శించడానికి బందరు వచ్చేవారు. వారందరూ జోగి పంతులు గారిని మంచి చేసుకునేవారు. ఆ సందర్భంలో పెద్దాపురం తిమ్మ జగపతి మహారాజు బందరు వచ్చి జోగి పంతులు గారిని

దర్శించడానికి వచ్చారనీ, ఆయన ఆ సమయంలో పూజలో నుండగా వారి కచేరీ చావడిలో వారి బాలీసు[96] నానుకుని తివాసీ పైన కూర్చున్నారని తరువాత జోగి పంతులుగారు వచ్చి కోపగించుకున్నారని అంతట వారిరువురికి ఘర్షణ జరిగిందని నొక కథ ప్రచారంలో ఉన్నది. (చూడు తిమ్మ జగపతి -కథలు గాధలు దిగవల్లి వేంకట శివరావు)

గాజుల లక్ష్మీనరుసు సెట్టి గారు

గాజుల లక్ష్మీనరుసు సెట్టి గారు చెన్నపట్నంలో గొప్ప వర్తకులగు సిద్దుల సెట్టి గారి కుమారుడు. సిద్దుల సెట్టి కంపెనీ విదేశాలకు ఎగుమతి వ్యాపారం చేసే ఏజెంట్లు. నీలిమందు తయారు చేసి ఎగుమతి చేసేవారు.

1846 సం॥ మద్రాసు అల్మానాక్ లో

Siddu Chetty G & Co Armenian Sreet.

Partners: C. Venkata Krishnamamah Naidu, G. Latchme narsu Chetty,

C.Narasimha Swamy Naidu

1854సం॥లో Partners: G.Latchmenarsu Chetty, C. Venkataroyooloo Naidu,

C. Veera raghavula Naidu

అనే వివరములున్నవి.

లక్ష్మీనరుసు సెట్టి గారు 1806 సం॥లో పెరియ మెట్టలో జన్మించి చెన్నప ట్నం పాఠశాలలో తెలుగు లెక్కలు ఇంగ్లీషు నేర్చుకున్నారు. ఆయనకు చిన్నప్పటినుండి విద్వత తృష్ణ వున్నవారు. సంస్కృతా ఆంధ్ర గ్రంథములను చాలా సేకరించి ఒక గొప్ప భాండాగారం చేర్చినారని, శ్రీ బహుజనపల్లి సీతారామాచార్యులు వారు ఆ పుస్తక భాండాగార మునుపయోగించినట్లు శబ్దరత్నాకర పీఠికలో వ్రాశారు. లక్ష్మీనరుసు గారు చెన్న పట్నం పుర ప్రముఖులలో గొప్ప పలుకుబడి కలవారు. [పరవస్తు]చిన్నయసూరి

---

[96] బనీసు = ఆనుకోడానికి దిండు.

1809 లో జన్మించాడు. ఆయన తండ్రి పరవస్తు వెంకట రామానుజాచార్యులు. లక్ష్మీనరుసు గారి సిఫార్సుతో ఆయన మద్రాసు సుప్రీంకోర్టులో ధర్మశాస్త్ర పండితుడుగా నియమింపబడినాడు. ఆయన 1836 సం॥లో దివంగతులు అయినాడు. చిన్నయసూరి చిన్నప్పటినుండి లక్ష్మీనరుసు గారికి స్నేహితుడు. లక్ష్మీనరుసు సెట్టి గారు 1842 సం. స్థాపించబడిన పచ్చ య్యప్ప మొదలియర్ పాఠశాల ధర్మకర్తల సంఘమునకు అధ్యక్షులు. కొమలేశ్వర పురం శ్రీనివాస పిళ్ళె గారు మొదలైన వారు లక్ష్మీనరుసు గారికి స్నేహితులు. వీరి సిఫారసు వలననే 1844 సం॥ ప్రారంభంలో చిన్నయ సూరి గారిని తెలుగు పండితుడుగా నియమించిరి. 1841సం॥ లో మద్రాస్ యూనివర్సిటీ అనే పేరుతో స్థాపించబడిన ఉన్నత పాఠశాలలో ఆరు సంవత్సరములు పుదూరు సీతారామ శాస్త్రి గారు తెలుగు పండితులుగా నుండిరి. ఆయనకు ఇంగ్లీషు రాదు. 1840 సం॥లో ఇంగ్లీషు వచ్చిన తెలుగు పండితుని నియమింప దలచినామని ప్రకటించి పురాణం హయగ్రీవ శాస్త్రి గారిని… సశేషం

— ✦ ❖ ✦ ——

అనుబంధము-2

వేదం వేంకటరాయ శాస్త్రి(1853-1929) గారికి బెజవాడ మున్సిపాలిటీ వారు సమర్పించిన అభినందన పత్రం[97]

మహా మహోపాధ్యాయ కళాప్రపూర్ణ బిరుదాంకితులగు బ్రహ్మశ్రీ వేదం వేంకట రాయ శాస్త్రి గారికి

విద్యాశేఖరా!! స్వాగతము

పురాణేతిహాస ప్రసిద్ధమును, కృష్ణవేణి పూర్వ నదీతీరములోను, దుర్గా క్షేత్రమునగు ఇంద్రకీలాద్రి మీ కీర్తి కాంతులను ధరించుటకు అలరు చున్నది. మా విజయవాటిక పురజనులు మీకు హృదయపూర్వకముగా స్వాగతమి చ్చుచున్నారు.

ఆంధ్ర గీర్వాణాంగ్లేయ విద్యా విశారదులగు మీరు మాకు చిరపరిచితులును, ఆంధ్ర సామ్రాజ్య మహా మాత్యులగు యుగంధరుల వారు మీ దేశాభిమానమును ప్రభు మంత్రోత్సాహ శక్తులను మాకెఱింగించియున్నారు. మీ హాస్య వల్లరిని పేరిగాడు మా యెదుట ప్రదర్శించి యున్నాడు. తామాంధ్రులకిచ్చిన విద్వదౌషధమును మేము కూడా కొంచెము సేకరించి యున్నాము. మీ మూలముననే కాళిదాసాది మహాకవులు తమ గీర్వాణమును వదలి తెలుగువారైరి. ఆముక్తమాల్యదకు సంజీవనిని చేకూర్చి చిగురింపజేసిన మీ చతురతనెఱిగితమి. మీ తపోధనమున బృహత్కథ యొక్క పైశాచిక కళను తొలగించి ఆంధ్రలక్ష్మికి కానుకగా నిచ్చిరి. ఆంధ్ర వాఙ్మయము యొక్క విమర్శమున చక్కర మడలం దమృతము పారించి చూపితిరి. ఇట్టి విద్యాధికులు, రసజ్ఞుల మీరు కళాప్రపూర్ణులగుటలో ఆశ్చర్యమేమున్నది?

.....(?చే) మీ వాగమృతము మఱింత ఫలభరితములైనవి. ఆంధ్ర వాఙ్మయము మీ చేయుతవలన నూతన కాంతు లీనుచున్నది. మల్లికేశ్వరాలయ వీధినుండి, జ్యోతిష్మతీ కార్యాలయము నుండి, వెడలిన ఉద్గ్రంథ సముదాయము మీ భాషాభిమాన

---

97 బెజవాడ మునిసిపాలిటీ వారి తరఫున ది 05-12-1927 తేదిన సమర్పించిన ఈ అభినందన పత్రము రచించినవారు కీ. శే. దిగవల్లి వేంకట శివరావు గారు

మును వేనోళ్ల జాటుచున్నది. నేటి ఆంధ్ర విద్యాపీఠమున ఆచార్య శ్రేణిలోని మీ శిష్యులు మీ మహామహోపాధ్యాయ బిరుదమును సార్థకముచేయుచున్నారు. ఇట్టి విద్వద్వ రేణ్యులు, పూజనీయులు నగు మీరు మానగరమునకేతెంచుట పురజనులు హర్షించుచున్నారు.

ఆర్యా! ప్రజాళి యనురాగమునకు పాత్రులై, ఆంధ్రమహా. జనసభయంధ్రాంధ్ర మహాజనులొసంగిన బిరుదముల నందితిరి. పండిత సభలయందు విజయులై మన్ననలందితిరి. చెన్నపురి విశ్వ విద్యాలయ మంద్రాధ్ర పీఠమునలంకరించతిరి. ఆంధ్ర విశ్వవిద్యాలయ స్తాపనములో పాల్గొంటిరి. ఆంధ్ర విద్యాపీఠముననే కళాప్రపూర్ణ బిరుదమునందితిరి. ఆంధ్ర ప్రదేశమునందలి నగరరాజములందు చరిత్ర ప్రసిద్ధమగు విజయవాటిక Freedom of the City గౌరవమును మీ కీకొన్నది ఆంధ్ర విద్యాపీఠ కార్యస్థానమున నున్న ఈ నగరమే ఆంధ్ర రాజధాని యగునట్లు దీవింపుడని మిమ్ముల కోరుచున్నది.

ఇంకను భాష సేవ చేసి ఆంధ్రాభ్యుదయమునకు తోడ్పుడుటకు మీకాయురా రోగ్యముల నిచ్చుగాక యని పరమేశ్వరుని ప్రార్థించుచున్నాము.

చిత్తగించవలెను.

ఇట్లు విధేయులు

బెజవాడ పురపాలక సంఘం వారు.

ప్రస్తావించబడిన ప్రముఖులు, గ్రంథములు, పత్రికలు

కీ.శే. దిగవల్లి వేంకటశివరావు

బి.ఎ.,బి.ఎల్.(1898-1992):



జననం:1898 ఫిబ్రవరి 14, కాకినాడ. చదువు: రాజమండ్రి వీరేశలింగం హైస్కూలు(1910-1916), మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజ్ (1916-1920), మద్రాసు లా కాలేజ్ (1920-1922). వృత్తి: న్యాయవాది, విజయవాడ (1922-1970). రచనలు: 1928 నుండి 1992 వరకూ సుమారు 60 పుస్తకాలు రచించారు. వాటిలో 45 ప్రచురించబడినవి. వీరి వ్యాసములు సుమారు 300 వివిధ పత్రికలలో 1918సం. నుండి 1988సం. వరకూ ప్రచురితమైనవి. స్వాతంత్ర్య పోరాట కాలంలో వీరు1930సం.లో రచించిన చిన్న పుస్తకములను, కర పత్రములను ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వము వారు నిషేధించిరి. 1930,1931 సం.లలో వీరిపై రెండు సార్లు రాజద్రోహం కేసులు పెట్టబడినవి. వృత్తిరీత్యా న్యాయవాదులైన ప్పటికినీ, వీరు చరిత్ర పరిశోధకులుగా గుర్తింపు పొంది యుండిరి. అలనాటి తెలుగు రచయితలలో అగ్రగణ్యులు. 1959 లో వీరి ఆఫ్రికా జాతీయోద్యమము అను పుస్తకమును భారత రాష్ట్రపతి డా. బాబూ రాజేంద్ర ప్రసాదు గారు ఆవిష్కరించిరి. 1966 లో రాష్ట్ర ప్రభుత్వముచేత సన్మానింపబడిరి. బ్రిటిష్ ఇండియా యుగం 18,19 శతాబ్దాలనాటి చరిత్రలు వీరి ప్రత్యేకత. 1960 దశాబ్దములో రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించిన తెలుగు పరిభాష (గ్లాసరీ) నిఘంటువు సంకలన సభ్యులు. సర్వ శ్రీ కట్టమంచి రామలింగా రెడ్డి, మల్లంపల్లి సోమశేఖరశర్మ, వేటూరి ప్రభాకరశాస్త్రి మున్నగు ప్రముఖులు వీరి రచనలను ప్రశంసించిరి. వీరి రచనలు, వ్యాసములు అనేక చరిత్ర పరిశోధకులు పి.హెచ్.డి పొందుటకు తోడ్పడుచున్నవి. ఏనుగుల వీరాస్వామయ్య గారి కాశీయాత్ర చరిత్ర (1941సం) వీరి పరిశోధనా పటిమకు నిదర్శనం. మరణం: 1992, అక్టోబరు 3. భోపాల్, మధ్య ప్రదేశ్.

సంపాదకులు: దిగవల్లి రామచంద్ర (జననం1943)

digavalli1943@gmail.com